: fb.com/vaartha Digital
epaper.vaartha.com
WWW.VAARTHA.COM

హైదరాబాద్

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

1-8-2026
శనివారం
సంపుటి: 32
సంచిక: 182
పేజీలు: 10+4
వెల: 6.50

## కేంద్రమంత్రి జితేంద్రసింగ్‌పై
# వాక్కుల ఉల్లంఘన నోటీసు
### లోక్‌సభలో ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ఎంపి కెసి వేణుగోపాల్



**న్యూఢిల్లీ,జులై 31:** కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌పై కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ సభ్యుడు కె.సి. వేణుగోపాల్ సభా హక్కుల ఉల్లంఘన (ప్రివిలేజ్ మోషన్) నోటీసు దాఖలు చేశారు. ఈనెల 20న జరిగిన విద్యార్థుల నిరసనల సందర్భంగా నిరసనకారులపై ఎలాంటి కాల్పులు జరగలేదని లోక్‌సభలో మంత్రిచేసిన వ్యాఖ్యలు పార్లమెంట్‌ను ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టించేవిగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. వేణుగోపాల్ తన నోటీసులో మంత్రి చేసిన ప్రకటనలు వాస్తవ పరిస్థితులకు పూర్తిగా విరుద్ధమని పేర్కొన్నారు. మంత్రి చేసిన వ్యాఖ్యలకు భిన్నంగా కాల్పులు జరిగాయి. కాల్పుల్లో గాయపడిన వ్యక్తి ఇప్పటికీ చికిత్స పొందుతున్నారు. దీనికి సంబంధించిన వివరాలు బహిరంగంగానే అందుబాటులో ఉన్నాయి. అయినప్పటికీ లోక్‌సభలో కాల్పులు జరగలేదని చెప్పడం ద్వారా మంత్రి తెలిసీ తప్పు సమాచారం ఇచ్చి సభను తప్పుదోవ పట్టించారని ఆయన ఆరోపించారు. ఈనెల 29న ప్రజా పరీక్షలు (అక్రమ మార్గాల నివారణ) >>2

## కామన్‌వెల్త్ క్రీడల్లో భారత్‌కు జూడోలో రెండు స్వర్ణాలు
# చరిత్ర సృష్టించిన అస్మితా డే



**గ్లాస్గో,జులై 31:** కామన్వెల్త్ గేమ్స్‌లో భారత క్రీడాకారిణి అస్మితా డే అద్భుత ప్రదర్శనతో స్వర్ణ పతకం సాధించింది. జూడో మహిళల 48 కేజీల విభాగం ఫైనల్‌లో ఉత్కంఠభరిత పోరులో విజయం సాధించిన అస్మితా భారత్‌కు ఈ క్రీడల్లో నాలుగో బంగారు పతకాన్ని అందించింది. కామన్వెల్త్ గేమ్స్ జూడో విభాగంలో భారత్‌కు తొలి స్వర్ణ పతకం అందించిన క్రీడాకారిణిగా అస్మితా డే రికార్డు సృష్టించింది. మరోవైపు జూడోలోనే హార్ష్ సింగ్, యామిని మోర్యలు కూడా నేడు స్వర్ణ పతకాల కోసం పోటీ పడనున్నారు. అటు పురుషుల విభాగంలో 68 కిలోల విభాగంలో హార్షసింగ్‌కు స్వర్ణం లభించింది. బాక్సింగ్ విభాగంలో ప్రీతి పవార్, అంకుష్ పంఘల్, జైస్మిన్ లాంబోరియా, జదుమణి సింగ్, అరుంధతి చౌదరి శనివారం జరగనున్న ఫైనల్స్‌కు అర్హత సాధించారు.

### టేబుల్ టెన్నిస్‌లో రెండు స్వర్ణాలు -'ఆట'లో




## 10 తేదీ దాకా 'సర్' పొడిగింపు
### రాష్ట్రంలో 77.12% ఎన్యూమరేషన్ పూర్తి
### 17న ముసాయిదా విడుదల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై31:** తెలంగాణ రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ ఐఆర్) గడువు తేదీని ఎన్నికల సంఘం మరోసారి పొడిగించింది. ఆగస్టు3వ తేదీతో పూర్తి కావాల్సిన ఎన్యూమరేషన్ ప్రక్రియను ఆగస్టు 10వ తేదీ వరకు పొడిగిస్తూ ఇసి నిర్ణయం తీసుకుంది. ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ పూర్తయినప్పటికీ, ఓటర్లు వాటిని నింపి ఇవ్వాల్సి ఉంది. ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తవ్వాల్సి ఉంది. జూన్ 25వ తేదీ నుంచి రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జరుగుతోంది. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 77.12 శాతం ఎన్యూమరేషన్ పూర్తయినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. హైదరాబాద్ నగరంలో 56.31 శాతం, రంగారెడ్డిజిల్లాలో 63.43 శాతం ఎన్యుమరేషన్ పూర్తయినట్లుగా ఎన్నికల >>2

# 'ఫ్యూచర్'కు 'ఫార్చ్యూన్'

### పెట్టుబడులకు అనువైన వాతావరణం కల్పించాం
### రాష్ట్రంలో పాలసీ పెరలసిస్ లేదు
### ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుస్తాం
### సిఐఐ ఉత్తర భారత ప్రతినిధుల సమావేశంలో సిఎం రేవంత్



శుక్రవారం హైదరాబాద్‌లో సిఐఐ ఉత్తరభారత ప్రతినిధులతో సిఎం రేవంత్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై31:** వివిధ రంగాల్లో పెట్టుబడులకు తెలంగాణ సురక్షిత స్థానమని, తెలంగాణకు వచ్చి పెట్టుబడులు పెట్టాలని భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) ఉత్తర భారత ప్రతినిధులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం పెట్టుబడులకు రక్షణగా నిలుస్తుందని సిఎం హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి బోధి పెవిలియన్‌లో సిఐఐ ఉత్తర భారత ప్రతినిధులు శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన కాంగ్రెస్ పార్టీ 140 యేళ్లుగా విజయ వంతంగా కొనసాగుతున్నట్లే, సిఐఐ కూడా >>2

### పాస్‌పోర్టు నుంచి ఉద్యోగం వరకు టామ్‌కామ్‌దే బాధ్యత: సిఎం రేవంత్ 7లో



శుక్రవారం భద్రాచలం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

# ఉగ్ర గోదావరి
### భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ
### వరదమట్టం మరింత పెరిగే అవకాశం
### అధికార యంత్రాంగం అప్రమత్తం

**భద్రాచలం, జూలై 31(ప్రభాతవార్త):** గోదావరి మళ్లీ ఉప్పొంగి తన ఉగ్రరూపాన్ని ప్రదర్శిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో సమ్మక్క సాగర్ నుంచి ఏకంగా 14 లక్షల 70 వేల క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల కావడంతో భద్రాచలం వద్ద గోదావరి ప్రమాదకర స్థాయికి చేరువవుతోంది. శుక్రవారం ఉదయం 10 గంటలకి భద్రాచలం వద్ద గోదావరి వరద ప్రవాహం 43 అడుగులకు చేరుకొని గాని జిల్లా >>2

### గోదావరిలో చిక్కుకొన్న 30 మంది సురక్షితం 2లో

# నెలాఖరులో ఇందిరమ్మ టవర్స్



### తొలివిడత గృహనిర్మాణానికి శ్రీకారం
### మరో 4 నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు పూర్తి: మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై31:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ టవర్స్ పథకం కింద తొలి విడత గృహ నిర్మాణ పనులను ఆగస్టు చివరి వారంలో ప్రారంభించ నున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. శుక్రవారం సచివాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన మంత్రి ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, అది పూర్తి కాగానే పనులు ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. హైదరాబాద్ నగరంలోని క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందులోభాగంగా ప్రయోగాత్మకంగా తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 500 చొప్పున మొత్తం 8 వేల ఇళ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికే ఈ 16 నియోజకవర్గాలతో పాటు మరో నాలుగు నియోజకవర్గాల్లో కూడా స్థలాల గుర్తింపు పూర్తయిందని, దశలవారీగా మొత్తం లక్ష ఇళ్ల నిర్మాణాన్ని విస్తరిస్తామని చెప్పారు. పేద కుటుంబాలు కూడా హైదరాబాద్‌లోని అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో గౌరవప్రదమైన జీవితం గడపాలన్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రి స్పష్టం చేశారు. ఈ లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వస్తే కొన్ని రాజకీయ పార్టీలు దుష్ప్రచారం చేసినప్పటికీ ప్రజలు వాటిని నమ్మలేదని, ప్రస్తుతం భారీగా వస్తున్న దరఖాస్తులే ఇందిరమ్మ టవర్స్‌పై ప్రజల విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. ప్రభుత్వానికి చెందిన వందల కోట్ల రూపాయల విలువైన భూముల్లో టవర్స్ నిర్మించి, ప్రతి లబ్ధిదారునికి 20 నుంచి 22 గజాల అన్‌డివైడెడ్ షేర్‌ను ఉచితంగా వారి పేరుమీద రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. భూమి విలువతో కలిపి ఒక్కో ఫ్లాట్ మార్కెట్ విలువ రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉంటుందని చెప్పారు. ఫలక్‌నుమా ప్యాలెస్ సమీపంలోకూడా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. పేదల >>2

### ఎపిలో భోగాపురం ఎయిర్‌పోర్టు నేడు ప్రారంభం 2లో

### పిఎన్‌బికి ఎన్‌సిఎస్ సుగర్స్ రూ. 105.44 కోట్లు
# టోకరా

**హైదరాబాద్, జులై 31, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో పేరుగాంచిన ఎన్‌సిఎస్ షుగర్స్ సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంకునుంచి తప్పుడు పత్రాలతో 105.44 కోట్ల రూపాయల రుణం తీసుకుని దానిని ఎగ్గొట్టిన వైనంపై సిబిఐ శుక్రవారం ఉభయ రాష్ట్రాల్లోని పదిచోట్ల దాడులు నిర్వహించింది. ఎపిలోని విజయనగరంలో గల ఎన్‌సిఎస్ షుగర్స్ సంస్థకు కార్పొరేట్ ఆఫీస్ హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో వుంది. ఈ కంపెనీ రెండేళ్ల క్రితం చెన్నైలోని పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి సంస్థ అవసరాల కోసం 105.44 కోట్ల రూపాయలను తీసుకుంది. అయితే ఇందు కుగానూ తనఖా పెట్టినపత్రాలునకిలీవని పంజాబ్ నేషనల్ బ్యాంకు అధికారులు ఆలస్యంగా గుర్తించారు. ఇదే సమయంలో కిస్తులుకూడా సవ్యంగా చెల్లించక పోవడంతో బ్యాంకు అధికారులు వెంటనే ఎన్‌సిఎస్ షుగర్స్ నిర్వాహకులకు అడిగినా సరైన సమాధానం లేక పోవడంతో నేరుగా సిబిఐకి ఫిర్యాదు చేశారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు బెంగళూరు సిబిఐ ఆర్థిక నేరాల విభాగం కేసు నమోదు చేసి అన్ని >>2

## ఏసిబి కోర్టు విచారణకు
# కెటిఆర్ హాజరు



శుక్రవారం నాంపల్లి కోర్టుకు హాజరైన కెటిఆర్

### ఫార్ములా ఇ-కార్ రేసు కేసులో అర్వింద్ కుమార్, బిఎల్ఎన్ రెడ్డి కూడా హాజరు
### విచారణ 25కు వాయిదా

**హైదరాబాద్, జులై 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రాజకీయంగా సంచలనం రేపిన ఫార్ములా ఈ కార్ రేసుకు ఎసిబి నమోదు చేసిన కేసులో బిఆర్ఎస్ నేత మాజీ మంత్రి కెటిఆర్‌తో పాటు సీనియర్ ఐఎఎస్ అధికారి అర్వింద్ కుమార్, హెచ్ఎండిఎ విశ్రాంత ఇంజనీర్ బిఎల్ఎన్ రెడ్డిలు శుక్రవారం నాడు నాంపల్లి ఎసిబి కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముగ్గురు లక్ష రూపాయల పూచీకత్తును కోర్టుకు సమర్పించగా ఈ కేసు విచారణను ఆగస్టు 25వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. బిఆర్ఎస్ హయాంలో మూడేళ్ల క్రితం జరిగిన పార్ములా ఇ-కార్ రేసులో అక్రమాలు జరిగాయని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా హెచ్ఎండిఎ నుంచి బ్రిటన్‌లోని ఓ బ్యాంకుకు 55 కోట్ల రూపాయలను బదిలీ చేయడంతో పాటు 75.88 కోట్ల రూపాయలకు పైగా నిధులు గోల్‌మాల్ జరిగిందని ఎసిబికి మున్సిపల్ పరిపాలన శాఖ నుంచి 2024 అక్టోబరు నెలలో ఫిర్యాదు రావడం తెలిసిందే. దీనిపై విచారణ జరిపిన ఎసిబి అధికారులు 2024 డిసెంబర్ నెలలో కెటిఆర్ సహా ఐదుగురిపై కేసు నమోదు చేయడం విదితమే. ఇందులో కెటిఆర్ మొదటి ముద్దాయిగానూ అప్పట్లో >>2





శుక్రవారం పార్లమెంటువద్ద కాంగ్రెస్ ఎంపీలు ప్రియాంక, సంజనా జాదవ్

# 'సర్' పొడిగింపు

>> సంఘం వెల్లడించింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 61.37శాతం ఎన్యుమరేషన్ పూర్తయింది రాష్ట్రవ్యాప్తంగా 3.38కోట్లకు పైగా ఓటర్లు ఉండగా ఇంకా సుమారు 60 లక్షల మంది ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించలేదు. వారిలో సుమారు 30లక్షల మంది అన్‌కలెక్టబుల్ కేటగిరీలో ఉన్నట్లు బిఎల్ఒలు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయానికి నివేదించినట్లు తెలుస్తోంది. చనిపోవడం లేదా శాశ్వతంగా మరో ప్రాంతానికి వెళ్లిపోవడం లేదా పూర్తిగా అందుబాటులో లేకపోవడం వంటి కారణాల వల్ల ఫారాలు ఇవ్వడం లేదని గుర్తించారు. అలాంటి ఓటర్ల పేరు ముసాయిదా జాబితా నుంచి తొలగించే అవకాశం ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 40 లక్షల ఓట్లను మళ్లీ తిరిగి వెరిఫై చేసుకునేందుకు వీలు లేని (అన్‌కలెక్టబుల్) వాటిగా పరిగణిస్తూ వాటిని తొలగించేందుకు ఎన్నికల అధికారులు సిద్ధమవుతున్నట్లుగా సమాచారం. అన్‌కలెక్టబుల్ జాబితాలో ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్ (ఎఎస్‌డి) కేటగిరీ కింద ఉండే ఓటర్లను చేరుస్తూ, వారి ఓట్లను తీసివేసేందుకు సిద్ధం చేస్తున్నట్లు ఎన్నికల సంఘం(ఇసి) అధికారులు చెబుతున్నారు.

## ఎల్ఆర్ఎస్ గడువు మరో 4 నెలలు పొడిగింపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై31:** రాయితీ (25శాతం)తో కూడిన లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్)ను మరో 4నెలల పాటు ప్రభుత్వం పొడిగించింది. దీని గడువు శుక్రవారం (జులై 31)తో ముగియగా మరో 4నెలల పాటు పొడిగించింది. ఆగస్టు 1 నుంచి నవంబర్ 30 వరకు ఇది అమలులో ఉంటుంది. ఈ స్కీమ్ కింద ఆమోదం పొందిన, అర్హమ లేఅవుట్లను క్రమబద్ధీకరించనుంది. ఇప్పటి వరకు ఎల్ఆర్ఎస్ కింద మొత్తం 25.50లక్షల దరఖాస్తులు ఇంకా పరిశీలన దశలోనే ఉన్నాయి.

## రేషన్ కార్డుల ఇ-కెవైసి గడువు 31 వరకు పెంపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై31:** రేషన్ కార్డుల ఇ-కెవైసి గడువు ఆగస్టు 31 వరకు పొడిగించారు. రాష్ట్రంలో వర్షాలు, సర్ ప్రక్రియ దృష్ట్యా ఇ-కెవైసి గడువును ప్రభుత్వం పొడిగించింది. ఆగస్టు 1 నుంచి చౌకధర దుకాణాల్లో 3 నెలల రేషన్ పంపిణీ చేయనున్నారు. ఆగస్టు 31 వరకు మూడు నెలల రేషన్ తీసుకోవచ్చని ప్రభుత్వం తెలిపింది. పోర్టబిలిటీ ద్వారా ఏ దుకాణం నుంచైనా తీసుకోవచ్చని వెల్లడించింది.

## రూ. 105.44 కోట్లు టోకరా

>> వివరాలు సేకరించిన తరువాత శుక్రవారం మధ్యాహ్నం తరువాత హైదరాబాద్, కాకినాడ, విజయనగరంలోని పది చోట్ల దాడులు నిర్వహించింది. దాడుల సందర్భంగా సిబిఐ అధికారులు ఎస్ఎస్ మగ్గర్స్‌కు సంబంధించిన కీలక పత్రాలను, డిజిటల్ రికార్డులను జప్తు చేశారు. కంపెనీ నిర్వాహకులను సిబిఐ అధికారులు విచారించి పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి రుణం పొందిన సమయంలో సమర్పించిన నకిలీ పత్రాల వివరాలను రాబట్టారు. దీంతో పాటు ఎస్ఎస్ మగ్గర్స్ పుల్లుపుర్తోత్రాలు, ఆస్తిపాస్తుల వివరాలు, ఇతర వివాదాలకు సంబంధించి వివరాలను సిబిఐ అధికారులు సేకరించారు. కాగా ఎస్ఎస్ మగ్గర్స్‌కు సంబంధించి ఇద్దరు నిర్వాహకులపై 2017లోనూ సిబిఐ ఒకసారి చీటింగ్ కేసు నమోదు చేయడం గమనార్హం. అప్పట్లో ఈ కంపెనీ మరో బడా సంస్థను 82.11 కోట్ల రూపాయల మేరకు మోసం చేయడంతో సిబిఐ కేసు నమోదుచేసింది. దీనిపై ఒకవైపు విచారణ సాగుతుండగానే మరోసారి ఎస్ఎస్ మగ్గర్స్‌పై సిబిఐ కేసు నమోదయ్యింది.

## తెలంగాణ 'సర్'ను పరిశీలించిన ఇసిఐ సెక్రటరీ నవీన్ కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై31:** ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ నవీన్ కుమార్ తెలంగాణలో పర్యటించారు. సర్(ఎస్ఐఆర్) ప్రక్రియను సమీక్షించేందుకు ఆయన రాష్ట్రానికి వచ్చారు. అంతకుముందు ఆయనకు తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి, అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వాసం వెంకటేశ్వర రెడ్డి స్వాగతం పలికారు. నవీన్ కుమార్ సుదర్శన్‌రెడ్డితో రాష్ట్రంలో జరుగుతున్న 'సర్' ప్రక్రియ పురోగతిపై చర్చించారు. అనంతరం జిహెచ్ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎలక్షన్ ఆఫీసుకు వెళ్లి అధికారులతో మాట్లాడారు.

## నకిలీ ఎరువుల ముఠా అరెస్టు

**హుజూర్ నగర్ క్రైమ్, జూలై 31, ప్రభాతవార్త:** ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో ఉన్న అదును విషయాన్ని ఆసరాగా చేసుకొని తక్కువ ధరకు నకిలీ ఎరువులు విక్రయిస్తూ రైతులను మోసం చేస్తున్న ముఠా సభ్యులను పోలీసులు పట్టుకుని రైతులకు కలిగే ఆపార నష్టం నుండి వారిని బయటపడేశారు. శుక్రవారం హుజూర్ నగర్ సర్కిల్ కార్యాలయములో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో కోదాడ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి కేసుకు సంబంధించిన వివరాలు సిఐ చరమంద రాజుతో కలిసి వెల్లడించారు. ఆయన వివరాల ప్రకారం మఠంపల్లి మండలం రఘునాధపాలెంలో కొండలే పిచ్చిరెడ్డి అనే వ్యక్తి కొంతకాలంగా నకిలీ డీఏపీ విక్రయిస్తున్నారని ఏవో బోలేటి శ్రీనివాసు స్థానిక రైతుల నుంచి ఫిర్యాదు అందింది. ఎరువులను పరిశీలించిన ఏవో అవి నకిలీవని తేల్చి ఈ నెల15న మఠంపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసునమోదు చేసిన ఎస్ఐ ప్రవీణ్ కుమార్ దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల దర్యాప్తులో తెలంగాణాలోని మరికొన్ని ప్రాంతాల్లోని రైతులకు నకిలీ ఎరువులు విక్రయించినట్లు గుర్తించారు. ప్రాథమిక సమాచారంతో రంగారెడ్డిజిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని, పెద్దఅంబర్ పేట శివారులోని ఒ పాత కోళ్ల ఫారంలో క్రిమాస్ ఎంటర్ ప్రైజెస్ పేరుతో నకిలీ ఎరువులు తయారీ చేస్తున్నట్లు గుర్తించి పోలీసులు దాడి చేశారు. దాడిలో యూరియా తయారీకోసం వినియోగించే ఉపయోగించే ముడిసరుకులతో పాటు, ప్యాకింగ్, స్టిచ్చింగ్, ప్రముఖకంపెనీల పేర్లతోఉన్న ఖాళీ సంచులతో పాటు, కొన్ని బస్తాలను గుర్తించి సీజ్ చేశారు.

# 'ఫ్యూచర్'కు 'ఫార్చ్యూన్'

>> 130 యేళ్ల నుంచి విజయవంతంగా కొనసాగుతోందన్నారు. తెలంగాణ బిడ్డ పి.వి.నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు తీసుకువచ్చిన సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్‌పిజి) ఫలితాలను ఇప్పుడు మనం అనుభవిస్తున్నామని సిఎం అన్నారు.ప్రభుత్వాలు మారినా తెలంగాణలో పారిశ్రామిక విధానాలను మార్చడం లేదని సిఎం అన్నారు. 1994 నుంచి 2004 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు అనేక పెట్టుబడులను ఆకర్షించారని, బిల్ గేట్స్, బిల్ క్లింటన్ లాంటి దిగ్గజాలను హైదరాబాద్‌కు తీసుకువచ్చారని సిఎం గుర్తు చేశారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పాలనలో అంతర్జాతీయ ఎయిర్ పోర్టు, అవుటర్ రింగ్ రోడ్డు, ఫార్మా, ఐటీ కంపెనీలు హైదరాబాద్‌కు వచ్చాయన్నారు. 2014 నుంచి 2023 వరకు బిఆర్ఎస్ పాలనలో వాళ్లు కొన్ని పాలసీలు తీసుకువచ్చారని, వాటిని కొనసాగిస్తూనే తాము సరికొత్త పాలసీలు తీసుకువచ్చామని సిఎం తెలిపారు. రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ లేదని, నాయకులు ఎవరైనా, పార్టీ ఏదైనా మంచి పాలసీ తీసుకువస్తే అది కొనసాగుతోందన్నారు. తాము తీసుకువచ్చిన పారిశ్రామిక విధానాలతో పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని, మంచి ప్రతిపాదనలతో వచ్చిన వారికి ప్రోత్సాహకాలు ఇస్తున్నామని సిఎం తెలిపారు. ఫార్చ్యూన్ 500 కంపెనీలు భారత్ ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టాలనేది తమ ఆకాంక్ష అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీలో గత డిసెంబర్‌లో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాటు చేశామని, సమ్మిట్లో 175 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారని సిఎం వివరించారు. తెలంగాణ రైజింగ్ 2047 పాలసీని గ్లోబల్ సమ్మిట్‌లో ప్రకటించామని సిఎం తెలిపారు. ప్రస్తుతం దేశ జిడిపిలో తెలంగాణ వాటా అయిదు శాతంగా ఉందని, అది 10 శాతంగా ఉండాలన్నదే తన లక్ష్యమని సీఎం వెల్లడించారు.

కాలుష్యంతో ఢిల్లీ, వర్షాలతో ముంబయి, ట్రాఫిక్ కష్టాలతో బెంగళూరు, ప్రకృతి వైపరీత్యాలతో చెన్నై సతమవుతున్నాయని, ఈ నేపథ్యంలో భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించామని సిఎం తెలిపారు. 160 కి.మీ. పొడవైన ఔటర్ రింగు రోడ్డు లోపల ప్రాంతాన్ని క్యూర్‌గా గుర్తించామని, ఇక్కడ సర్వీస్ సెక్టార్‌కు పెద్ద పీట వేస్తున్నామని సిఎం తెలిపారు. ఔటర్ రింగు రోడ్డు నుంచి రీజినల్ రింగు రోడ్డు వరకు ప్రాంతాన్ని ప్యూర్‌గా గుర్తించామని, అక్కడ మాన్యుఫ్యాక్చర్ రంగానికి ప్రాధాన్యమిస్తున్నామని సిఎం తెలిపారు. రీజినల్ రింగు రోడ్డు వెలుపల వ్యవసాయ రంగానికి, అగ్రి పరిశ్రమలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు సిఎం వివరించారు. ప్యూర్, రేర్ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములు ఇవ్వడంతో పాటు ఇతర వసతులు కల్పిస్తామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీపట్నం పోర్టు వరకు 12 లేన్ల రహదారి నిర్మించనున్నామని, విభాగాల వారీగా క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని సిఎం వివరించారు. వరంగల్, ఆదిలాబాద్‌లో ఎయిర్ పోర్టుల నిర్మాణాలకు కేంద్రం నుంచి అనుమతి తెలిపిందని, 7 బుల్లెట్ ట్రైన్లను కేంద్రం ప్రకటిస్తే 3 తెలంగాణకు వచ్చాయన్నారు. శంషాబాద్ నుంచి చెన్నై, శంషాబాద్ నుంచి పూణె, శంషాబాద్ నుంచి బెంగళూరు బుల్లెట్ ట్రైన్లు రాబోతున్నాయన్నారు. పొరుగు రాష్ట్రాలతో పోటీ పడదల్చుకోలేదని, ప్రపంచంలోని ఇతర దేశాలతో పోటీ పడి చైనా + కంట్రీగా తెలంగాణను నిలపడమే తన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 2037 నాటికి వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దుతామని సిఎం తెలిపారు. తెలంగాణ సంస్కృతి తమకు పెద్ద ఆస్తి అని, హైదరాబాద్‌లో అన్ని రాష్ట్రాల ప్రజలున్నారని సిఎం తెలిపారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టిన దానికి రెట్టింపు ఆదాయం వస్తుందని సిఎం అన్నారు. పారిశ్రామికవేత్తలు తమకు ఏం కావాలో చెబితే ఆ వసతులు కల్పిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి నిత్యం అందుబాటులో ఉంటారని, పరిశ్రమల శాఖ మంత్రి ప్రతి రెండు నెలలకోసారి, తాను ప్రతి మూడు నెలలకు ఒకసారి అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తామని సీఎం తెలిపారు. తెలంగాణను మీ సొంత ప్రాంతంగా భావించాలని సీఐఐ ప్రతినిధులకు సీఎం సూచించారు. ఏఐ సునామీతో వైట్ కాలర్ జాబ్‌లు పోతున్నాయని, దాంతో తాము నైపుణ్యాభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించినట్లు సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పబ్లిక్,ప్రైవేట్ భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నెలకొల్పామని, దానికి ఛైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా, డైరెక్టర్లుగా కార్పొరేట్ కంపెనీల దిగ్గజాలు ఉన్నారని సిఎం తెలిపారు. దేశంలోనే తమది బెస్ట్ స్కిల్ యూనివర్సిటీ అని సీఎం అన్నారు. రాష్ట్రంలోని ఐటీఐలను ఏటీసీలుగా మార్చుతున్నామని, అందులో శిక్షణ పొందిన వారికి 100 శాతం ఉద్యోగాలు వచ్చాయని సీఎం తెలిపారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులనే బోధిస్తున్నామన్నారు. ఇక్కడి జిసిసిల్లో 200 కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాయని, అమెజాన్ డేటా సెంటర్ల పైన రూ.లక్ష కోట్ల పెట్టుబడి పెడుతోందని, అదాన్ రూ.35 వేల కోట్లు డేటా సెంటర్ పైన పెట్టుబడి పెడుతోందని సీఎం తెలిపారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు రామకృష్ణారావు, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య, సీఐఐ నార్తరన్ రీజియన్ వైస్ ఛైర్మన్ శారదా సూరి మార్వా, ప్రతినిధులు కృష్ణ బోధనపు, గౌరవ్ మహేశ్వరి, వనిత దాట్ల, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వినోద్ కె బాప్న తదితరులు పాల్గొన్నారు.

**తెలంగాణ పారిశ్రామిక విధానాలకు ఆకర్షితులమయ్యాం..**

పునీత్ కౌరా, ఛైర్మన్, సిఐఐ నార్తరన్ రీజియన్‌తెలంగాణ పారిశ్రామిక విధానాలు చాలా బాగున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలు, ఇస్తున్న మద్దతుతో జిసిసిలు హైదరాబాద్‌కు వరుస కడుతున్నాయి. పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం ఇక్కడ ఉంది. మౌలిక వసతులు, ప్రభుత్వ సహాయ సహకారాలు మెరుగ్గా ఉండడంతోనే సమావేశానికి హైదరాబాద్‌ను ఎంచుకున్నాం. ఇక్కడ అధ్యయనం చేసేందుకు వచ్చాం అని సిఐఐ నార్తరన్ రీజియన్ ఛైర్మన్ పునీత్ కౌరా తెలిపారు.

# నెలాఖరులో ఇందిరమ్మ టవర్స్

>> జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ఇళ్ల కేటాయింపు, నిర్మాణం చేపడుతున్నామని, అందువల్ల ఏ నియోజకవర్గానికి చెందిన వారు ఆ నియోజకవర్గంలోనే దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. దరఖాస్తుదారులు నివాస ధృవీకరణ కోసం ఆధార్ కార్డు మాత్రమే కాకుండా ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్‌బుక్ వంటి పత్రాలను కూడా సమర్పించవచ్చని మంత్రి తెలిపారు. దీంతో ప్రజలు అనవసర ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. దరఖాస్తుల గడువును ఎట్టి పరిస్థితుల్లోనూ పొడిగించే ఆలోచన లేదని, ఆగస్టు 10లోపు తప్పనిసరిగా దరఖాస్తులు పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఇంటి కోసం చెల్లించే రూ.10 వేల ఇఎండీ విషయంలో ఎలాంటి అపోహలకు గురికావద్దని, అర్హత లభించని వారికి వంద శాతం మొత్తం తిరిగి చెల్లిస్తామని మరోసారి స్పష్టం చేశారు. యుపిఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా ఇఎండీ చెల్లిస్తే, అదే బ్యాంకు ఖాతాకు నేరుగా రీఫండ్ జమ అవుతుందని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం ప్రజా ప్రయోజనాల విషయంలో పారదర్శకత, బాధ్యతతో ముందుకు సాగుతుందని, ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజలకు మేలు జరిగేలా, దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అమలు చేస్తోందన్నారు. ఎవరి పట్లా కక్షపూరిత వైఖరి లేకుండా, సామాన్య ప్రజలు హర్షించే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలనే ప్రభుత్వం చేపడుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

# ఉగ్ర గోదావరి

>> కలెక్టర్ మొదటి ప్రమాదహే చేరికను జారీ చేశారు. ఇట్టి వరద ఉధృతి క్రమ క్రమంగా ఉధృతంగా పెరుగుతూ మధ్యాహ్నం మూడు గంటల 48 నిమిషాలకు 48 అడుగులకు చేరుకొన్నది. రెండో ప్రమాద హెచ్చరిక చేరుకోగానీ జిల్లా కలెక్టర్ పటావుటేనా అధికారాంగాన్నంతటినీ అప్రమత్తం చేస్తూ రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ప్రస్తుతం రాత్రి 8 గంటలకు అదే వేగాన్ని కొనసాగిస్తూ 50.60 అడుగుల ఎత్తున 12,91,256 క్యూసెక్కుల వరద నీరు కిందకు ప్రవహిస్తున్నది. పరిస్థితిని పరిశీలిస్తున్న జిల్లా అధికారులు నేడు మూడో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశలు ఉన్నట్లు ప్రకటించగా, భద్రాచలం పరిసర ప్రాంతాల ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఇప్పటికే భద్రాచలం నుండి కూనవరం వెళ్లే దారి, భద్రాద్రి నుండి చర్ల రూటు, సారపాక నుండి బూర్గంపాడు వెళ్లే రోడ్లలో రోడ్లపైకి వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వరద నీరు ప్రవహిస్తున్న మార్గాలలో పోలీసులు బార్‌గేట్లు ఏర్పాటు చేసి పహారా నిర్వహిస్తున్నారు.ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో గోదావరి ఉధృతి మరింత పెరగడం, రామన్నగూడెం వద్ద నీటిమట్టం వేగంగా పెరుగుతుండటం భద్రాచలానికి నేరుగా హెచ్చరిక సంకేతాలుగా మారింది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ఉధృతి యథాతథంగా కొనసాగితే భద్రాచలం వద్ద నీటిమట్టం మరింత పెరిగే అవకాశముందని నీటిపారుదల అధికారులు అంచనా వేస్తున్నారు.జిల్లా కలెక్టర్ అంకిత్ అన్ని శాఖల అధికారులతో అత్యవసర టెలికాన్ఫరెన్స్ నిర్వహించి హైఅలర్ట్ ప్రకటించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలని, గర్భిణులు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక రక్షణ కల్పించాలని ఆదేశించారు. ఇక ములుగు జిల్లాలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. జంపన్నవాగులో మద్యం మత్తులో ఈతకు దిగి గల్లంతైన వ్యక్తి కోసం ఎస్‌డీఆర్‌ఎఫ్, డీడీఆర్‌ఎఫ్ బృందాలు తొమ్మిది కిలో మీటర్ల మేర గాలింపు కొనసాగిస్తున్నాయి. వాజేడు మండలంలో గోదావరి ఉధృతితో వంతెనలు నీట మునిగిపోవడంతో పలు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అంతర్రాష్ట్ర రవాణాపైనా తీవ్ర ప్రభావంపడింది. పునరావాస కేంద్రాల సామర్థ్యం, రక్షణ చర్యలపై ఇంకా స్పష్టత అవసరమని అభిప్రాయపడుతున్నాయి. 2022లో భద్రాచలం చూసిన భారీ వరదల జ్ఞాపకాలు ఇంకా చెదరని వేళ, మళ్లీ అదే తరహా పరిస్థితులు తలెత్తుతాయా అన్న ఆందోళన ప్రజల్లోనెలకొంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో రానున్న 24 గంటలు భద్రాచలం పెద్ద పరిస్థితి అత్యంత కీలకంగామారనున్నది. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు వదంతులను నమ్మకుండా అధికారిక సూచనలను మాత్రమే పాటించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## గోదావరిలో చిక్కుకొన్న 30 మంది సురక్షితం

**చర్ల,జులై 31,( ప్రభాతవార్త):** గత మూడురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో మండలంలోని మారుమూల గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తు విధి నిర్వహన నిత్యం అప్రమత్తంగా ఉంటు రాత్రి పగలు కష్టపడుతున్నారు. అధిక వర్షాల కారణంగా మండలంలోని వద్దిపేట పూసుగుప్ప మద్యలో రోటెంతవాగుపై ఇటీవల నిర్మించిన వంతెన అప్రోచ్ రోడ్డు కొట్టుకుపొయింది.దీంతో ఆ ప్రదేశాన్ని పరిశీలించి ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసారు.ఇంతలో గోదావరి మద్యలో 30 మంది వరకు చిక్కుకున్నారని సమాచారం అందుకున్న ఆయన తహసీల్దారు శ్రీనివాసరావు ఎంపిడివో ఈదయ్య ఎస్.ఐ నర్సిరెడ్డి లతో వీరాపురం గ్రామంలోని గోదావరి ప్రాంతానికి చేరుకొని సహయ చర్యలకు పూనుకున్నారు.గోదావరిలో తెప్పపై ప్రమాదం అని తెలిసిన ప్రాణాలను సైతం పణంగా పెట్టి తెప్పపై కూర్చొని గోదావరి పాయను దాటుతున్న క్రమంలో తెప్ప మునిపొయే పరిస్థితి నెలకొంది.ఏమాత్రం బయపడినా పెను ప్రమాదమే అయినా గోదావరి మద్యలో గల ఇసుక ర్యాంపులో చిక్కుకున్న వారిని ఒడ్డుకు చేర్చేందు ఎలాగైనా వెళ్లాలనే కృతనిచ్చయంలో ఆవలిచేరి అక్కడి వారిని ఇసుక ర్యాంపు నిర్వహనకు వచ్చిన జేసిబిలపై వారందరిని సురక్షంగా వడ్డుకు చేర్చి అందరి మన్ననలు పొందారు.

## వారం - వర్జ్యం

01-08-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పుష్యమి కార్తె
తి.తదియ రా.11.05
న.శతభిష రా.8.42
వ.రా.3.20-తె.4.59
దు.తె.5.47-ఉ.7.26
రాహు. ఉ.9.00-ఉ.10.30
శుభ ఉ.8.00-ఉ.9.00

## వార్తాఫలం

**మేషం :** ఉద్యోగస్తులు తమ తోటివారితో అప్రమత్తతో మెలగాలి. ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది. వృత్తి, వ్యాపారాలు విస్తరిస్తారు.

**వృషభం :** పెదవి దాటడం వలన ఇబ్బందులను కొనితెచ్చుకోవడం అవుతుంది. దూర ప్రాంతాల నుండి ఆహ్వానాలు అందుకుంటాయి.

**మిథునం :** డాక్యుమెంట్లు, భూమి స్థిరాస్తుల సంబంధితమైన రావలసిన సౌకర్యాలు, ధనప్రాప్తి ఇబ్బందులకు గురిచేస్తారు. వాహన సౌఖ్యం.

**కర్కాటకం :** సంకుచిత మనస్తత్వము గల వ్యక్తులకు దూరంగా ఉండండి. మౌనం శ్రీరామరక్ష అవుతుంది. ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**సింహం :** ఓర్పు, నేర్పులు మేలు చేస్తాయి. యుక్తితో సమస్యల వలయాల నుండి బయట పడతారు. సోదరుల కలయిక.

**కన్య :** సన్నిహితుల సహాయంతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఇంటా బయట అనుకూలం. వస్త్ర లాభం.

**తుల :** జీవిత భాగస్వామితో స్వల్ప విభేదాలు ఏర్పడతాయి. దీర్ఘకాలిక ఋణాలు తీరుతాయి. నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**వృశ్చికం :** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. ఇతరుల విషయంలో జోక్యం వద్దు. వాహన సౌలభ్యం కలదు.

**ధనుస్సు :** సమయస్ఫూర్తితో మెలగడం చెప్పదగినది. బంధువుల నుండి మాట సహాయం అందుకుంటారు.

**మకరం :** వివాదాలకు, కోపతాపాలకు దూరంగా ఉండండి. ఆహార నియమాలు పాటించండి. ప్రకృతి వైద్యం మేలు చేస్తుంది.

**కుంభం :** చిన్ననాటి మిత్రుల నుండి శుభ వార్తలు అందుకుంటారు. భూ వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి.

**మీనం :** ఉద్యోగాలలో ఎదురైన ఆటంకాలను అధిగమిస్తారు. కోర్టుకేసులు నుండి బయట పడతారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శుక్రవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో చత్తీస్‌గఢ్ సిఎం విష్ణుదేవ్

# విచారణకు కెటిఆర్ హాజరు

>> హెచ్ఎండిఎ బాధ్యతలు పర్యవేక్షించిన సీనియర్ ఐఎఎస్ అధికారి అర్వింద్ కుమార్‌ను రెండవ ముద్దాయిగానూ ఆ విభా గంలో సిఇగా పనిచేసిన బిఎల్ఎన్ రెడ్డి మూడవ ముద్దాయిగానూ, స్పోర్ట్స్ కన్సల్టంట్‌గా వున్న కిరణ్ మల్లేశ్వరరావు నాలుగవ ముద్దాయిగానూ, ఈ రేసును నిర్వహించిన బ్రిటన్‌కు చెందిన ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఇఒ) సంస్థ ప్రతినిధి అల్బెర్టోను ఐదవ ముద్దాయిగానూ చేర్చారు. దీని తరువాత వరుసగా చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో 2025 నవంబర్ నెలలో కెటిఆర్‌ను ప్రాసిక్యూషన్ చేసేందుకు గవర్నర్ నుంచి అనుమతి లభించింది. దీంతో పాటు ఐఎఎస్ అధికారి అర్వింద్ కుమార్ విచారణకు కూడా కేంద్రం అనుమతి ఇచ్చింది. దీని తరువాత ఈ యేడాది మార్చి నెల 23వ తేదీన ఫార్ములా ఈ కార్ రేసుకు సంబంధించి ఎసిబి అధికారులు నాంపల్లి ఎసిబి కోర్టులో 77 పేజీల ఛార్జిషీట్ దాఖలు చేశారు. మే 14వ తేదీన ఎసిబి కోర్టు ఛార్జిషీట్‌ను విచారణకు స్వీకరించింది. ఎసిబి అధికారులు దాఖలు చేసిన ఛార్జిషీట్‌లో సంచలన విషయా లు వెల్లడించారు. ఫార్ములా ఇ-కార్ రేసుకు ఎలాంటి అనుమతులు తీసుకోలేదని, కేబినెట్‌లో ఆమోదం పొందలేదని, ఆర్థిక శాఖ నుంచి ఎలాంటి అనుమతి లేదని, లెటర్ ఆఫ్ ఇంటెంట్‌పై సంతకం జరిగేలా కెటిఆర్ వ్యవహరించారని ఎసిబి అధికారులు కోర్టుకు తెలిపారు. హెచ్ఎండిఎ నిధుల వినియోగంలో అన్ని నిబంధనలు ఉల్లంఘించారని, దీనివల్ల ప్రభుత్వంపై కోట్ల రూపాయల భారం పడిందని వారు తెలిపారు. ఈ కేసులో 14 మంది సాక్షులను విచారించామని ఎసిబి అధికారులు తెలిపారు. అప్పట్లో బిఆర్ఎస్‌కు వచ్చిన 44 కోట్ల రూపాయల విరాళాలు ఇందులో నుంచే అందాయని ఎసిబి అధికారులు తెలిపారు. ఈ కేసు విచారణలో భాగంగా కెటిఆర్ సహా అర్వింద్ కుమార్, బిఎల్ఎన్ రెడ్డిలో మొదటిసారిగా శుక్రవారం ఉదయం నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. కెటిఆర్ వెంట మాజీ మంత్రులు పలువురు రావడం, బిఆర్ఎస్ కార్యకర్తలు భారీగా హాజరవడంతో నాంపల్లి కోర్టు వద్ద ఉదయం పది గంటల నుంచే పోలీసులు బందోబస్తు చేబట్టారు. 11 గంటల సమయం లో కెటిఆర్ సహా అర్వింద్ కుమార్, బిఎల్ఎన్ రెడ్డిలు కోర్టుకు హాజరయ్యారు. కోర్టు హాల్‌లో కెటిఆర్, అర్వింద్ కుమార్, బిఎల్ఎన్ రెడ్డిలు కొ న్ని నిమిషాల పాటు వున్న తరువాత ఈ కేసు తదుపరి విచారణను ఆగస్టు 25వ తేదీకి న్యాయమూర్తి వాయిదా వేశారు.

**ఎలాంటి అక్రమాలు జరగలేదు**

కోర్టుకు విచారణకు హాజరైన తరువాత మీడియాతో కెటిఆర్ మాట్లాడుతూ ఇందులో ఏమీ లేదని తెలిపారు. అంతా చట్టబద్ధంగానే జరిగిందని, కావాలనే ప్రభుత్వం కక్షపూరితంగా కేసునమోదుచేసిందని తెలిపారు.

# హక్కుల ఉల్లంఘన నోటీసు

>> సవరణ బిల్లు2026పై జరిగిన చర్చకు సమాధానం ఇస్తూ ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ విద్యార్థులపై కాల్పులు జరపాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశించారని ఆరోపించారు. దీనికి సమాధానంగా జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, నిరసనల సమయంలో ఎలాంటి కాల్పులు జరగలేదు. కేవలం టియర్ గ్యాస్ మాత్రమే ఉపయోగించారు. కాల్పులే జరగనప్పుడు వాటికి ఆదేశాలు ఇచ్చారనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. కాల్పులకు అనుమతి ఇచ్చే అధికారం మంత్రికి కాదు, మేజిస్ట్రేట్‌కు ఉంటుందని లోక్‌సభలో పేర్కొన్నారు. మంత్రి సభలో ఏ ప్రకటన చేసినా ముందుగా వాస్తవాలను నిర్ధారించుకోవాల్సిన బాధ్యత ఉందని, తప్పుడు సమాచారం ఇవ్వడం పార్లమెంట్ ప్రత్యేక హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని వేణుగోపాల్ తన నోటీసులో స్పష్టం చేశారు. అందువల్ల జితేంద్ర సింగ్‌పై ప్రివిలేజ్ చర్యలు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.ఇదిలా ఉండగా, కాంగ్రెస్ ఉపనేత గౌరవ్ గొగోయ్ విద్యార్థులపై అనవసరంగా దాడులు జరిగాయని ఆరోపించగా, దానికి జితేంద్ర సింగ్ స్పందిస్తూ ప్రభుత్వం అత్యంత సంయమనం పాటించిందని చెప్పారు. 1979 నుంచి 1984 మధ్య అస్సాంలో జరిగిన ఆసు ఉద్యమాన్ని ప్రస్తావిస్తూ, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 860 మంది అమాయకులు, వారిలో ఎక్కువ మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. మరోవైపు, కె.సి. వేణుగోపాల్ సామాజిక మాధ్యమంలో స్పందిస్తూ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్వయంగా పెలెట్ గన్ బాధితుడిని మీడియా ఎదుట కలిశారని, కాల్పుల్లో గాయపడిన బాధితులపై అనేక మీడియా కథనాలు, ఆస్పత్రి రికార్డులు కూడా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో ఇలాంటి స్పష్టమైన అసత్యాలను ప్రభుత్వం చెప్పి తప్పించుకోలదు. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



# భోగాపురం ఎయిర్‌పోర్టును నేడు ప్రారంభించనున్న ప్రధాని

## తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా ఏర్పాట్లు: ఎపి సిఎం చంద్రబాబు

**విజయవాడ, జులై31,ప్రభాతవార్త ప్రతినిధి:**విజయనగరం జిల్లా భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రేపు (ఆగస్టు 1) ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ విమానాశ్రయ పనుల పురోగతిపై ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. విమానాశ్రయ ప్రాంగణాన్ని తెలుగు సంస్కృతి, వారసత్వ వైభవాన్ని ప్రతిబింబించేలా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా, గిరిజన సంప్రదాయ నృత్యమైన థింసాఖి కళ్లుచెదిరే స్థాయిలో నిర్వహించాలని సూచించారు. ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న ప్రధానికి అత్యంత ఘనంగా స్వాగతం పలకాలని కూడా ఆయన స్పష్టం చేశారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం కానున్నది. ఇది ఒక చారిత్రత్మక ఘట్టంగా నిలవాలన్నారు.జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ ద్వారా పీపీపీ విధానంలో డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేశారు. మొత్తం 2,703.26 ఎకరాల విస్తీర్ణంలో ఈ సమగ్ర ప్రాజెక్టును అభివృద్ధి చేశారు. విమానాశ్రయం -2,203 ఎకరాలు, ఏవియేషన్ హబ్ - 500 ఎకరాలు, ఏవియేషన్ యూనివర్సిటీ/ఎడ్యుసిటీ 136 ఎకరాలు కేటాయించారు. విమానాశ్రయ పరిధిలో ఎయిర్‌సైడ్ డెవలప్‌మెంట్, సిటీ సైడ్ కమర్షియల్ డెవలప్‌మెంట్, రెసిడెన్షియల్ డెవలప్‌మెంట్, అప్రోచ్ రోడ్లు వంటి మౌలిక వసతులను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధిచేశారు. 3,800 మీటర్ల పొడవైన రన్‌వే ఈ విమానాశ్రయానికి ప్రధాన ఆకర్షణ. వైడ్‌బాడీ విమానాల కార్యకలాపాలకు అనుకూలంగా దీనిని రూపొందించారు. అంటే బోయింగ్ 777, బోయింగ్ 787 డ్రీమ్ లైనర్, ఎయిర్ బస్ ఏ330, ఎయిర్ బస్ ఏ340 వంటి భారీ ఎయిర్ క్రాఫ్టులు భోగాపురం ఎయిర్ పోర్టు నుంచి రాకపోకలు సాగించగలవు. ఇక ఎయిర్ ఫీల్డ్ గ్రౌండ్ లైటింగ్, నావిగేషన్ ఎయిడ్స్, సీఎన్ఎస్/ఏటీఎం ఇన్ఫ్రాస్ట్రక్చర్ వంటి ఆధునిక భద్రతా వ్యవస్థలు ఈ ఎయిర్ పోర్టులో అందుబాటులో ఉన్నాయి. దేశీయ, అంతర్జాతీయ విమాన కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ప్రమాణాలతో ఎయిర్‌సైడ్ మౌలిక వసతులను అభివృద్ధి చేశారు. భోగాపురం విమానాశ్రయాన్ని భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మాడ్యులర్ విధానంలో అభివృద్ధి చేశారు. తొలి దశలో ఏటా సుమారు 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించే సామర్థ్యం ఉంటుంది. భవిష్యత్‌లో దశలవారీ విస్తరణ ద్వారా ఈ సామర్థ్యాన్ని ఏటా 4 కోట్ల మంది ప్రయాణించేలా విస్తరించేందుకు మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. ప్రయాణికుల రద్దీ పెరిగే కొద్దీ టెర్మినల్, ఎయిర్‌సైడ్, కమర్షియల్ మౌలిక వసతులను విస్తరించేందుకు వీలుగా ప్రాజెక్టును రూపొందించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నారు. ప్రయాణికుల సౌకర్యం, వేగవంతమైన ప్రాసెసింగ్, ఆపరేషనల్ సామర్థ్యాన్ని పెంచేందుకు కాంటాక్ట్ బోర్డింగ్ బ్రిడ్జిలు, కామన్ యూజ్ పాసింజర్ ప్రాసెసింగ్ వ్యవస్థ, సెల్ఫ్ బ్యాగేజ్ డ్రాప్, సెల్ఫ్ సర్వీస్ పాసింజర్ ప్రాసెసింగ్, స్మార్ట్ సర్వైవలెన్స్, యాక్సెస్ కంట్రోల్, సెక్యూర్టీ మేనేజ్మెంట్ సిస్టం, ఇంటిగ్రేటెడ్ ఆపరేషనల్ కంట్రోల్ అండ్ మానిటరింగ్ వంటి ఆధునిక సదుపాయాలను ఏర్పాటు చేశారు.ఉత్తరాంధ్ర ఎగుమతులు, పారిశ్రామిక అభివృద్ధికి భోగాపురం విమానాశ్రయం కీలకంగా మారనుంది. ఇక్కడ ఏటా 25,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన ప్రత్యేకించి కార్గో టెర్మినల్ అభివృద్ధి చేశారు. ఫార్మా, మెరైన్ ప్రొడక్ట్స్, అధిక విలువైన, పెరిషయబుల్ ఉత్పత్తుల రవాణాకు అవసరమైన టెంపరేచర్ కంట్రోల్డ్ కోల్డ్ చైన్ సదుపాయాలు కల్పించారు. దీంతో ఉత్తరాంధ్ర నుంచి దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతులు వేగవంతం కానున్నాయి.

డా. నోరి దత్తాత్రేయుడికి పద్మభూషణ్

# దేశానికే గర్వకారణం

కేంద్రహోంమంత్రి అమిత్‌షా అభినందన లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 31:** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు (వైద్యం), ప్రముఖ కేన్సర్ వైద్య నిపుణులు డా. దత్తాత్రేయుడు నోరికి కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రదానం చేయడం పట్ల కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హర్షం వ్యక్తం చేశారు. వైద్యరంగంలో ఆయన చేసిన విశేష సేవలకు గుర్తింపుగా దక్కిన ఈ పురస్కారం పట్ల సంతోషం వ్యక్తంచేస్తూ, డా. నోరికి హోంమంత్రి ఒక ప్రత్యేక అభినందన లేఖను పంపారు. కేన్సర్ చికిత్స, పరిశోధన రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా కొత్త ప్రమాణాలు నెలకొల్పి, ఎంతోమందికి పునర్జన్మ ప్రసాదించిన డా. నోరి సేవలను అమిత్‌షా ఈ లేఖలో విశేషంగా కొనియాడారు. విజ్ఞానం, సేవ, సహానుభూతి కలబోసిన ఆయన వైద్యప్రయాణం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో పద్మ పురస్కారాలకు సరికొత్త అర్థం చేకూరిందని హోంమంత్రి స్పష్టం చేశారు. కేవలం ప్రశంసల కోసం కాకుండా, సమాజ శ్రేయస్సే ధ్యేయంగా పని చేసే నిజమైన మౌనసాధకులకు, కర్మయోగులకు నేడు ఈ జాతీయ పురస్కారాలు దక్కుతున్నాయని ఆయన పేర్కొన్నారు. రోగుల సంక్షేమం పట్ల డా. నోరి కనబరుస్తున్న అంకితభావం కేవలం వ్యక్తిగత విజయం కాదని, అది స్వార్థరహిత విలువలపై నిలబడి దేశప్రగతికి దిశానిర్దేశంచేసే దేశభక్తికి నిదర్శనమని హోంమంత్రి అన్నారు. పరోపకారం విశిష్టతను తెలిపే సంస్కృత శ్లోకాన్ని ఉదహరించిన అమిత్‌షా.. డా. నోరి సంపూర్ణ ఆరోగ్యంతో, దీర్ఘాయుష్షుతో మరింత కాలంపాటు సమాజానికి తన అమూల్యమైన సేవలను అందించాలని ఆకాంక్షిస్తూ తన లేఖను ముగించారు.

# ఇంజినీరింగ్ విద్యార్థులపై సీఎం వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

## కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 31:** స్వయంగా పాఠశాల విద్య, ఉన్నతవిద్య, సాంకేతిక విద్య శాఖ బాధ్యతలు చూస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఇంజినీరింగ్ విద్యార్థులను 'క్రిమినల్ వేస్ట్' అని ప్రస్తావించడం.. ఆయన బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. సిఎం వంటి బాధ్యతాయుతమైన స్థానం లో ఉన్న వ్యక్తి.. ఒక సమస్యపై ఆరోగ్యకరమైన, నిర్మాణాత్మకమైన చర్చను ప్రారంభించి.. వ్యవస్థలో మార్పు కోసం ప్రయత్నం చేస్తే బాగుంటుంది. కానీ, విద్యార్థులపై క్రిమినల్ వేస్ట్ అనే పదాలను వాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హార్వర్డ్ యూనివర్సిటీలో వీకెండ్ క్లాసులో నేర్చుకున్న రెండు పదాలను ఇక్కడికొచ్చి వాడేద్దామనే ప్రయత్నంలో జెన్‌జీని అవమానిస్తున్నాననే విషయం కూడా ముఖ్యమంత్రి మర్చి పోయినట్లున్నారని ఎద్దేవా చేశారు.

అసలు, రెండున్నరేళ్లుగా ముఖ్యమంత్రిగా, విద్యా మంత్రిగా ఉన్న వ్యక్తి ఈ రంగంలో మార్పులకోసం ఏం చేశాడో చెప్పాల్సింది పోయి.. తెలిసీ, తెలియని పదాలను వాడి తానేదో మేధావినని నిరూపించుకునే ప్రయత్నం చేయడం దురదృష్టకరమన్నారు. అయినా రెండున్నరేళ్ల తర్వాత హఠాత్తుగా సీఎం నిద్రనుంచి మేల్కొని.. ఇంజనీరింగ్ విద్యా ప్రమాణాల గురించి ఎందుకు మాట్లాడాల్సి వచ్చిందో చెప్పగలరా? విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించమని అడుగుతున్నారనే అక్కసుతో ఇంజినీరింగ్ విద్యార్థులను క్రిమినల్స్‌తో పోల్చడం సిగ్గుచేటు అని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం రూ.10,000 కోట్ల ఫీజు బకాయిలు చెల్లించాల్సి ఉండగా, అందులో రూ.5,000 కోట్లకు పైగా కేవలం ఇంజనీరింగ్ విద్యార్థులకే చెల్లించాల్సి ఉందన్నారు. ఈ బకాయిలు చెల్లించాలనే విద్యార్థుల డిమాండ్‌ను తట్టుకోలేక, ఫ్రస్టేషన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారిని క్రిమినల్స్‌గా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. గతంలో కూడా ఇంజనీరింగ్ కాలేజీలు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తే...తమాషాలు చేస్తే తాట తీస్తాం అంటూ ముఖ్యమంత్రి స్థాయిని మరచి ఇష్టారీతిన మాట్లాడారు. కాలేజీలు ఫీజు బకాయిలు అడిగితే విజిలెన్స్ విచారణల పేరుతో విద్యాసంస్థల మీద దాడులు చేయించారు. ఎన్నికల సమయంలో తెలంగాణ విద్యాబడ్జెట్ 15శాతంగా చేస్తామన్న హామీని అటకెక్కించిన.. ముఖ్యమంత్రి 'గురివింద గింజ' ఆలోచనతో రాష్ట్ర విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారనేది సుస్పష్టంగా కనబడుతోందన్నారు. ఓవైపు రాజకీయ అవసరాలకోసం 'జెన్‌జీ'ల ఆకాంక్షలకు తామే ఠేకేదార్ అని ప్రకటనలు ఇస్తూనే.. మరోవైపు, అదే 'జెన్‌జీ'లను క్రిమినల్స్‌గా పోల్చిన రేవంత్ రెడ్డి విజ్ఞతను తెలంగాణ సమాజం ప్రశ్నిస్తోందన్నారు.

ఇది రేవంత్ రెడ్డి వరకే పరిమితం కాలేదు. 2015లో నాటి సీఎం కేసీఆర్ కూడా.. మన ఇంజనీరింగ్ విద్యార్థుల స్టాండర్డ్స్ సరిగా లేవని.. తనతో ఎవరో చెప్పారని, ఈ మాటతో తనకు సిగ్గుపోయినంత పనైందని.. అసెంబ్లీ వేదికగా చెప్పారు. మన ఇంజనీరింగ్ విద్యార్థులవి.. వానాకాలం చదువులని విమర్శించారు. ఈ ప్రకటన చేసిన తర్వాత 9 ఏళ్లు అధికారంలో ఉన్నా.. తనను ఆవేదనకు గురిచేసిన అంశంలో మార్పులకోసం మాత్రం కేసీఆర్ ఏమాత్రం ప్రయత్నించలేదన్నారు. కెసిఆర్ 10 యేళ్లు, రేవంత్ రెడ్డి రెండున్నరేళ్లు.. అంటే దాదాపు 12 ఏళ్లయినా తెలంగాణలో విద్యావ్యవస్థ ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్లు తయారైందంటే.. ముఖ్యమంత్రులు ఎంత గొప్పగా పనిచేశారో తెలంగాణ సమాజం అర్థం చేసుకోవాలని చెప్పారు.

# తెలంగాణలో వైన్ టూరిజం అభివృద్ధికి అవకాశాలు

అమెరికాలోని వైనరీని పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో వైనరీల ఏర్పాటుకు అవకాశం

ద్రాక్ష రైతులకు ప్రోత్సాహం.. స్థానికంగా ఉపాధి అవకాశాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 31:** తెలంగాణలో వైన్ టూరిజం అభివృద్ధికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. అమెరికా పర్యటనలో భాగంగా వర్జీనియాలోని లీస్‌బర్గ్‌లో ఉన్న స్టోన్ టవర్ వైనరీని మంత్రి సందర్శించారు. సెల్లార్ టూర్‌లో పాల్గొని వైనరీ నిర్వహణ, వైన్ తయారీ ప్రక్రియను అధ్యయనం చేశారు. అమెరికా పర్యటనలో భాగంగా వర్జీనియాలోని అష్‌బర్న్‌లో ఉన్న ఓ వైనరీని మంత్రి సందర్శించి, అక్కడి నిర్వహణ, వైన్ తయారీ విధానాలను అధ్యయనం చేశారు. వైనరీ ప్రతినిధులతో మాట్లాడి ద్రాక్ష సాగు, వైన్ తయారీకి అనువైన రకాలు, ప్రాసెసింగ్, ఫెర్మెంటేషన్, నిల్వ, బాట్లింగ్, నాణ్యతా ప్రమాణాలు, మార్కెటింగ్ తదితర అంశాలపై ఆరా తీశారు. ద్రాక్ష తోటలు, వైనరీలను పర్యాటకంతో అనుసంధానిస్తూ గైడెడ్ టూర్లు, హాస్పిటాలిటీ, సందర్శకులకు ప్రత్యేక అనుభూతులను కల్పిస్తున్న విధానాన్ని పరిశీలించారు.

హైదరాబాద్‌కు సమీపంలోని రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ద్రాక్ష తోటలు, వైనరీల ఆధారిత పర్యాటక అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు, ద్రాక్ష సాగుకు అనుకూలత, స్థలాల ఎంపిక, పెట్టుబడి నమూనాలను అధ్యయనం చేసి ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. వైన్ టూరిజం ద్వారా పర్యాటకులకు వినూత్న అనుభూతిని అందించడంతో పాటు ద్రాక్ష రైతులకు ప్రోత్సాహం, ప్రైవేటు పెట్టుబడుల ఆకర్షణ, స్థానికంగా ఉపాధి అవకాశాల కల్పనకు అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ పర్యాటక విధానం 2025-30లో భాగంగా రాష్ట్రంలో వినూత్న పర్యాటక ఉత్పత్తులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. తెలంగాణ టూరిజం కాన్‌క్లేవ్‌లో రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడులతో పలు పర్యాటక ప్రాజెక్టులకు ఒప్పంద ప్రతిపాదనలు వచ్చాయని, వాటిలో రాష్ట్రంలోనే తొలిసారిగా వైనరీ వాక్‌త్రూ అనుభూతితో కూడిన వైన్‌యార్డ్ రిసార్ట్ కూడా ఉందన్నారు. ఇందులో ద్రాక్ష సాగు, వైన్ తయారీ, బాట్లింగ్ వరకు మొత్తం ప్రక్రియను సందర్శకులు ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పించడంతో పాటు సంప్రదాయ పద్ధతిలో ద్రాక్షను తొక్కే గ్రేప్ స్టాంపింగ్ అనుభూతిని కూడా పొందవచ్చన్నారు. అంతర్జాతీయంగా విజయవంతమైన నమూనాలు, అత్యుత్తమ విధానాలను అధ్యయనం చేసి, నిబంధనలకు అనుగుణంగా ద్రాక్ష తోటలు, వైనరీలు, హాస్పి టాలిటీ, స్థానిక వంటకాలను అనుసంధానిస్తూ తెలంగాణకు అనువైన వైన్ టూరిజం నమూనాను అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలిస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. మంత్రి వెంట ప్రభుత్వ విప్ యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఉన్నారు.



అమెరికా పర్యటనలో భాగంగా వర్జీనియాలోని అష్‌బర్న్‌లో ఉన్న ఓ వైనరీని సందర్శించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

# బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై కేసు నమోదు

పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికంగా వేధించారంటూ యువతి ఫిర్యాదు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జులై 31, ప్రభాతవార్త:** పెళ్లి చేసుకుంటానని నమ్మించి నాలుగేళ్లపాటు తనను లైంగికంగా వేధించారని ఆరోపిస్తూ ఓ యువతి బిఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై ఫిర్యాదు చేయడంతో పంజాగుట్ట ఠాణాలో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన యువతి(22) ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ మహిళల పిజిలో నివసిస్తున్నది. 2022లో యువతికి 18 యేళ్ల వయసు ఉన్న సమయంలో ఓ ఇంటర్వ్యూ కోసం రేగా కాంతారావును కలిసింది. అనంతరం యూట్యూబ్ ఛానల్ ప్రారం భిస్తానని చెప్పి కాంతారావు యువతిని ఓ ప్రైవేట్ ఫ్లాట్‌కు పిలిపించి లైంగికంగా బలవంతం చేశాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించడంతో ఆయనతో సంబంధం కొనసాగించింది. హైదరాబాద్‌కు వచ్చినప్పుడు అమీర్‌పేటలోని ఓ నటుడికి చెందిన ఫ్లాట్‌లో ఇద్దరూ కలిసి ఉండే వారని, అనంతరం మరో అపార్ట్‌మెంట్‌లోనూ వీరిద్దరు కలిసి ఉన్నారు. ఈ క్రమంలో తన వ్యక్తిగత ఫొటోలు తీసుకుని, తాను కలవడానికి నిరా కరించినప్పుడు వాటితో మాజీ ఎమ్మెల్యే బెదిరించాడు. ఈ క్రమంలోనే రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెడితే డబ్బు రెట్టింపు చేసి ఇస్తానని చెప్పి ఆమె వద్ద నుంచి రూ.4 లక్షలు తీసుకొని, ఆ తర్వాత యువతి ఫోన్ కాల్స్‌కు స్పందించకుండా దూరంగా ఉండటంతో ఆమెకు అనుమానం వచ్చింది. దీనికితోడు 2024 మేలో యువతి మొబైల్ నుంచి ఆమె స్నేహితురాలి ఫోన్ నంబర్ తీసుకుని ఆమెతోనూ మాట్లాడటం, కలవడం ప్రారంభించాడు. దీనిపై అనుమానించిన యువతి అతన్ని ప్రశ్నించింది. యువతి స్నేహితురాలి ద్వారా రేగా కాంతారావు సోషల్ మీడియా హ్యాండ్లర్ గుంటక ప్రవీణ్‌ను సంప్రదించాడు. అనంతరం రేగా కాంతారావుకు సన్నిహితుడైన కాంట్రాక్టర్ నూకరపు రమేష్ ద్వారా మార్చి 16న రూ.5 లక్షలు, మార్చి 18న రూ.3.5 లక్షలు యువతి ఖాతాకు బదలీ కావడంతో ఈ వ్యవహారంపై యువతి ఆన్‌లైన్‌లో షీ టీమ్‌కు ఫిర్యాదు చేసింది. అయితే, తనకు రేగా కాంతారావుతో పరిచ యమే లేదని చెబుతూ, తాను డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్ని స్తున్నానంటూ ఆరోపణలు చేస్తున్నారని, తనకు తిరిగి వచ్చిన డబ్బు విషయంపై తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, అసలు సమస్య పెళ్లి చేసుకుంటానని చెప్పి తనను మోసం చేయడమేనని బాధిత యువతి ఫిర్యాదులో పేర్కొంది. సదరు యువతి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 69, 351(2) ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 19 యేళ్ల తర్వాత కోల్‌కతాకు వచ్చిన బంగ్లా రచయిత్రి తస్లీమానస్రీన్

**కోల్‌కతా, జులై 31:** బంగ్లాదేశీ రచయిత, సామాజిక కార్యకర్తర తస్లీమా నస్రీమ్ సుమారు 19 యేళ్ల తర్వాత మళ్లీ కోల్‌కతాకు చేరుకున్నారు. తస్లీమా రచనలను వ్యతిరేకిస్తూ 2007లో బెంగాల్‌లో నిరసనలు జరిగాయి. ఆ సమయంలో ఆమెను నగరం నుంచి బలవంతంగా వెళ్లగొట్టారు. 19 యేళ్ల బ్రేక్ తర్వాత ఇవాళ ఆమె కోల్‌కతాకు వచ్చారు. భారీ భద్రత నడుమ నేతాజీ సుభాష్ చంద్రబోస్ విమానాశ్రయానికి ఆమె చేరుకున్నారు. మానవ హక్కుల సంఘాలు నిర్వహించే కార్యక్రమాల్లో ఆమె పాల్గొన నున్నారు. బంగ్లాదేశ్‌లోని మిమెన్‌సింగ్‌లో ఆమె 1962లో జన్మించారు. ఫిజీ షియన్ అయిన ఆమె రచయిత కూడా. నవలలు, వ్యాసాలు, మెమోయిర్స్ రాశారు. మహిళల హక్కులు, సెక్యూలరిజం, భావ స్వేచ్ఛ, మత ఛాందసవాదులను విమర్శిస్తూ ఆమె చాలా రాశారు. 1993లో తస్లీమా రాసిన లజ్జ అనే నవల చాలా ఫేమస్ అయ్యింది. దాంతో ఆమెకు అంతర్జాతీయ గుర్తింపు వచ్చింది.



# సినిమా షూటింగ్‌లో నటి రష్మికకు గాయం



**హైదరాబాద్, జులై 31, ప్రభాతవార్త :** ప్రముఖ సినీనటి రష్మిక మందన్న గాయపడ్డారు. సినిమా షూటింగ్‌లో భాగంగా ఓ పాటకు డ్యాన్స్ చేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. తుంటి భాగంలో బలమైన గాయమై నట్లు వైద్యులు గుర్తించారు. ఆరు వారాలపాటు విశ్రాంతి తీసుకోవాలని వారు సూచించారు. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో ఆమె నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' కథానాయిక ప్రాధాన్యమున్న ఈ చిత్రంలో రష్మిక గోండు తెగకు చెందిన మహిళగా కనిపించనున్నారు. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతోన్న 'మైసా'కు సంబంధించిన కీలక యాక్షన్ సన్నివేశాలతో పాటు అండర్ వాటర్ సీక్వెన్స్‌ను ఇటీవల పూర్తి చేశారు. తాజాగా ఓ పాటను షూట్ చేస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఆమెకు పూర్తిగా ఆరు వారాలు విశ్రాంతి సూచించారు డాక్టర్లు. దాంతో, తెలుగింటి కోడలు కొన్ని వారాలు షూటింగ్‌కు దూరం కానుంది. మరోవైపు విజయ్ దేవరకొండతో కలిసి రష్మిక 'రణబాలి'లో నటిస్తున్నారు. రాహుల్ సాంకృత్యాన్ దర్శకుడు. ఈ ఏడాది సెప్టెంబరు 11న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

**టాలీవుడ్‌ను వెంటాడుతున్న గాయాలు..**

ఈ యేడాది తెలుగు సినీ నటులు వరుసగా గాయాల పాలవుతున్నారు. ఇటీవల అగ్ర కథానాయకుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 'ఎన్‌బికె 111' షూటింగ్‌లో గాయపడగా, ఆయనకు హైదరాబాద్‌లో ఏఐజీ ఆస్పత్రి వైద్యులు ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం బాలకృష్ణ కోలుకుం టున్నారు. మరోవైపు నందమూరి జూనియర్ ఎన్టీఆర్ భుజానికి కూడా గాయమైంది.

ఆయన గాయం నుంచి పూర్తిగా కోలుకోవడానికి ఆరు నుంచి ఎనిమిది వారాల విశ్రాంతి అవసరమని వైద్య బృందం సూచిం చింది. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ 'డ్రాగన్' చేస్తున్నారు. 'పెద్ది' షూటింగ్‌లో ప్రముఖ నటుడు రామ్‌చరణ్ మణికట్టుకు గాయమవగా, ఇటీవల కోయంబత్తూర్ వెళ్లి శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రముఖ నటుడు మోగస్టార్ చిరంజీవి కూడా చేతికి బెల్ట్‌తో కనిపించారు. గత కొంతకాలంగా భుజం గాయంతో బాధపడుతున్న ఏపీ డిప్యూటీ సీఎం, ప్రముఖ నటుడు పవన్‌కల్యాణ్ ఇటీవల ముంబయిలో శస్త్రచికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే.

# భవనంపై నుంచి దూకి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

**హైదరాబాద్ (గచ్చిబౌలి), జులై 31, ప్రభాతవార్త:** ఐ ట్రైడ్.. లూసర్.. అంటూ నోట్ రాసిపెట్టుకున్న ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ట్రేడింగ్ కారణంగా ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో మనస్తాపంతో తాను నివాసం ఉంటున్న అపార్టుమెంటు పైనుంచే దూకి తనువు చాలించాడు. గచ్చి బౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబం ధించిన వివరాలు పోలీ సుల కథనం ప్రకారం... జార్ఖండ్ రాష్ట్రం బోకారో స్టీల్ సిటీ ప్రాంతానికి చెందిన సుచిత్ కుమార్ పండిత్(26) నగరానికి వచ్చి గచ్చిబౌలి ఐటి కారిడార్ పరిధిలోని ఇన్‌సైడ్ సోల్యూషన్స్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. మరో ఇద్దరు స్నేహితులు హర్ష, వివేక్‌తో కలిసి సుచిత్‌కుమార్ నానక్‌రాంగూడలోని వాసవి కమ్యూనిటీ 17వ అంతస్థులో గల ఫ్లాట్ నెంబరు 1702లో నివాసం ఉంటున్నాడు. కాగా సుచిత్ కుమార్ ట్రేడింగ్ చేసి నష్టాలతో ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాడు. అప్పులు కావడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం తనతో పాటు ఉండే ఇద్దరు స్నేహితులు ఉద్యోగాలకు వెళ్లగా, సుచిత్ కుమార్ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో తన ల్యాపుటాప్‌కు 'ఐ ట్రైడ్.. లూసర్..' అంటూ స్టిక్కర్ అంటించి తాను నివాసం ఉంటున్న ఇంటి బాల్కానీలో నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



సుచిత్‌కుమార్(ఫైల్)

# టూరిస్ట్ బస్సులకు ఇకపై 'ఒక రాష్ట్రం, ఒకే పన్ను' విధానం

మూడు శ్లాబుల విధానం తొలగింపు

టూరిస్టు బస్సు యజమానులతో రవాణా శాఖ కమిషనర్ సమావేశం

**హైదరాబాద్, జులై 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో టూరిస్టు బస్సులకు ఇకపై ఒక రాష్ట్రం, ఒకే పన్ను అనే విధానాన్ని అమలు చేయాలని రవాణా శాఖ భావిస్తోంది. ఇదే అంశంపై చర్చించేందుకు రాష్ట్రంలోని టూరిస్టు బస్స యజమానులతో రవాణా శాఖ కమిషనర్ శుక్రవారం సమావేశమయ్యారు. టూరిస్ట్ బస్సుల త్రైమాసిక పన్ను హేతు బద్ధీకరణపై బస్సు యజమానులతో చర్చించారు.

రవాణా శాఖ కమి షనర్ ఇళంబర్తి, అదనపు రవాణా కమిషనర్ రమేష్,, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్) చంద్రశేఖర్ గౌడ్‌తో కలిసి శుక్రవారం టూరిస్ట్ బస్సు యజమానులతో టూరిస్ట్ బస్సులపై త్రైమాసిక పన్ను విధానాన్ని హేతుబద్ధీకరించే అంశంపై సమా వేశం నిర్వహించారు. ప్రస్తుతం టూ రిస్ట్ బస్సు లపై సింగిల్ డిస్ట్రిక్ట్ ట్యాక్స్, టూ డిస్ట్రిక్ట్ ట్యా క్స్, స్టేట్ ట్యాక్స్ మూడు వేర్వేరు స్లాబుల ద్వారా పన్ను విధిస్తు న్నారు. ఈ నిబంధనను సరళీకరిం చేందుకు, హేతుబద్ధీకరించేందుకు ఆపరేటర్లపై మొత్తం పన్ను భారం పెంచకుండానే ఈ మూడు స్లాబుల ను తొలగించి ఒక రాష్ట్రం, ఒకే పన్ను విధానం వైపు వెళ్లడం అవసరమని భావిం చారు. ఇదే అంశంపై అధ్యయనం చేయడానికి గతంలో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ అంశంపై టూరిస్ట్ బస్సు ఆపరేటర్ల అభిప్రాయాలు, సూచనలు తీసుకునేందుకు రవాణా శాఖ కమిషనర్ సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలోని టూరిస్ట్ బస్సు ఆపరేటర్లు సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలను తెలియజేశారు. త్వరలోనే ఒక రాష్ట్రం, ఒకే పన్ను విధానంపై నిర్ణయం తీసుకోనున్నారు.

# కుప్పకూలిన నాలుగంతస్తుల భవనం

తొమ్మిది మంది మృతి

**భివాండి, జులై 31:** ముంబైకి దగ్గరలో ఉన్న భివాండిలో గురువారం రాత్రి సుమారు 11:30 సమయంలో నాలుగు అంతస్తుల భవనం కూలింది. ఈ ప్రమాదంలో 9 మంది మరణించారు. ఈ భవనంలో ప్రతి అంతస్తుకు 12 గదుల చొప్పున మొత్తం 48 గదులు ఉన్నాయి. ఈ భవనం కూలిపోయే ప్రమాదం ఉందని మున్సిపల్ అధికారులు తెలిపారు. దీంతో అక్కడ మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సమయంలో భవనం కూలిపోయింది. రాత్రి 9 గంటల సమయంలో భవనం నుంచి విరిగిపడుతున్న శబ్దం రావడంతో స్థానికులు అధికారులకు తెలిపారు. వెంటనే అధికారులు స్పం దించి భవనంలోని కొన్ని కుటుంబాలను సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఇంకా కొంతమందిని తరలించే క్రమంలో భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. అగ్నిమాపక సిబ్బంది శిథిలాలు తొలగించి మృతదేహాలను వెలికితీశారు. గాయపడినవారిని ఆస్పత్రికి తరలించారు. భివండిలోని బాలాజీ నగర్ ప్రాంతంలో నాలుగు అంతస్తుల కోహినూర్ భవనంలో ఒక్కో అంతస్తులో 12 గదుల చొప్పున మొత్తం 48 గదులు ఉన్నాయి. పాత భవనం కావడంతో మున్సిపల్ అధికారులు ఇప్పటికే దానిని నివాసయోగ్యం కానిదిగా ప్రకటించారు.



# మొరాకో నుంచి స్యూటాలోకి 60వేల మంది చొరబాటు

వలసజీవుల కట్టడి కోసం సైన్యం మోహరింపు

తొక్కిసలాటలో 34 మంది మృతి

**మాడ్రిడ్, జులై 31:** మొరాకో నుంచి స్పెయిన్‌కు చెందిన ఉత్తర ఆఫ్రికా స్వయం ప్రతిపత్తి ప్రాంతమైన స్యూటాలోకి వేలాది మంది వలస దారులు ఒక్కసారిగా ప్రవేశించడంతో అక్కడి పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. స్థానిక పోలీసు బలగాలు పరిస్థితిని అదుపులోకి తీసుకు రాలేకపోవడంతో స్పెయిన్ ప్రభుత్వం సైన్యాన్ని రంగంలోకి దించింది. సరిహద్దు భద్రతను బలోపేతం చేయడంతో పాటు పోలీసులకు సహా యంగా సైనిక బలగాలను మోహరించింది. వలసదారుల్లో చాలామంది సరిహద్దు కంచెను ఈదుకుంటూ సముద్ర మార్గంలో స్యూటాలోకి చేరగా, మరికొందరు బ్రేక్‌వాటర్ల ద్వారా కాలినడకన ప్రవేశించారు. ఒక్కసారిగా భారీ సంఖ్యలో వలసదారులు రావడంతో ఆశ్రయ కేంద్రాలు కిక్కిరిసి పోయాయి. తొక్కిసలాటలో 34 మంది చనిపోయారు. ప్రభుత్వ డేటా ప్రకారం సుమారు 60వేల మందికిపైగా వలసజీవులు ఒక్కసారిగా క్యూటాలోకి చొచ్చుకుని వచ్చినట్లు స్పెయిన్‌ప్రధాని పెడ్రో శాంచెజ్ ప్రకటించారు. స్థానిక అధికారులు దీనిని మానవతా, సామాజిక అత్యవసర పరిస్థితిగా అభివర్ణించారు. స్యూటాలో భద్రతా పరిస్థితిని మెరుగుపర్చేందుకు సివిల్ గార్డుకు సైన్యం సహకరిస్తోందని స్పెయిన్ ప్రభుత్వం వెల్లడించింది. అదనంగా కోస్ట్‌గార్డ్ నౌకలు, డైవింగ్ బృందాలను కూడా మోహరించారు. పరిస్థితిని ప్రత్యక్షంగా సమీక్షించేందుకు స్పెయిన్ అంతర్గత వ్యవహా రాల మంత్రి ఫెర్నాండో గ్రాండేమార్లాస్కా స్యూటా పర్యటించనున్నారు. స్యూటా, మెలిల్లా స్పెయిన్‌కు చెందిన ఉత్తర ఆఫ్రికాలోని రెండు స్వయంప్రతిపత్తి ప్రాంతాలు. ఇవే యూరోపియన్ యూనియన్‌కు ఆఫ్రికాతో ఉన్న ఏకైక భూసరిహద్దులు కావడంతో యూరప్ చేరాలనుకునే వలసదారులకు ప్రధాన ప్రవేశ ద్వారాలుగా మారాయి. 1580 నుంచి స్పెయిన్ ఆధీనంలో ఉన్న స్యూటాలో సుమారు 85 వేల మంది జనాభా నివసిస్తున్నారు. ఇక్కడ క్రైస్తవులు, ముస్లింలతో పాటు స్పానిష్, మొరాకో మూలాల ప్రజలు నివసిస్తున్నారు. అయితే మొరాకో మాత్రం స్యూటా, మెలిల్లాలను స్పెయిన్ భూభాగాలుగా అధికారికంగా గుర్తించకుండా, ఆక్రమిత ప్రాంతాలుగా పేర్కొంటోంది. స్పెయిన్ భూభాగంలోకి నేరుగా ప్రవేశించే అవకాశం ఉండటంతో మెరుగైన ఉపాధి, భద్రత కోసం యూరప్‌కు చేరాలనుకునే వలసదారులు స్యూటాను లక్ష్యంగా చేసుకుంటున్నారు.

మొరాకో తీర ప్రాంతాల నుంచి ఈదుకుంటూ రావడం లేదా బలమైన సరిహద్దు కంచెలను దాటేందుకు ప్రయత్నించడం తరచుగా జరుగుతోంది. ఇప్పటికే గత కొన్ని రోజులుగా 1,500 మందికిపైగా వలసదారులు స్యూటాకు చేరగా, గురువారం మరోసారి వేలాది మంది రావడంతో పరిస్థితి మరింత దిగజారింది. ఆశ్రయ కేంద్రాల్లో ఖాళీ లేకపోవడంతో కొత్తగా వచ్చిన వారికి వసతి కల్పించడం అధికారులకు సవాల్‌గా మారింది. ముఖ్యంగా తల్లిదండ్రులు లేని మైనర్ బాలల కోసం ఏర్పాటు చేసిన కేంద్రాలు తమ సామర్థ్యానికి 2,400 శాతం మేర అధికంగా నిండిపోయినట్లు అధికారులు తెలిపారు. స్థానిక భద్రతా సిబ్బంది పరిస్థితిని నియంత్రించలేకపోవడంతోనే సైన్యాన్ని రంగంలోకి దించాల్సి వచ్చిందని స్పెయిన్ ప్రభుత్వం పేర్కొం ది. సివిల్ గార్డ్ ప్రతినిధులు పరిస్థితిని "పూర్తి గందరగోళం"గా అభివర్ణిస్తూ, సరిహద్దు వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందని వ్యాఖ్యా నించారు. ఒకవైపు సరిహద్దు భద్రతను కట్టుదిట్టం చేస్తూనే, మరోవైపు వలసదారులకు అవసరమైన మానవతా సహాయాన్ని అందించేందుకు పలు ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని స్పెయిన్ ప్రభుత్వం తెలిపింది. అదనపు వలసదారులు స్యూటాకు చేరకుండా మొరాకో కూడా సహకరిస్తోందని వెల్లడించింది.



IDBI BANK ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్, రిజిస్టర్డ్ ఆఫీస్: ఐడిబిఐ టవర్స్, డబ్ల్యుటిసి కాంప్లెక్స్, కఫ్ పరేడ్, ముంబై-400005, CIN No: L65190MH2004GOI148838

టెండర్ నోటీస్

ఎన్ఐటి.నెం.01/అడ్మిన్&ఐఎండి/ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క వివిధ ప్రాంతాలలో వెల్‌కమ్ కిట్ల సరఫరా కోసం రేట్ కాంట్రాక్ట్ టెండర్/2026-27

హైదరాబాద్‌లోని ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అత్యున్నత శిక్షణా కేంద్రమైన ఐడిబిఐ సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ (ఐసిబిఎఫ్) ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క వివిధ ప్రాంతాలలో వెల్‌కమ్ కిట్లు సరఫరా చేయుటకు అనుభవం గల స్టేషనరీ సరఫరాదారుల నుండి సీల్డ్ టెండర్‌లు కోరడమైనది.

టెండర్లను సమర్పించుటకు చివరి తేది: ఆగస్టు 24 2026, 15:00 గంll ల వరకు (సాll 03:00)

ఇతర వివరాల కోసం బ్యాంక్ యొక్క వెబ్‌సైట్: www.idbi.bank.in ను సందర్శించగలరు.

గమనిక: పైన పేర్కొన్న టెండరుకు సంబంధించి ఏవైనా తదుపరి అనుబంధం/సవరణలు/తేదీ పొడిగింపులు/వివరణలు/బిడ్డర్ల ప్రశ్నలకు సమాధానాలు, వగైరాలు కేవలం బ్యాంక్ యొక్క వెబ్‌సైట్‌లో మాత్రమే పోస్ట్ చేయబడతాయి మరియు పత్రికలలో ప్రత్యేక ప్రకటన ఏదీ జారీచేయబడదు.

తేది: ఆగస్టు 01, 2026 సం/- జనరల్ మేనేజర్ & అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్, ఐసిబిఎఫ్, హైదరాబాద్

వార్త

జీవితంలో విజయం సాధించడానికి మనిషికి తెలివి తేటలు ఉండీ అవకాశాలు వచ్చినంత మాత్రాన చాలదు. ఏకాగ్రత, లక్ష్యశుద్ధి అవసరం.

- సి.డబ్ల్యు. వెండైట్

# ఇ-ట్వంటీ ఈక్విటీతో తంటా!


ఇ-20 పెట్రోలు వినియోగంవల్ల వాహనాల మన్నికలో గణనీయమైన మార్పులు, సమస్యలు ఉత్పన్నం కావని సమగ్ర అధ్యయనాల్లో గుర్తించినట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేస్తున్నా వాహన వినియోగదారుల్లో సందేహాలు నివృత్తమౌతున్నట్లు లేదు. అంతేకాదు పాతతరం వాహనాల్లో కూడా ఇంజిన్‌లో ఎలాంటి మార్పులు లేకుండానే ఇ-20 పెట్రోలు వాడుకోవచ్చనీ భరోసా ఇస్తోంది. ఈవిషయాలను కేంద్ర రోడ్డు రవాణా, హైవే శాఖల మంత్రి నితిన్ గడ్కరీ బుధవారం రాజ్యసభలో నిష్కర్షగా వివరించారు. వాహనంలోని లోహ, ప్లాస్టిక్ భాగాలకు నష్టం చేయదని చెబుతున్నారు. మరో తడబాటు ఏమిటంటే 2005 ఏప్రిల్ 1 తర్వాత ప్రవేశపెట్టిన 2016కు ముందు తయారైన బిఎస్-3 వాహనాలకు రబ్బరుతో తయారైన కొన్ని విడిభాగాలు, గ్యాస్కెట్ల మార్చాల్సి వస్తుందని వారే పేర్కొన్నారు. 'నీట్ పేపర్ లీక్' వ్యవహారంలో తమ మాట నెగ్గించుకున్న కాక్రోచ్ జనతాపార్టీ ఉద్యమానికి మరో ఆయుధం దొరక్కూడదని కేంద్రప్రభుత్వం విస్తృతంగా ఎత్తులు వేస్తోంది. ఈ అంశం మీద తలెత్తిన సందేహాలను తీర్చేందుకు తెహసీన్ పునావాలా నేతృత్వంలో 'టీమ్ భారత్ -ఇ 20' అమలును నిరసిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ ఢిల్లీలో నిరసనలు చేపట్టింది. ఈ బృందంతో కేంద్ర పెట్రోలియం నేచురల్ గ్యాస్ మంత్రి హర్దీప్ సింగ్ పురి చర్చలు జరిపినా ఫలప్రదం కాలేదు. ఇలాంటి చర్చలు ఒక ముందడుగే అయినా ఇరుపక్షాల వాదనల్లో ఎలాంటి మార్పు రాకపోవడం విశేషం. ఈసమావేశంలో టీమ్ భారత్ పెట్టిన షరతులపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. పాత వాహనాల కోసం ఇ-10 పెట్రో లుతోపాటు ప్యూర్ పెట్రోలు కూడా అందుబాటులో ఉం చాలని, ప్రస్తుతమున్న ప్యూర్ పెట్రోలు ధరకే కంటె 20 శాతం తక్కువ ధర ఈ పెట్రోల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. ఇ-20 పెట్రోలు వాడకమనేది ప్రస్తుతమున్న క్లిష్ట పరిస్థితుల్లో దేశ ఇంధన విధానంలో సరికొత్త మార్పుగానే భావించాలి. అయితే దాని వినియోగంపై పలువురిలో రకరకాల సందేహాలుతలెత్తాయి. ఇథనాల్‌లో శక్తిసాంద్రత పెట్రోల్ కంటె తక్కువ కావడంతో పాత వాహనాల్లో మైలేజీ కొంత తగ్గే అవకాశం ఉందని వాహనదారుల అంచనా. ఈ విషయాన్ని కేంద్రప్రభుత్వంకూడా అంగీకరించింది. ఇ-20 పెట్రోల్‌తో వాహనాల ఇంధన సామర్థ్యం 2 నుంచి 6 శాతం వరకు తగ్గొచ్చని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కూడా వివరించారు. దిగుమతి చేసుకునే ముడిచమురుమీద ఆధారపడటం తగ్గించాలని, రైతులకు ఇథనాల్ మార్కెటింగ్ ద్వారా ప్రయోజనం కల్పించాలని, కార్బన్ ఉద్గారాలను తగ్గించాలనే లక్ష్యా లతో ప్రభుత్వం ఈ విధానాన్ని తీసుకొచ్చింది. ఇథనాల్ కలపడం వల్ల విదేశీ మారక ద్రవ్యం కూడా ఆదా అవుతుందని కేంద్రప్రభుత్వం వాదిస్తోంది. కాలుష్యం తగ్గుతుంది. చెరకు,మొక్కజొన్న, ధాన్యపు వ్యర్థాలవంటి పంటలకు డిమాండ్ పెరుగుతుంది. ఇంధన భద్రతకు ఇదే మూలమని కేంద్ర ప్రభుత్వం నమ్మింది. ఆచరించాలని చూస్తోంది. ఇథనాల్ ధర పెట్రోల్ కన్నా తక్కువకే లభ్యమవుతున్నప్పుడు వినియోగదారునికి భారత తగ్గలే దెందుకనే అన్న ప్రశ్న ఉదయిస్తోంది. ఇంధన భద్రత, రైతుకు ఆదాయం, దిగుమతి వ్యయం అన్ని అంశాలలోనూ మేలైన ప్రయోజనాలున్నాయి. కాగా శాస్త్రీయ ఆధారాలతో ఇ-20 పెట్రోలు వలన ఒనగూరే ప్రయోజనాల విషయంలో వినియోగదారుడు సంతృప్తి పడినప్పుడే పెట్రోలు నుంచి మరో ఇంధనానికి మారే అవకాశముంటుంది. దేశ ఆర్థిక వ్యవస్థలో ఇ-20 పెట్రోల్ వాడకంలో విజయవంతమైతే పర్యావరణ రక్షణ, ఇంధన భద్రత, గ్రామీణ ఆర్థికవ్యవస్థ బలోపేతం జరుగుతుందన్న కేంద్రప్రభుత్వం లక్ష్యం నెరవేరినట్లే. అందుకే 2025- 26 నాటికే ఇ-20 ఇథనాల్ మిశ్రమ లక్ష్యాన్ని పూర్తి చేయాలన్న సంకల్పంతో కేంద్రప్రభుత్వం ముంద డుగు వేస్తోంది. భారత్ తన చమురు అవసరాల్లో 85 శాతం దిగుమతులు చేసుకుంటోంది. కొత్త అన్వేషణతో రూపొందిన పెట్రోలు కావడం వల్ల సాలీనా రూ.30వేల కోట్లు విదేశీమారక ద్రవ్యం ఆదా అయ్యే అవకాశముందని అంచనాలున్నాయి. కానీ ఆదిలోనే తలెత్తిన అనుమానా లతో ఇ-20 వాడకం పూర్తిస్థాయిలో వినియోగానికి ఏర్పాట్లు చేసుకోలేకపోతోంది. దేశీయంగా ఇథనాల్ డిస్టిలరీల ఏర్పాటుతో పారిశ్రామిక ప్రగతిసాధ్యమై గ్రామాల్లో ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. ఇ-20 ప్రభావాన్ని మదింపు చేసేవిషయంలో ఇథనాల్ ఉత్పత్తికి ఇప్పుడున్న వ్యవసాయఉత్పత్తులు సరిపోతాయి. బయో ఫ్యూయెల్ కంపెనీలకు మంచి ధర గిట్టుబాటవుతుంది. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం కాగలదు. ఇథనాల్ కాలినప్పుడు వచ్చే కార్బన్ ఉద్గారాలు బహుతక్కువే. ఇథనాల్ క్యాలరీ విలువ పెట్రోల్ కంటే తక్కువ. ఇథనాల్ వాడితే 6శాతం నుంచి 8శాతం వరకు తగ్గుతుందని ఆటోమొబైల్ నిపుణుల అంచనా. ఇథనాల్ తేమను పీల్చుకుంటుంది. కావున ఇంజిన్ తుప్పుపట్టే అవకాశంతో కాలం మన్నిక తగ్గుతుంది. ఇథనాల్ ఉత్పత్తికి నీరు కావాలి. ఒక లీటర్ ఇథనాల్‌కు రెండువేల లీటర్ల తీరు వృథా అని నిపుణులు అంటున్నారు. వాహన మైలేజీ తగ్గుతుంది. పైగా పశ్చిమాసియా యుద్ధ తరుణంలో పెట్రోలు ధర పెంచలేదంటే దానికి ఇథనాల్ మిశ్రమం తోడవడం వల్లనేనని కేంద్రం ప్రత్యేకంగా వివరిస్తోంది. కాగా కనుక ఈ-20 ధర సాధారణ పెట్రోల్ ధర తగ్గించగలిగితే ప్రభుత్వ విధానానికి వాహనదారులు జై కొడతారు. ఈ వివాదం ఎంత త్వరగా పరిష్కారమైతే అంత మంచిది.

అన్నీ మన మేలుకోసమే అని తలిస్తే, ఎలాంటి క్లిష్టపరిస్థితి కూడా మనసును కలత పెట్టలేదు.



జెఫర్సన్

తన కోపాన్ని అదుపులో పెట్టుకోలేనివాడు తన మనస్సును, శరీరాన్ని కూడా అదుపు చేయలేడు.



బైరన్

## ప్రజావాక్కు



### పోస్టులు, వయసు పెంచాలి

తెలంగాణ ప్రభుత్వ పోలీస్ ఉద్యోగాలలో ఖాళీల సంఖ్య పెంచుతూ వయస్సు కూడాపెంచాలి. పోలీస్ డిపార్ట్మెంట్ లో జనరల్‌గా ఎస్సై వయస్సు 38కానిస్టేబుల్ వయస్సు 35 ఉండే ప్రస్తుతం ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఎస్సై 35 కానిస్టేబుల్ 32 ఇవ్వడం జరిగింది. దీనిని మూడు సంవత్సరాలుపెంచాలి.దాదాపు మూడు సంవత్సరముల కాలయాపన వల్ల నోటిఫికేషన్ లేకపోవడంతో కొంత మంది అభ్యర్థుల వయస్సు పెరిగింది దానిపైనే దృష్టి సారించిన విద్యార్థులు అయోమయంలో పడ్డారు.దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తూ పోలీస్ అభ్యర్థుల వయస్సు పెంచాలని కోరుతూ అదే విధంగా పోస్టుల సంఖ్య పెంచాలి. రుణాత్మక మార్కులు తగ్గించి దానికి సరిపడా కటాఫ్ మార్కులు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి తెలియపరుస్తూ ఉద్యోగ నియామక ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి.

- మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

### ఇ ఫైలింగ్ గడువు పెంచాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇన్కమ్ టాక్స్ ఇ ఫైలింగ్గడువు తేదీని పొడగించాలి. ఆధార్, ఫాన్ కార్డ్, స్పెలింగ్ మిస్టేక్‌లు ఈ కెవైసి,ఆధార్ లింకేజి వంటి సమస్యలు, మీ సేవా టైమింగ్, సర్వర్ బిజీ, వంటి సమస్యలు ఉన్నాయి. వికలాంగులు చాలా ఇబ్బంది పడుతున్నారు. సెలవులు దొరకడం లేదు. ఆఫీస్‌ల చుట్టూ తిరగడం జరుగుతుంది. చాలా ఇబ్బందిగా మానసిక సమస్యగా ఉంటుంది. కనుక ప్రభుత్వం ఇఫైలింగ్ గడువు తేదీ జులై 31కి బదులుగా డిసెంబర్ 31 వరకు పొడగించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

### ఆర్థిక వ్యవస్థకు పునాది

పర్యాటక రంగంకేవలం వినోదసాధనం మాత్రమే కాదు, అది ఆర్థికవ్యవస్థకు ఊపిరిపోసే శక్తివంతమైన యంత్రం. భారతదేశం పర్వతాలు,అరణ్యాలు, తీరప్రాంతాలు, చారిత్రక కట్టడాల వంటి అపారమైన వైవిధ్యాన్ని కలిగి ఉన్న ప్రకృతి,మౌలిక సదుపాయాల లోపం, కనెక్టివిటీ సమస్యలవల్ల పర్యాటక రంగం తన పూర్తిసామర్థ్యాన్ని అందుకోలేకపోతోంది. కేవలం హోటళ్లు నిర్మించడమే కాకుండా, మెరుగైన రవాణా, పారిశుద్ధం,భద్రత డిజిటల్ మార్కెటింగ్ సదుపాయాలను కల్పించినప్పుడే అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించగలం.

- కె.రామారావు, నల్గొండజిల్లా

### జెన్‌జీ ఉద్యమం

జెంజీ ఉద్యమం ఒక ఆశ రేఖఎందుకంటే ప్రతిపక్షం చేయలేని పని అది చేసింది కాబట్టి. అయితే ఉద్యమ జ్వాలలు ఇప్పుడే మొదలు కాలేదు. జీగ్నేష్‌మేవాని నుండి కొనసాగుతున్నాయి. అయితే ప్రజల నిరసన ఉన్నత స్థాయికి చేరింది. ఆ పర్యావసనాలు నేడు జెంజి ఉద్యమంలో కనపడ్డాయి. అయితే ఇంతటితో జెంజి ఉద్యమ జ్వాలాలు ఆగిపోకూడదు. ఎందుకంటే దేశంలో రాజకీయ పార్టీల మీద నమ్మకం ఈ యువత కోల్పోయింది. ఈ పర్యావసనలు కూడా మోడీని ఎత్తుకున్న మధ్యతరగతి ప్రజలు ఈ ఉద్యమంలో ఎక్కువ మంది పాల్గొనడం చూడొచ్చు. అందుకే ప్రభుత్వం పరిస్థితి చెయ్యిదాటి పోనియకుండా ప్రధాన్ రాజీనామాతో ముందుకు వచ్చింది. అయితే ప్రధాన్ రాజీనామాతో ఈ వ్యవహారం ముగిసిపోలేదు. విద్యార్థులకు పారదర్శకమైన పరీక్ష విధానం అమలు అవుతుంది అని. నమ్మకం కలిగించడం ముఖ్యం అప్పుడే ఈ జ్వాలాలు ఏమైనా తగ్గే అవకాశం ఉంది.

- భారత అవినాష్, జనగామ

### మత భావజాలం

హిందుస్థాన్, పాకిస్థాన్, కిజికిస్థాన్, ఉజిబెకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ ఇవన్నీ ఒకానొక కాలంలో ఒకే ప్రదేశం. పాకిస్థాన్ అంటే పవిత్రమైన స్థలం అనిఅర్థం. పాపం ప్రజలు మూర్ఖపు భావజాలంతో మిగతా మనుషులను అసహ్యించుకొని చంపాలి చావాలి అనే భావజాలంతో పేదరికంతో చచ్చిపోతున్నారు. హిందుస్థాన్‌లో ముక్కోటి దేవతలు ఉండేవారు.నిజంగా హిందువులు దేవతలు దేవుళ్లే ప్రతి హిందువు ఒక దేవుడు ఒక దేవత.నాకు ఒక కోరిక భగవంతుడు కనిపిస్తేకోరుతాను. కుల వృత్తులు నశించాయి.మత భావజాలం మతమోఢ్యం నశించాలి. రిజర్వేషన్లు లేని రోజులు ప్రభుత్వ రంగంలో రావాలి. దేరా బాబాలు,కపట సన్యాసులు వాళ్ళ ఆశ్రమాలను ప్రభుత్వాలకు అప్పజెప్పిపాకీపని చేయాలి.అది పవిత్రమైన పనిగా వారుభావించేలాంటిసద్బుద్ధివారికిభగవంతుడు ప్రసాదించాలి.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### మనిషి నడవడం అలవర్చుకోవాలి

మనిషి కనీసం రోజుకు రెండు నుండి మూడు మైళ్ళ దూరం నడిస్తేనే నిజ జీవితంతోపాటు భవిష్యత్ జీవితంలో ఆయురారోగ్యాలతో జీవించవచ్చు.నేడు అధునాతన సాంకేతికత వాహనాలు కలిగి ఉండడం వలనమనిషి అసలు రోజుకు కిలోమీటరు అయిన నడవలేకపోతున్నాడు. కావున వీలైనంత వరకు నడవాలని వైద్యులు సూచిస్తున్నారు.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# ఇంకెన్నాళ్లీ కంచి గరుడసేవ?

అధికారంలో ఉన్నప్పుడు సకల సౌకర్యాలు అనుభవించి ఆర్థికంగా స్థిరపడి,అధికారం కోల్పోగానే అంతవరకు తాము విమర్శించిన, వ్యతిరేకించిన పార్టీలోకి దూకేది కార్యకర్తలు కాదు. నాయకులే. పేర్లు రాసి వారిని ఇబ్బంది పెట్టడం ఎందుకుకానీ, వారెవరో? వారి చరిత్ర ఏమిటో? ప్రజలకు తెలియంది కాదు. ఇప్పటికైనా రాజకీయ పార్టీలనేతలు మనసుపెట్టి ఆలోచించాలి. పార్టీనే నమ్ముకుని కార్యకర్తలుగా ఏళ్లతరబడి జెండాలు మోస్తూ పార్టీకి, ప్రజలకు సేవ చేస్తున్న కార్యకర్తలను విస్మరించడం ఏ కోణంలో చూసినా ధర్మంకాదు. కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వాలి. నామినేటెడ్ పదవులకు కూడా కప్పదాట్లకు పాల్పడినవారినో, వారివారసులనో అందలమెక్కిస్తే నిజమైన కార్యకర్తల పరిస్థితిఎలా ఉంటుందో ఆలోచించాలి. కార్యకర్తల్లోనిరాశా నిస్పృహలు పెరిగి దూరమైతే పార్టీ పరిస్థితి ఏమవుతుందో పెద్దలకు తెలియందికాదు. కార్యకర్తలు లేనిపార్టీ పునాదులు లేని భవనాల్లాగా ఎప్పటికైనా కూలిపోయి కనుమరుగుకాక తప్పదు.

దామెర్ల సాయిబాబ

'కూడు గుడ్డ అడక్కపోతే బిడ్డను సాకినట్లు సాకుతాం' అన్నట్టుగా ఉంది కార్యకర్తల పట్ల రాజకీయ పార్టీల వైఖరి. ధర్నాలంటారు, రాస్తారోకోలంటారు, పార్టీ సమావేశాలంటారు, కార్యకర్తల మీటింగ్ లంటారు, శిక్షణా తరగతులంటారు, పార్టీ విధానాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలంటారు, బహిరంగ సభలకుజనాన్ని తరలించుకురావాలంటారు. ఇప్పుడు కొత్తగా ఓట్ల పరిశీలన, నమోదు తదితర కార్యక్రమాలను అప్పగించారు. ఇలా ఒక్కటేమిటి యేడాది పొడుగునా ఏదో కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తూనే ఉంటారు. పైకి ఏమనలేక పోయినా జీతభత్యం లేని ఈ కంచిగరుడ సేవ ఇంకెన్నాళ్ల నుకునేవారి సంఖ్య ఎక్కువైపోతున్నది. ముఖ్యంగా దిగువ శ్రేణి నాయకులకు ఆర్థికభారం ఎలా భరించాలన్నదే సమస్యగా పరిణమిస్తున్నది. కొందరు కార్యకర్తలు ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. అయినా ఏనాటికైనా తమ సేవలనుగుర్తించకపోతారా? ఏదో పదవి రాకుండాపోతుందా? అనే ఆశతో కొందరు ఈ రాజకీయ యజ్ఞంలో పోరాటం చేస్తూనే ఉన్నారు. గతంలో కొందరు కార్యకర్తలకు చిన్న చితక కాంట్రాక్టులు దక్కేవి. కొంతలో కొంత ఖర్చులను పూడ్చుకునేవారు. ఇప్పుడా పరిస్థితులు లేవు. ఉన్నత స్థాయిలోనే పర్సెంటేజిలు నిర్ణయమైపోతున్నాయి. ఇలా రాజకీయ కార్యకర్తలుగా జీవనం ప్రారంభించిన వారెందరో సర్పంచులుగా, సమితి అధ్యక్షులుగా, ఎమ్మెల్యేలుగా, పార్ల మెంటు సభ్యులుగా, కేంద్ర మంత్రులుగా, ముఖ్యమంత్రు లుగా ఎదిగారు. కాంగ్రెస్ పార్టీ విడిపోయి ఇందిరా కాంగ్రెస్ ఏర్పడినప్పుడు కార్యకర్తలే నాయకత్వం వహించి పెద్దపెద్ద పదవులను అధిష్టించారు. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో నూతన నాయకులు పుట్టుకొచ్చారు. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ ఆనాడు వెనుకబడిన తరగతుల వర్గాల నుంచి ఎందరినో నాయకులుగా తీర్చిదిద్దింది. అలా నాయ కులుగా ఎదిగినవారెందరో అటు పాలనలోనూ, ఇటు ప్రజాభిమానం పొందడంలోనూ గుర్తింపు కలిగిన స్థానం సంపాదించుకోగలిగారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఎందరో కార్యకర్తలు రాష్ట్రం వచ్చిన తర్వాత మంత్రులుగా, పార్లమెంటు సభ్యులుగా ఎదగడమే కాదు సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించి ప్రజల హృదయాల్లో చోటు సంపా దించుకున్నారు. ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకొని కొందరు కార్యకర్తలు ఏళ్ల తరబడి జెండాలు మోస్తూ నాయ కత్వం ఇచ్చిన ఆదేశాలను తూ.చ తప్పకుండా పాటిస్తూ అవిరామంగా కృషిచేస్తున్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు తమ సేవను గుర్తించకపోతారా? అవకాశం ఉన్నప్పుడు నామినేటెడ్ పదవుల్లో తమ తమ స్థాయిని బట్టి నియమించకపోతారా? అనేదే వారి ఆశ, ఆరాటం. కానీ పరిస్థితులు మారిపోయాయి. దాదాపు అన్ని పార్టీల్లోనూ క్షేత్రస్థాయిలో అహర్నిశలు పనిచేస్తున్న కార్యకర్తలను విస్మరి స్తున్నారేమోననిపిస్తున్నది. పార్టీల పరంగా సిద్ధాంతాలు, కొన్ని మార్గదర్శకాలను రూపొందిస్తున్నా అందులో తమకు ఎలా లాభం, అవకాశాలు దక్కించుకోవాలనేఆరాటం అధికశాతం నేతల్లో కన్పిస్తున్నది. అందుకే యువతకుప్రాధాన్యత అంటే తమ కుమారులనో, అల్లుళ్లనో కొందరు నేతలు ముందు పెడుతున్నారు. మహిళలు అంటే కుమార్తెలనో, భార్యల పేర్లనో చెబుతున్నారు. రానురాను రాజకీయ వారసులు ఎక్కువైపోతున్నారు. చివరకు సర్పంచ్ పదవులను కూడా వదిలిపెట్టడంలేదు. ఇలాంటి పరిస్థితుల్లో సామాన్య కార్యకర్తలకు భవిష్యత్‌లో కూడా కనుచూపుమేరలో అవకాశాలు, పెద్దపెద్ద పదవుల సంగతి దేవుడెరుగు.వార్డుమెంబర్లు లాంటి చిన్న పదవులకు కూడా ఈ సంప్రదాయం విస్తరిస్తున్నది. కార్యకర్తలందరికి పదవులు ఇవ్వడం అనేది సాధ్యమయ్యేపనికాదనేది వాస్తవం కావొచ్చు. కానీ కార్యకర్తలను పట్టించుకోకపోవడం ఇటీవల కాలంలో పెరిగిపోతుండడం దురదృష్టకరం. అసలు ప్రజాసేవ, ప్రజాభిమానం వంటి కొలమానంతో పదవులు ఎంపిక చేసే రోజులకు కాలం చెల్లిపోయింది. దాదాపు ప్రతిపార్టీ కూడా గెలుపు గుర్రాలకోసమే అన్వేషిస్తున్నారు. ఆర్థిక స్తోమత ఉందా? ఖర్చు పెట్టగలిగే శక్తిఉందా? కుల బలం ఏమిటి? ఏ నాయకుడికి తోకగా, బకాగా వ్యవహరిస్తున్నారని చూస్తున్నారే తప్ప ప్రజలకు, పార్టీకి అంకితభావంతో పనిచేసే వారిని పట్టించుకునే రోజులు పోయాయి. రాజకీయమే ఒక ఖరీదైన వ్యాపారంగా రూపుదాల్చింది. పెట్టుబడులు పెట్టడం,ఎన్నికల్లో గెలవడం, తిరిగి రాబట్టుకోవడం, మళ్లీ పెట్టుబడి ఇలా ఒక విషవలయంగా మారి ఆర్థిక, అంగబలం ఉన్నవారే ఈ విషవలయంలోకి ప్రవేశించగలుగుతున్నారు. సామాన్యులెవరూ ఆ వైపు కన్నెత్తి చూసే ధైర్యం చేయలేకపోతున్నారు. ప్రజలతో సంబంధం లేనివారు నేరుగా మంత్రులైపోతున్నారు.ఇక్కడా, అక్కడా అని కాదు. దేశవ్యాప్తంగా ఇవే పరిస్థితులు నెలకొన్నాయి. సర్పంచ్ పదవి కూడా లక్షలాది రూపాయల డబ్బు, మద్యం వెచ్చించాల్సిన దురదృష్టపు పరిస్థితులు దాపురించాయి. కానీ ఈ సంప్రదాయం రానురాను శృతిమించిపోతున్నది. రాత్రికి రాత్రి పార్టీలు మార్చే దుస్సంప్రదాయం కూడా విస్తరిస్తున్నది. ప్రత్యర్థి పార్టీలో ఉండి విమర్శలు కురిపించి తెల్లవారేసరికి పార్టీ మార్చి అధికారం వైపు మొగ్గుచూపుతున్నారు. ప్రజాసేవ కోసమే తాము అధికార పార్టీలోకి మారుతున్నట్లు చెప్పుకుంటున్నారు. ఇలా నేతలు పార్టీలు మారినపుడు కార్యకర్తలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీకావు. వారితోపాటు పార్టీ మారితే కొత్త పార్టీలో అక్కడ ఉన్న కార్యకర్తలతో ఇబ్బందులు. ఇక్కడ ఉంటే కొత్త నాయకునితో మరోరకం కష్టాలు. ఈ శిక్షణలు, సిద్ధాంతాలు, మానిఫెస్టోలు ఎందుకు అనే అనుమానాలు రాక తప్పదు. ఒకవేళ పార్టీ సిద్ధాంతాలను, క్రమశిక్షణ, ప్రజాసేవల గురించి శిక్షణ ఇవ్వాల్సి వస్తే ముందుగా పదవులు వెలగబెడుతూ పార్టీ పరువు, ప్రతిష్టను బజారున పెడుతున్న పెద్దలకు ఇవ్వాలి. పార్టీలోనే ఉంటూ గోతులు తవ్వే నాయకులకు ఇవ్వాలి. కేవలం అధికారం కోసం కప్పదాట్లకు సిద్ధపడే నేతలకు ఇవ్వాలి. ఎన్ని శిక్షణలు ఇచ్చినా, ఎన్ని నిబంధనలు పెట్టుకున్నా పాటించే వారే లేకుండా పోతున్నారు. దశాబ్దాల పాటు రాజకీయాల్లో ఉండి ప్రజాభిమానం చూరగొని పార్టీ ద్వారా పదవులు, అనుభవించి లక్ష్మీపుత్రులుగా మారిన వారు కూడా కప్పదాట్లకు పాల్పడుతుండడం అత్యంత దురదృష్టకరం. ఇక క్రమశిక్షణ అన్నది చాలా పార్టీలు ఏనాడో మరచిపోయాయి. పార్టీకి నష్టం తెచ్చేవారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోకుండా మనవాడే కదా అని సర్దుకుపోతే మళ్లీ మళ్లీ ఇలాగే జరుగుతుంటుంటాయి. ప్రజల దృష్టిలో పార్టీ చులకన అవుతుంది. ఇంటి దీపం అనిముద్దు పెట్టుకుంటే మూతి కాలక తప్పదనే విషయాన్ని విస్మరించకూడదు. క్రమశిక్షణలో విఫలమై, ప్రజలకు దూరమైన పార్టీల నేతలు ఎందరో ఉన్నారు. ప్రజల్లో ఎంతో చైతన్యం వచ్చింది. ప్రతి నాయకుడి కదలికలను, ప్రవర్తన చర్యలను ప్రజలు వెయ్యి కళ్లతో గమనిస్తున్నారు. ముఖ్యంగా కష్టం కలిగినప్పుడు పార్టీని వదిలివెళ్లి, ఇష్టం వచ్చినప్పుడు తిరిగి రావొచ్చనే దుస్సంప్రదాయానికి అడ్డుకట్ట వేయాలి. అధికారంలో ఉన్నప్పుడు సకల సౌకర్యాలు అనుభవించి ఆర్థికంగా స్థిరపడి, అధికారం కోల్పోగానే అంతవరకు తాము విమర్శించిన, వ్యతిరేకించిన పార్టీలోకి దూకేది కార్యకర్తలు కాదు. నాయకులే. పేర్లు రాసి వారిని ఇబ్బంది పెట్టడం ఎందుకు కానీ,వారెవరో? వారి చరిత్ర ఏమిటో? ప్రజలకు తెలియంది కాదు. ఇప్పటికైనా రాజకీయ పార్టీల నేతలు మనసుపెట్టి ఆలోచించాలి. పార్టీనే నమ్ముకుని కార్యకర్తలుగా ఏళ్లతరబడి జెండాలు మోస్తూ పార్టీకి, ప్రజలకు సేవ చేస్తున్న కార్యకర్తలను విస్మరించడం ఏ కోణంలో చూసినా ధర్మం కాదు. కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వాలి. నామినేటెడ్ పదవులకు కూడా కప్పదాట్లకు పాల్పడినవారినో, వారివారసులనో అందలం ఎక్కిస్తే నిజమైన కార్యకర్తల పరిస్థితిఎలా ఉంటుందో ఆలోచించాలి. కార్యకర్తల్లో నిరాశానిస్పృహలు పెరిగి దూరమైతే పార్టీ పరిస్థితి ఏమవుతుందో పెద్దలకు తెలియంది కాదు. కార్యకర్తలు లేనిపార్టీ పునాదులు లేని భవనాల్లాగా ఎప్పటికైనా కూలిపోయి కనుమరుగుకాక తప్పదు. ●

## ఒక్క మాట

# నిరసనల నుంచి నిర్మాణాత్మక మార్పు వైపు..

సురేష్ కాలేరు

ప్రజాస్వామ్యంలో నిరసన అనేది బలహీనతకు కాదు, బలానికి చిహ్నం. ప్రజల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లే అత్యంత శాంతియుతమైన ప్రజాస్వామ్య సాధనం అది. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన విద్యార్థి సంఘాలు, యువజన వర్గాలు, పౌరసంఘాలు పాల్గొన్న నిరసనలు మరోసారి దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. అయితే ఏ నిరసన గురించి మాట్లాడినా వాస్తవాలు, విమర్శలు, రాజకీయ ప్రయోజనాలు, దేశ ప్రయోజనాలు ఈ నాలుగు కోణాల్లో సమగ్రంగా విశ్లేషించడం అవసరం. విద్యార్థి ఉద్యమాల చరిత్రను పరిశీలిస్తే, దేశ సామాజిక, రాజకీయ పరిణామాల్లో వాటి పాత్ర ఎంతో కీలకమైనది. అవినీతి, నిరుద్యోగం, విద్యావ్యవస్థలో లోపాలు, పరీక్షల పారదర్శకత, అవకాశాల్లో సమానత్వం వంటి అంశాలపై యువత స్వరం వినిపించడం ప్రజాస్వామ్య ఆరోగ్యానికి సంకేతం. సమాజంలో కనిపిస్తున్న సమస్యలను ప్రశ్నించడం, ప్రభుత్వాలను జవాబుదారీగా నిలబెట్టడం ప్రజల రాజ్యాంగబద్ధ హక్కు. అయితే ప్రతి ఉద్యమం వెనుక ఉన్న సదుద్దేశాన్ని గుర్తించడంతో పాటు, దాని అమలు విధానాన్ని కూడా పరిశీలించాలి. నిరసనలు శాంతియుతంగా, చట్టబద్ధంగా సాగితే ప్రజల మద్దతు లభిస్తుంది. కానీ హింస, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, ప్రజల సాధారణ జీవితానికి ఆటంకం కలిగితే అసలు లక్ష్యం మరుగున పడే ప్రమాదం ఉంది. ప్రజాస్వామ్యంలో విభేదాలను వ్యక్తపరిచే హక్కు ఉన్నట్లే, ఇతరుల హక్కులను గౌరవించే బాధ్యత కూడా ప్రతి పౌరుడిపై ఉంది. ఇటీవలి ఆందోళనలపై వచ్చిన విమర్శల సారాంశం కూడా ఇదే. కొన్నివర్గాలు ఉద్యమాలను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నాయనే ఆరోపణలు వినిపించాయి. మరోవైపు, ప్రభుత్వం ప్రజల ఆందోళనలను ప్రారంభ దశలోనే సానుకూలంగా స్వీకరించి, పారదర్శక సంభాషణకు అవకాశం కల్పించి ఉంటే ఉద్రిక్తతలు తగ్గేవని కూడా పలువురు అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యంలో సంభాషణ ఎప్పుడూ ఘర్షణ కంటే శ్రేయస్కరం. దేశ ప్రయోజనాల దృష్ట్యా మరో అంశాన్ని కూడా విస్మరించరాదు. ప్రతి ప్రజా ఉద్యమంలో తమ స్వప్రయోజనాల కోసం చొరబడే అవకాశవాద శక్తులు ఉండే అవకాశం ఉంటుంది. హింసను ప్రోత్సహించడం, విద్వేషాన్ని రెచ్చగొట్టడం, జాతీయ సమగ్రతను దెబ్బతీసే చర్యలకు పాల్పడటం వంటి ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరాదు. అయితే ఇటువంటి ఆరోపణలు ఎవరిపైనా ఆధారాలు లేకుండా చేయడం కూడా సమంజసం కాదు. దేశ భద్రతను కాపాడటం ఎంతముఖ్యమో, ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించడం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత. విద్యార్థి ఉద్యమాలకు కూడా కొన్ని ఆత్మపరిశీలనలు అవసరం. సమస్యలను మాత్రమే ప్రస్తావించడం కాకుండా, వాటికి ఆచరణ సాధ్యమైన ప్రత్యామ్నాయాలను కూడా ప్రతిపాదించాలి. విధానాలపై అధ్యయనం, గణాంకాలతో కూడిన చర్చ, నిపుణులతో సంభాషణ, చట్టబద్ధమైన నిరసన పద్ధతులు ఇవే ఉద్యమాలకు మరింత విశ్వసనీయతను తెస్తాయి.సోషల్ మీడియా ప్రచారం కంటే ప్రజల విశ్వాసమే ఒక ఉద్యమానికి నిజమైన బలం. ప్రభుత్వం కూడా విమర్శలను శత్రుత్వంగా కాకుండా ప్రజాభిప్రాయంగా స్వీకరించాలి. యువత ప్రశ్నలను వినాలి. నియామకాలలో పారదర్శకత, విద్యారంగ సంస్కరణలు, ఉపాధి అవకాశాల విస్తరణ,అవినీతిపై కఠిన చర్యలు వంటిఅంశాల్లో వేగంగా స్పందిస్తే అసంతృప్తి తగ్గుతుంది. సమర్థవంతమైన పాలనకు ప్రజల విశ్వాసమే పునాది. దేశానికి ఈరోజు అవసరమైనది కేవలం ఉద్యమాల పరంపర కాదు. సమూల మార్పుకు దారితీసే నిర్మాణాత్మక దృక్పథం. దేశం ముందుకు సాగాలంటే యువత ప్రశ్నించాలి, ప్రభుత్వం వినాలి, సమాజం ఆలోచించాలి. ఆలోచనలతో గెలిచే ప్రజాస్వామ్యమే శాశ్వతమైనది,ఆవేశాలతో కాదు. ●

# అసమానతల అగాధంలో ఆర్థికాభివృద్ధి!



జీ. శ్రీలత

భారత్ ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా ప్రశంసలు అందుకుంటోంది. ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థదిశగా అడుగులు వేస్తున్న దేశంగా అంతర్జాతీయ వేదికలపై భారత్ పేరు మారు మోగుతోంది. స్టాక్ మార్కెట్లు కొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. కోట్లాది మంది డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములు అవుతున్నారు. ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశంగా భారత్‌ను భవిష్యత్తు శక్తిగా అభివర్ణిస్తున్నారు. అయితే ఈ మెరుపుల వెనుక దాగి ఉన్న మరో చేదు వాస్తవాన్ని 360 వన్ వెల్త్ క్రియేటర్స్ లిస్ట్ 2026 బయటపెట్టింది. దేశంలో కనీసం రూ.425 కోట్లకు పైగా సంపద కలిగిన వారి సంఖ్య కేవలం 3,040 మంది మాత్రమే.కానీ వారి చేతుల్లో ఉన్న మొత్తం సంపద విలువ ఏకంగా రూ. 104 లక్షల కోట్లు. మరోవైపు భారత జనాభా దాదాపు147 కోట్లకు పైగా ఉంది. అంటే కోట్లాది మంది ప్రజలు జీవనోపాధి కోసం పోరాడుతుండగా, అత్యంత స్వల్ప సంఖ్యలో ఉన్న వ్యక్తుల చేతుల్లో అపారమైన సంపద కేంద్రీకృతమవుతోంది. ఈ గణాంకాలను కేవలం ధనవంతుల జాబితాగా మాత్రమే చూడలేం. ఇవి దేశంలోని ఆర్థిక అసమానతఎంత తీవ్రంగా పెరుగుతోందో చెప్పే సంకేతాలు. సంపద సృష్టి అనేది తప్పు కాదు. పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, స్టార్టప్ వ్యవస్థాపకులు దేశ అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తారు. వారు పరిశ్రమలు స్థాపిస్తారు, ఉపాధి కల్పిస్తారు, పన్నులు చెల్లిస్తారు, ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపిస్తారు. కాబట్టి సంపదను సృష్టించడం లేదా విజయవంతమైన వ్యాపారాలను నిర్మించడం ఎవరూ తప్పుబట్టాల్సిన విషయం కాదు. అయితే సమస్య ఎక్కడ ప్రారంభమవుతుందంటే, దేశ సంపదలో గణనీయమైన భాగం అతి కొద్దిమంది చేతుల్లోనే నిలిచిపోవడం. సంపద సమాజంలో సమతుల్యంగా చలామణి కాకపోతే ఆర్థిక వ్యవస్థలో అసమానతలు మరింత తీవ్రమవుతాయి. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్నివర్గాలకు చేరకపోతే, దేశ వృద్ధి గణాంకాలు ఎంత ఆకర్షణీయంగా కనిపించినా సాధారణ ప్రజల జీవితాల్లో మార్పు కనిపించదు. నివేదికలో మరో ముఖ్యమైన అంశం కూడా ఉంది. అగ్రస్థానంలో ఉన్న 100 కుటుంబాల చేతిలోనే రూ.76.5 లక్షల కోట్ల సంపదఉంది. అందులో సగానికి సమానమైన సంపద కేవలం తొలి పది కుటుంబాల చేతుల్లోనే కేంద్రీకృతమై ఉంది. ఇది సంపద పంపిణీలో ఉన్న తీవ్ర అసమానతను స్పష్టంగాచూపిస్తోంది. ఇటీవలి కాలంలో భారత్‌లో తొలి తరం పారిశ్రామికవేత్తల సంఖ్య పెరగడం, యువ పారిశ్రామికవేత్తలు ముందుకు రావడం, మహిళల భాగస్వామ్యం పెరగడం వంటి పరిణామాలు సానుకూల సంకేతాలే. కొత్త ఆలోచనలతో వ్యాపా




రాలు ప్రారంభించి సంపద సృష్టిస్తున్న యువత దేశ భవిష్యత్తుకు ఆశాకిరణం. అయితే అదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, విద్యా అసమానతలు, ఆరోగ్య సేవల కొరత, పోషకాహార లోపంవంటి సమస్యలు ఇంకా తీవ్రంగానే కొనసాగుతున్నాయి. దేశంలో లక్షలాది మంది యువకులు ఉన్నత విద్య పూర్తి చేసినప్పటికీ తగిన ఉపాధి అవకాశాలు దొరకడం లేదు. అనేక కుటుంబాలు కనీస వైద్య సేవల కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. రైతులు ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్నారు. పట్టణాల్లో జీవన వ్యయం పెరుగుతోంది. గ్రామాల్లోఆదాయ వనరులు పరిమితంగానే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో కొద్ది మంది వద్ద మాత్రమే అపార సంపద పేరుకుపోవడం సహజంగానే సామాజిక చర్చకు దారితీస్తుంది. ఆర్థిక అసమానత పెరిగిన ప్రతి దేశంలో సామాజిక అసంతృప్తి కూడా పెరిగిన ఉదాహరణలు చరిత్రలో ఉన్నాయి.అవకాశాల్లో అసమానత, విద్యలో అసమానత, ఆరోగ్య సేవల్లో అసమానత, ఆదాయంలో అసమానతలు కలిసివస్తే సామాజిక స్థిరత్వంపైనా ప్రభావం చూపే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఈ అంశాన్ని కేవలం రాజకీయ కోణంలో కాకుండా దేశ దీర్ఘకాలిక అభివృద్ధి కోణంలో పరిశీలించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వాల ప్రధాన బాధ్యత కేవలం సంపద సృష్టికి అనుకూల వాతావరణం కల్పించడం మాత్రమే కాదు. ఆ సంపద ఫలాలు సమాజంలోని విభిన్న వర్గాలకు చేరేలా విధానాలు రూపొందించడం కూడా అంతే ముఖ్యమైనది. నాణ్యమైన ప్రభుత్వ విద్య, అందుబాటులో ఆరోగ్య సేవలు, నైపుణ్యాభివృద్ధి, చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహం, వ్యవసాయానికి విలువ ఆధారిత మార్కెట్లు, గ్రామీణ ఉపాధి, సామాజిక భద్రత వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. అలాగే పన్నులవ్యవస్థ పారదర్శకంగా ఉండాలి. పన్ను ఎగవేతను కట్టడి చేయాలి. నల్లధనాన్ని నిరోధించాలి. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఆర్థిక సహకారం పెంచాలి.యువతకు స్టార్టప్ అవకాశాలు విస్తరించాలి. ప్రాంతీయ అసమానతలను తగ్గించే పెట్టుబడులను ప్రోత్సహించాలి. ఈ చర్యల ద్వారా మాత్రమే సంపద మరింత విస్తృతంగా సమాజంలో చలామణి అవుతుంది. భారత్‌లో ఆర్థిక సంస్కరణలు కాంగ్రెస్ ప్రభుత్వాల కాలంలో ప్రారంభమయ్యాయి. అనంతరం వచ్చిన ప్రభుత్వాలు కూడా వాటిని కొనసాగించాయి. వివిధ రాజకీయ పార్టీల పాలనలో ఆర్థిక వ్యవస్థ వేగంగా ఎదిగినప్పటికీ, అదే సమయంలో సంపద కేంద్రీకరణ కూడా పెరిగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అందువల్ల ఇది ఒక్క పార్టీకి సంబంధించిన అంశం కాదు. దీర్ఘకాలిక విధానాల ప్రభావాన్ని సమీక్షించాల్సిన జాతీయ అంశం. ప్రపంచవ్యాప్తంగా విజయవంతమైన ఆర్థిక వ్యవస్థలు పెట్టుబడులను ప్రోత్సహించడంతో పాటు సామాజిక భద్రతను కూడా బలోపేతం చేశాయి. అభివృద్ధి, సమాన అవకాశాలు రెండూ కలిసే ముందుకు నడిచినప్పుడు మాత్రమే సమాజంలో స్థిరత్వం ఏర్పడుతుంది. భారతదేశంకూడా అదే సమతుల్యతను సాధించాల్సిన అవసరం ఉంది.సంపద సృష్టిదేశానికి అవసరం. కానీ ఆసంపద సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి దోహదపడితేనే అది నిజమైన అభివృద్ధి అవుతుంది. కొద్దిమంది సంపన్నుల విజయగాథలతో పాటు కోట్లాది సామాన్య కుటుంబాల జీవితాల్లో కూడా ఆశాకిరణం కనిపించినప్పుడే భారత అభివృది పూర్తి అవుతుంది.లేకపోతే ఆర్థికవృద్ధి గణాంకాలు పెరిగినా,సామాజిక అసమానతలుదేశ భవిష్యత్తుపై ప్రశ్నార్థక చిహ్నం మిగిల్చే ప్రమాదం ఉంది. ●

# మరో ఐదేళ్లు 'పిఎం కిసాన్ సమ్మాన్'



## ఈ పథకం కోసం రూ.3.15 లక్షల కోట్లు కేటాయింపు
## సముద్ర మంథన్ కార్యక్రమానికి రూ.84,084కోట్లు
## పిఎం సూర్య సరోవర్ యోజనకు రూ.5,070కోట్లు
## కేంద్ర కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి అశ్విని వైష్ణవ్

**న్యూఢిల్లీ, జులై 31:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన కేంద్ర మంత్రివర్గ సమావేశం 'ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పిఎంకెఐఎస్ఎఎన్) పథకాన్ని మరో ఐదేళ్లపాటు (2026-27 నుండి 2030-31 వరకు) కొనసాగించడానికి ఆమోదం తెలిపింది. దీనికి మొత్తం రూ.3.15 లక్షల కోట్లు కేటాయించింది. దీంతోపాటు వివిధ అభివృద్ధి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు కేంద్ర మంత్రిమండలి పచ్చజెండా ఊపినట్లు కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. పునరుత్పాదక ఇంధన రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు రూ.5,070 కోట్లతో 'ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన'కు కేబినెట్ ఆమోదం తెలిపింది. జలాశయాలు, పారిశ్రామిక చెరువులపై సోలార్ ప్లాంట్ల నిర్మాణమే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించారు.

ప్రస్తుతం ఉన్న 700 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ సామర్థ్యాన్ని 5,000 మెగావాట్లకు పెంచనున్నారు. 10,000 మెగావాట్ల సామర్థ్యంతో ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌లను అందుబాటులోకి తీసుకురానున్నారు. 2026-27 నుంచి 2030-31 వరకు ప్రాజెక్టులను అమలులోకి తీసుకురానుండగా, 2032-33 వరకు కేంద్రం ఆర్థిక సహకారం అందించనుంది. ప్రాజెక్టు సాధ్యాసాధ్యాల అధ్యయనానికి ఒక్కో ప్రాజెక్టుకు రూ.50 లక్షల వరకు, అలాగే నిర్మాణ దశలో ప్రతి మెగావాట్‌కు రూ.కోటి చొప్పున కేంద్రం ఆర్థిక సహాయం చేయనుంది. ఈ పథకం ద్వారా ఏటా సుమారు కోటి టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గనున్నాయి. దాదాపు 16 వేల నుంచి 17వేల మందికి ప్రత్యక్ష ఉపాధి లభించడమే కాకుండా దేశీయ సోలార్, బ్యాటరీ తయారీ రంగానికి భారీ ఊతం లభించనుంది.

### కేంద్ర ఆర్థిక లోటు జూన్ నాటికి రూ. 3.08 లక్షల కోట్లు..



**న్యూఢిల్లీ,జులై 31:** కేంద్ర ప్రభుత్వ ఆర్థిక లోటు ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన వార్షిక లక్ష్యంలో జూన్ నెలాఖరు నాటికి 18.2 శాతానికి చేరిందని కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ విడుదల చేసిన తాజా గణాంకాలు వెల్లడించాయి. మొత్తం ఫిస్కల్ డెఫిసిట్ రూ.3.08 లక్షల కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో ఇది వార్షిక లక్ష్యంలో 17.9 శాతంగా ఉంది. మే నెలలో ఫిస్కల్ డెఫిసిట్ 1.62 లక్షల కోట్లు ఉండగా, జూన్‌లో అది దాదాపు రెండింతలు పెరిగి రూ. 3.08లక్షల కోట్లకు చేరింది. ఇటీవలి నెలల్లో ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వ వ్యయాలు పెరిగి, ఆదాయ వ్యయం మధ్య అంతరం మరింత విస్తరించినట్లు పేర్కొంటున్నారు. జూన్ నాటికి కేంద్ర ప్రభుత్వ నికరపన్ను వసూళ్లు రూ.6.36 లక్షల కోట్లకు చేరాయి. ఇది 2027వార్షిక లక్ష్యంలో 22.2శాతం. గత ఏడాది ఇదే సమయంలో ఈ వాటా 19 శాతం మాత్రమే ఉండటం గమనార్హం. మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం వ్యయాన్ని కొనసాగిస్తోంది. జూన్ నాటికి మూలధన వ్యయం రూ.3.40 లక్షల కోట్లకు చేరి, వార్షిక లక్ష్యంలో 27.8 శాతం పూర్తైంది. గతఏడాది ఇదే సమయంలో ఇది 24.5శాతం ఉండగా, మేఖరుకు 2.51లక్షలకోట్లు ఖర్చు చేసింది. ఏప్రిల్ జూన్ కాలంలో కేంద్ర ప్రభుత్వ రెవెన్యూలోటు గణనీయంగా తగ్గి రూ.2,578 కోట్లకు చేరింది. మేకు ఇది రూ.68,985కోట్లు ఉండటం గమనార్హం. రెవెన్యూ వ్యయంలో ఉద్యోగుల వేతనాలు,పెన్షన్లు, వడ్డీచెల్లింపులు,సబ్సిడీలు వంటి సాధారణ ఖర్చులుంటాయి.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి మూడునెలల్లో కేంద్ర ప్రభుత్వం మొత్తంగా 13.50లక్షల కోట్లు ఖర్చు చేసింది. ఇది 2027ఆర్థిక సంవత్సర అంచనా వ్యయంలో 25.4 శాతం.

సముద్ర వనరుల పరిశోధన, వినియోగం దిశగా చేపడుతున్న రూ.84,084 కోట్ల విలువైన 'సముద్ర మంథన్' ప్రాజెక్టును కేంద్ర కేబినెట్ ఆమోదించింది. క్రీడారంగాన్ని ప్రోత్సహించేందుకు 'ఖేలో ఇండియా, జాతీయ క్రీడ ఫెడరేషన్ల పథకానికి రూ.36,441 కోట్లు మంజూరు చేశారు. రవాణా మౌలిక సదుపాయాలను మెరుగుపరచేందుకు టన్నెల్ ట్యూబ్ సొరంగాల నిర్మాణాలకు గాను రూ.9,779 కోట్లు కేటాయిస్తూ కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది.



# గాజాలో యుద్ధం ముగింపు?

## ఆయుధాలు వదిలేందుకు హమాస్ సిద్ధం: ట్రంప్

**టెల్అవీవ్, జులై 31:** ఇజ్రాయెల్-హమాస్ దాడులతో మూడేళ్లుగా అల్లకల్లోలమైన గాజాలో యుద్ధం ముగియనున్నట్లు కనిపిస్తోంది. గాజాలో హమాస్, ఇతర సాయుధ గ్రూపులు పూర్తి నిరాయుధీకరణకు అంగీకరించాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ మేరకు బోర్డ్ ఆఫ్ పీస్ ఒక అంగీకారానికి వచ్చిందని వెల్లడించారు. గాజాలో శాంతి స్థాపన కోసం ట్రంప్ ఏర్పాటు చేసిన శాంతి మండలినే బోర్డ్ ఆఫ్ పీస్ అంటారు. 20 పాయింట్ల శాంతి ప్రణాళికను ప్రతిపాదించగా అందులో ఒకటే హమాస్ నిరాయుధీకరణ. అయితే ఇంతకాలం ఆయుధాలు వదిలేసేందుకు ఆ గ్రూప్ అంగీకరించలేదు. దాంతో 2023 అక్టోబరు7నుంచి ఇజ్రాయెల్-హమాస్ మధ్యతీవ్ర ఘర్షణలు కొలిక్కిరాకుండా పోయాయి. తాజాగా ఈ గ్రూప్ అంగీకరించడంతో శాశ్వత శాంతి, భద్రత దిశగా చరిత్రాత్మక ముందడుగు పడిందని ట్రంప్ ట్రూత్ వేదికగా పోస్టు పెట్టారు. తొమ్మిది నెలల క్రితం ఈ శాంతి ప్రణాళికపై సంతకాలు జరగ్గా హమాస్ నిరాయుధీకరణకు తాజాగా అంగీకరించింది.

**ఈ శాంతి ప్రణాళికలో కొన్ని పాయింట్లు..**

ఒప్పందం కుదిరిన 72 గంటల్లో బందీలనందరినీ హమాస్ విడుదల చేయాలి. ప్రతిగా 250 మంది ఖైదీలను ఇజ్రాయెల్ విడిచి పెట్టాలి. 1,700 మంది సాధారణ పౌరులను వదలిపెట్టాలి. గాజా పాలనలో హమాస్ పాత్ర ఉండదు. దాని ఆయుధ వ్యవస్థలను, సొరంగాలను ధ్వంసం చేయాల్సి ఉంటుంది. గాజాలో అంతర్జాతీయ పాలన ప్రారంభమవుతుంది. అంతర్జాతీయ పాలన సమయంలో పాలస్తీనాఅథారిటీ సంస్కరణలను అమలు చేసి గాజా బాధ్యతలను చేపట్టేందుకు సిద్ధమవుతంది.

**మారిటైమ్ డిఫెన్స్ అలయన్స్**

పశ్చిమాసియాలో కీలక జలమార్గాల్లో నౌకాయాన రక్షణ కోసం సౌదీ అరేబియా సహా 13 దేశాలు జట్టు కట్టాయి. రియాద్‌లో జరిగిన సమావేశంలో భాగంగా మారిటైమ్ డిఫెన్స్ అలయన్స్‌ను ఏర్పాటు చేశాయి. ఈ కూటమిలో సౌదీతోపాటు కువైట్, బహ్రెయిన్, ఖతార్, ఈజిప్ట్, జోర్డాన్, యెమెన్, నైజీరియా, సూడాన్, జిబౌటీ, సోమాలియా దేశాలు వ్యవస్థాపక దేశాలుగా ఉన్నాయి. ఇరాన్ యుద్ధంతో అటు హార్ముజ్ జలసంధి, ఎర్ర సముద్రంలో నౌకల రాకపోకలపై తీవ్ర ప్రభావం పడుతోన్న నేపథ్యంలో ఈ కూటమిని ప్రకటించడం గమనార్హం. ఏ దేశాన్ని టార్గెట్ చేసే ఉద్దేశంతో దీనిని ఏర్పాటు చేయలేదని ఆ దేశాలు స్పష్టం చేశాయి.

# కావేరి జల వివాదం: 13న కర్ణాటక బంద్‌కు పిలుపు

## జననాయగన్ సినిమా ప్రదర్శన నిలిపివేత

**బెంగళూరు,జులై 31:** కావేరి జలాల వివాదం మరోసారి తీవ్రరూపం దాల్చడంతో కర్ణాటకలోని కన్నడ అనుకూల సంఘాలు ఆగస్టు 13న రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చాయి. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు బంద్ నిర్వహించనున్నట్లు ప్రకటించాయి. ప్రజలు, వివిధ సంఘాలు, వ్యాపార సంస్థలు ఈ బంద్‌కు మద్దతు ఇవ్వాలని నేతలు విజ్ఞప్తి చేశారు. కన్నడ అనుకూల ఉద్యమ నేత వటాల్ నాగరాజ్ బంద్ పిలుపును ప్రకటించారు. తమిళనాడుకు కావేరి జలాలను విడుదల చేయడాన్ని వ్యతిరేకిస్తూ, కర్ణాటక రాష్ట్ర నీటి అవసరాలను పరిరక్షించాలనే లక్ష్యంతో ఈ నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. ఆగస్టు 3న విమానాశ్రయం ముట్టడి రాష్ట్ర బంద్‌కు ముందు ఆందోళనలో భాగంగా ఆగస్టు 3న విమానాశ్రయం ముట్టడ కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నట్లు సంఘాలు వెల్లడించాయి. ఇటీవల కావేరి జలాల నియంత్రణ కమిటీ, కావేరి జలాల నిర్వహణ ప్రాధికార సంస్థ ఇచ్చిన తాజా ఆదేశాల నేపథ్యం లో కర్ణాటకలో కావేరి జలాల అంశం మళ్లీ రాజకీయ, ప్రజా చర్చల్లో ప్రధానంగా మారింది. పరిస్థితులు



ఉద్రిక్తంగా మారుతున్న నేపథ్యంలో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తమిళనాడు ముఖ్యమంత్రి సీజే విజయ్‌ను రెండు రాష్ట్రాల మధ్య జరగాల్సిన సమావేశాన్ని ప్రస్తుతం వాయిదా వేయాలని కోరినట్లు తెలిపారు. ఇప్పటికే పలు అంశాలపై చర్చలు జరపాలని రెండు రాష్ట్రాలు అంగీకరించాయని, తదుపరి సమావేశం త్వరలో జరగాల్సి ఉందని చెప్పారు. కోర్టు పరిణామాలు, సిడబ్ల్యుఆర్సీ, సిడబ్ల్యుఎంఎ నిర్ణయాలు, ప్రస్తుతం కొనసాగుతున్న నీటి ఆడిట్ వంటి పరిణామాల నేపథ్యంలో సమావేశానికి ఇది అనుకూల సమయం కాదని అభిప్రాయపడ్డారు ."రెండు రాష్ట్రాలకు ప్రయోజనం కలగాలని నేను కోరుకుంటున్నాను.

మన మధ్య ఎలాంటి విభే దాలు ఉండకూడదు. కర్ణాటక, తమిళనాడు రైతు లిద్దరూ కావేరి జలాలపై ఆధారపడి ఉన్నారఅని శివకుమార్ పేర్కొన్నారు. వర్షపాతం ఆధారంగానే నీటి లభ్యత ఉంటుందని, వివాదాలు పెం చుకోవడం కంటే రెండు రాష్ట్రాలు కలిసి పని చేయడం అవసరమని ఆయన సూచించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను పాటిస్తాం కావేరి జలాల అంశంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను కర్ణాటక ప్రభుత్వం పూర్తిగా అమలు చేస్తుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ చట్టపరమైన ఆదేశాలను ఉల్లంఘించే ఉద్దేశం లేదని డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ప్రతిపాదిత మేకేదాటు ప్రాజెక్టుపై మాట్లాడుతూ, అది కర్ణాటకతో పాటు తమిళనా డుకూ ప్రయోజనం చేకూరుస్తుందని తెలిపారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా నీటి సరఫరా నియంత్రణ మెరుగుపడుతుందని, కర్ణాటకకు విద్యుత్ ఉత్పత్తి పరంగా కూడా లాభం ఉం టుందని చెప్పారు. కావేరి అంశంపై భవిష్యత్తులో తీసుకునే నిర్ణయాల గురించి అన్ని రాజకీయ పార్టీలకు సమాచారం అందిస్తామని, ఉమ్మడి కార్యాచరణపై చర్చించేందుకు త్వరలో ప్రతిపక్ష పార్టీలతో సమావేశం నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు

**జననాయగన్ బంద్**

ఇదిలా ఉంటే కర్ణాటకలో తమిళనాడు సిఎం విజయ్ నటించిన చివరి చిత్రం జననాయగన్ విడుదల నిలిచిపోయింది. థియే టర్లవద్దకూడా ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా బందబోస్తు ఏర్పాటుచేసారు. అలాగే మాండ్య జిల్లాలో కన్నడసంఘాల కార్యకర్తలు సినిమా ప్రచార బ్యానర్లను తొలగించారు. ఈ అంశంపై చర్చించేందుకు కర్ణా టక ఫిలింఛాంబర్ అత్యవసర సమావేశం కూడా ఏర్పాటు చేసింది.

## ఐబి అధికారి అంకిత్ శర్మ హత్య కేసులో తాహిర్ హుస్సేన్‌కు యావజ్జీవ శిక్ష



**న్యూఢిల్లీ,జులై 21:** ఈశాన్య ఢిల్లీలో జరిగిన అల్లర్ల సందర్భంగా ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి అంకిత్ శర్మ హత్య కేసులో మాజీ ఆమ్ ఆద్మీ పార్టీ కార్పొరేటర్ తాహిర్ హుస్సేన్‌కు ఢిల్లీ కర్కర్డూమా కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. శిక్షను ప్రకటిస్తూ కోర్టు ఈ హత్య అత్యంత క్రూరమైన రీతిలో జరిగిందని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. "హత్యతో క్రూరత్వం ఆగిపోలేదు. మృతదేహాన్ని సమీపంలోని డ్రెయిన్‌లో పడేయడం ద్వారా ద్వేషం ఇంకా తీరలేదన్నట్లుగా వ్యవహరించారు. ఈ నేరం అత్యంత అరుదైన కేసుల కోవకు చెందుతుంది. నేరం తీవ్రత, క్రూరత్వం నిందితులకు అనుకూలంగా ఉన్న అంశాల కంటే చాలా ఎక్కువగా ఉందని కోర్టు పేర్కొంది. మరణశిక్ష విధించకుండా యావజ్జీవ శిక్ష విధించడానికి గల కారణాలను కూడా కోర్టు వివరించింది. నిందితులు పూర్తిగా మారే అవకాశం లేదని తేల్చేందుకు తగిన ఆధారాలు లేవు. ప్రతి నిందితుడి వ్యక్తిగత పాత్ర స్పష్టంగా నిరూపితం కాకపోవడం, వారి విద్యా నేపథ్యం, తప్పుడు సమాచార ప్రభావానికి గురికావడం వంటి అంశాలు శిక్ష విషయంలో ఉపశమన పరిస్థితులుగా పరిగణించబడ్డాయని కోర్టు వెల్లడించింది. 2020 ఫిబ్రవరి చివరిలో ఈశాన్య ఢిల్లీలో అల్లర్లు చెల రేగిన సమ యం లో 26 ఏళ్ల ఐబీ సెక్యూరిటీ అసిస్టెంట్ అంకిత్ శర్మపై గుంపు దాడి చేసింది. కత్తులు, ఇనుప రాడ్లు, కర్రలు, రాళ్లతో దారుణంగా దాడి చేసి అనంతరం ఆయన మృతదేహాన్ని డ్రెయిన్‌లో పడేశారు. మరుసటి రోజు వెలికితీసిన మృతదేహంపై 51 కత్తిపోట్లు ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. చార్జ్ షీట్ ప్రకారం, 2020 ఫిబ్రవరి 25 సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో తాహిర్ హుస్సేన్ ఇంటి సమీపంలో రెండు వర్గాల మధ్య ఉద్రిక్తతలను శాంతింపజేయడానికి అంకిత్ శర్మ ప్రయత్నిస్తుండగా, గుంపు ఆయనను చుట్టుముట్టి దాడిచేసింది. తాహిర్ హుస్సేన్ తరఫు న్యాయవాది తారా నరులా మాట్లాడుతూ, తమ క్లయింట్ సంఘటన జరిగిన సమయంలో గుంపులో మాత్రమే ఉన్నారని, హత్యకు ప్రత్యక్ష సంబంధంలేదని వాదించారు. ఐదుగురు నిందితుల్లో ఎవరూ కత్తితో దాడి చేసినట్లు ప్రత్యక్ష ఆధారాలు లేవని,ఇది పరోక్ష బాధ్యత ఆధారంగా నమోదైన కేసుఅని తెలిపారు. తాహిర్ హుస్సేన్ నిర్దోషి అని తమకునమ్మకం ఉందని, తీర్పును సవాలు చేస్తూ హైకోర్టులో అప్పీల్ దాఖలు చేయనున్నట్లు వెల్లడించారు.

# జననమరణాల నమోదు సవరణ బిల్లు ఆమోదం



## పార్లమెంట్ ఉభయ సభలు సోమవారానికి వాయిదా
## ప్రతిపక్ష ఆందోళనలతో కొనసాగుతున్న ప్రతిష్టంభన

**న్యూఢిల్లీ,జులై 31:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల పదో రోజు కూడా ప్రతిపక్ష సభ్యుల నిరసనలతో ఉభయ సభల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. ఈనెల 20న జరిగిన విద్యార్థుల నిరసన ర్యాలీలో పోలీసుల అధిక బలప్రయోగాన్ని వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష సభ్యులు చేపట్టిన ఆందోళనల కారణంగా లోక్‌సభ, రాజ్యసభ కార్యకలాపాలు సజావుగా సాగలేదు. దీంతో ఇరు సభలను సోమవారం వరకు వాయిదా వేశారు. గందరగోళం మధ్యలోనే లోక్‌సభ జనన, మరణాల నమోదు (సవరణ) బిల్లు-2026ను చర్చ లేకుండానే ఆమోదించింది. మరోవైపు రాజ్యసభలో ప్రతిపక్ష సభ్యుల నిరంతర నినాదాల మధ్య సభాపతి సీపీ రాధాకృష్ణన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రతిపక్ష వైఖరిని "నియంతృత్వ ధోరణి"గా అభివర్ణించారు. అనంతరం సభను రోజంతా వాయిదా వేశారు. ఈ సందర్భంగా అధికార, ప్రతిపక్షాల నుంచి ఒక్కో ప్రత్యేక హక్కుల ఉల్లంఘన (ప్రివిలేజ్) నోటీసు కూడా దాఖలైంది. జనన-మరణాల నమోదు బిల్లుకు ఆమోదంలోక్‌సభ మధ్యాహ్నం తిరిగి సమావేశమైన తర్వాత బీజేపీ ఎంపీ దిలీప్ సైకియా అధ్యక్షతన జనన, మరణాల నమోదు (సవరణ) బిల్లు-2026ను పరిశీలనకు తీసుకుని వాయిస్ ఓట్ ద్వారా ఆమోదించారు. ఈ బిల్లు 1969 జనన, మరణాల నమోదు చట్టంలోని నిబంధనలను సవరించి జననాలు, మరణాలను సకాలంలో నమోదు చేసే విధానాన్ని మరింత ప్రోత్సహించడమే లక్ష్యంగా రూపొందించారు. బిల్లు ఆమోదం అనంతరం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు ప్రతిపక్షంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చర్చలో పాల్గొనకుండా సభను అడ్డుకోవడం దురదృష్టకరమని, భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకూడదని సూచించారు. ప్రజలు పార్లమెంట్‌కు పంపిన ప్రతినిధులుగా తమ బాధ్యతను నిర్వర్తించాలని ప్రతిపక్ష సభ్యులకు ఆయన సూచించారు. అంతకుముందు కూడా సభా కార్యక్రమాలను అడ్డుకోవద్దని, తమ అభిప్రాయాలను వెల్లడించేందుకు ప్రభుత్వం తగిన అవకాశం కల్పిస్తుందని రిజిజు ప్రతిపక్షానికి విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్షం ముందస్తు ప్రణాళికతోనే అంతరాయం: ఓం బిర్లా ఉదయం 11 గంటలకు లోక్‌సభ సమావేశం ప్రారంభమైన వెంటనే ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ, సభా కార్యక్రమాలను అడ్డుకోవడం ప్రతిపక్షం ముందుగానే ప్రణాళికాబద్ధంగా చేపట్టిందని ఆరోపించారు. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా ప్రశ్న అడగడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రతిపక్ష సభ్యులే ప్రశ్నోత్తరాల సమయాన్ని కొన సాగనివ్వడం లేదని వ్యాఖ్యానించారు.

రాజ్య సభలో ప్రతి పక్షంపై సభాపతి ఆగ్రహం రాజ్యసభలో జీరో అవర్ ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు నినా దాలతో సభను హోరెత్తించారు. గందరగోళం మధ్య సభాపతి సీపీ రాధాకృష్ణన్ సభ్యులను శాంతించాలని కోరుతూ, మీ మాట అందరూ వినాలని కోరుకుంటున్నారు. కానీ ఇతరుల మాట వినేందుకు మీరు సిద్ధంగా లేరు. ఇది సరైన పద్ధతి కాదు. ఇది ప్రజాస్వామ్య విలువలకు విరు ద్ధమైన నియంతృత్వ ధోరణి అని వ్యాఖ్యానించారు. అయినప్పటికీ ఆందోళనలు కొనసాగడంతో సభను రోజంతా వాయిదా వేశారు.

## యుఎఇలో విమాన ప్రయాణికులకు హెచ్చరిక
# ఎతిహాద్, ఎయిర్ అరేబియాల్లో పలు సర్వీసులు రద్దు

**దుబాయ్, జులై 31:** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుంచి బయలుదేరే లేదా యూఏఈకి వచ్చే విమాన ప్రయాణికులు శుక్రవారం విమానాశ్ర యానికి వెళ్లే ముందు తమ విమానాల స్థితిని తప్పనిసరిగా పరిశీలించాలని విమానయాన సంస్థలు సూచించాయి. భద్రతా పరిస్థితులు మరియు ఆపరేషనల్ కారణాల దృష్ట్యా ఎతిహాద్ ఎయిర్‌వేస్ మరియు ఎయిర్ అరేబియా బహ్రె యిన్, కువైట్, సౌదీ అరేబియాలకు వెళ్లే పలు విమాన సర్వీసులను రద్దు చేశాయి. మధ్య ప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తున్న విమానయాన సంస్థలు అవసరానికి అనుగుణంగా తమ కార్యకలాపాల్లో మార్పులు చేస్తున్నాయి. ఎమిరేట్స్ మరియు ఫ్లైదుబాయ్ సంస్థలు ప్రస్తుతం తమ షెడ్యూల్ ప్రకారం సేవలను కొనసాగిస్తున్నట్లు ప్రకటించాయి. యూఏఈలో విమాన సేవలు సాధారణంగానే కొనసాగుతున్నప్పటికీ, ప్రాంతీయ భద్రతా పరిస్థితుల ప్రభావంతో కొన్ని అంతర్జాతీయ, ప్రాంతీయ విమానయాన సంస్థలు మార్గాలు, సమయాల్లో మార్పులు చేస్తున్నాయి. ఎతిహాద్, ఎయిర్ అరేబియా విమానాల రద్దుఎతిహాద్ ఎయిర్‌వేస్ అబుదాబి నుంచి బహ్రెయిన్, కువైట్‌కు వెళ్లే కొన్ని విమానాలను రద్దు చేసినట్లు వెల్లడించింది. ఇందులో అబుదాబి నుంచి కువైట్‌కు వెళ్లే, కువైట్ నుంచి అబుదాబికి వచ్చేవిమానాలు కూడా ఉన్నాయి. రద్దు ప్రభావిత ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లు చేస్తున్నట్లు సంస్థ తెలిపింది. ఎయిర్ అరేబియా కూడా శుక్రవారం పలు సర్వీసులను రద్దు చేసింది. వాటిలో షార్జా-కువైట్ మధ్య జి9068, జి9124, షార్జా-బహ్రెయిన్ మధ్య జి9107, షార్జా-అభా మధ్య జి9195, అలాగే అబుదాబి-కువైట్ మధ్య నడిచే 3ఎల్020 విమానాలు ఉన్నాయి. ప్రయాణికులు తమ టికెట్ బుకింగ్ స్థితిని సంస్థ అధికారిక వెబ్‌సైట్ లేదా కస్టమర్ సర్వీస్ ద్వారా ముందుగానే నిర్ధారించుకోవాలని ఎయిర్ అరేబియా సూచించింది. ఇతర విమానయాన సంస్థలలోనూ మార్పులుఎమిరేట్స్, ఫ్లైదుబాయ్ సేవలు యథావిధిగా కొనసాగుతున్నప్పటికీ, మరికొన్ని విమానయాన సంస్థలు తాత్కాలిక పరిమితులు విధించాయి. ఖతార్ ఎయిర్‌వేస్ జులై 31 వరకు బహ్రెయిన్, ఎర్బిల్, కువైట్‌కు ప్రయాణికుల సేవలను నిలిపివేసింది. సౌదియా సంస్థ అక్టోబర్ 2026 చివరి వరకు షెడ్యూల్ మార్పులు, విమానాల రద్దు వివరాలను తమ రిజర్వేషన్ వ్యవస్థలో నవీకరించినట్లు తెలిపింది. అంతర్జాతీయంగా కూడా పలు సంస్థలు గల్ఫ్ ప్రాంత సేవలపైఆంక్షలను పొడిగించాయి. బ్రిటిష్ ఎయిర్‌వేస్ దుబాయ్, బహ్రెయిన్, అమ్మాన్, టెల్ అవీవ్‌లకు అక్టోబర్ 31 వరకు విమానాలను నిలిపివేసింది. సింగపూర్ ఎయిర్‌లైన్స్, ఎయిర్ కెనడా, కాథే పసిఫిక్, ఫిన్నైర్, ఐటీఏ ఎయిర్‌వేస్ సంస్థలు దుబాయ్ సేవల నిలుపుదలను అక్టోబర్ 24 వరకు పొడిగించాయి. లుఫ్తాన్సా, స్విస్, కేఎల్ఎమ్,ఏజియన్ఎయిర్‌లైన్స్,ఎయిర్ అస్తానా, ఫిలిప్పీన్ ఎయిర్‌లైన్స్,విజ్ ఎయిర్ తదితర సంస్థలు కూడా తమ సేవల్లో తాత్కాలిక మార్పులు ప్రకటించాయి.ప్రయాణ సమయం పెరిగే అవకాశంభద్రతా కారణాలతో మధ్యప్రాచ్య గగనతలంలోని కొన్ని ప్రాంతాలను విమానాలు దాటకుండా పత్యామ్నాయ మార్గాలను ఉపయోగిస్తు న్నాయి. దీంతో కొన్నివిమానాల ప్రయాణ సమయం మూడుగంటల వరకు పెరిగేఅవకాశం ఉందని విమానయాన సంస్థలు పేర్కొన్నాయి. దీంతో పాటు చివరి నిమిషంలో షెడ్యూల్‌మార్పులు, కనెక్టింగ్ విమానాశ్రయాల్లో ఎక్కువనిరీక్షణ సమయం, సామాను అందడంలో ఆలస్యం వంటి సమస్యలు కూడా తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించాయి.

## కారుణ్య నియామకాల నుండి వివాహిత కుమార్తెలను
## మినహాయించలేరు: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, జులై 31:** కేవలం విడాకులు తీసుకున్న లేదా తండ్రి విడిచిపెట్టిన కుమార్తెలకు మాత్రమే కారుణ్య నియామకాలను రాష్ట్ర ప్రభుత్వ విధానం అనుమతిస్తోం దన్న కారణంతో, వివాహిత కుమార్తెను కారుణ్య నియామకానికి పరిగణించకుండా నిరాకరించలేమని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఇటువంటి వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను ఉల్లంఘిస్తోందని పేర్కొంది. తండ్రి మరణం తర్వాత కారుణ్య నియామకం కోసం కుమార్తె చేసిన అభ్యర్థనను తిర స్కరించిన పాట్నా హైకోర్టు ఉత్తర్వుకు వ్య తిరేకంగా సయారా ఖటూన్, ఆమె కుమా ర్తె దాఖలు చేసిన అప్పీలును జస్టిస్ ఎం.ఎం.సుందరేష్, ప్రసన్న బి.వరలేలతో కూడిన ధర్మాసనం అనుమతించింది. విడా కులు తీసుకున్న లేదా భర్తచే విడిచిపెట్టబడిన కుమార్తెలకు మాత్రమే కారుణ్య నియామకాలను పరిమితం చేసే విధానంపై, ఇటువంటి విషయాలలో కుమారులు, కుమార్తెల మధ్య ఎలాంటి భేదాభిప్రాయం చూపడం రాజ్యాంగ విరుద్ధమని జస్టిస్ సుందరేష్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. "కుమార్తెను కుమారుడి నుండి వేరుచేసే ఏ వర్గీకరణ అయినా, స్వతహాగా రాజ్యాంగ విరుద్ధం అని స్పష్టం చేసింది. "అర్హతను కేవలం విడాకులు తీసుకున్న లేదా భర్తచే విడిచిపెట్టబడిన కుమార్తెకు మాత్రమే పరిమితం చేసే వర్గీకరణ చట్టరీత్యా నిలబడదు అని పేర్కొంది. "వివాహం తర్వాత, ఒక కుమార్తె తన పుట్టింటి కుటుంబంతో సంబంధాలను తెంచుకుని, తన అత్తగారి ఇంట్లో భర్తతో కలిసి నివసిస్తుందనే భావన చట్టరీత్యా ఉండటానికి వీల్లేదు. చట్టపరంగా తన విడాకులు అధికారికంగా గుర్తించబడనప్పటికీ, తాను తన పుట్టింటి వారితోనే నివసిస్తూ, తల్లి, సోదరుడి మద్దతును పొందుతున్న విషయాన్ని గుర్తించాలి. ఏదేమైనప్పటికీ, కారుణ్య నియామకం కోసం ఆమె చేసిన అభ్యర్థ నను పరిగణనలోకి తీసుకోకపోవడానికి, అతి సాంకేతిక దృక్పథాన్ని అవలం బించడం ఒక కారణంగా ఉండకూడదు అని ధర్మాసనం పేర్కొంది. పాట్నా హైకో ర్టు ఉత్తర్వును, కారుణ్య నియామక అభ్య ర్థన తిరస్కరణను పక్కన పెడుతూ, అప్పీ లుదారు కేసును దాని యథార్థ గుణగణాల ఆధారంగా పునః పరిశీలించాలని సుప్రీంకోర్టు బీహార్ అధికారులను ఆదేశించింది. "ఈ ఉత్తర్వు ప్రతి అందిన తేదీనుండి ఎనిమిది వారాల వ్యవధిలో, కారుణ్య నియామకం కోసం అప్పీలుదారు కేసును దాని యథార్థ గుణగణాల ఆధారంగా పరిశీలించాలని బీహార్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది.

# సంక్షిప్త వార్తలు

## సైనిక స్థావరాల సమీపంలో పాక్ నిఘా డ్రోన్ కూల్చివేత



**శ్రీనగర్, జులై 31:** భారత సైనిక స్థావరాల సమీపంలో చక్కర్లు కొడుతున్న పాకిస్థాన్ నిఘా డ్రోన్‌ను సైన్యం కూల్చివేసింది జమ్మూలోని ఖౌర్ సెక్టార్‌లో ఈ సంఘటన జరిగింది. చక్లా గ్రామానికి సమీ పంలోని కీలక రక్షణ స్థావరాలవద్ద పాక్ నిఘాడ్రోన్ ఎగురుతుండటాన్ని ఆర్మీ సిబ్బంది గమనించి వెంటనే దానిని కూల్చివేశారు. చైనా తయారీ డ్రోన్‌గా ఆర్మీ అధికారులు గుర్తించారు. డ్రోన్ శకలాలతోపాటు అందులోఉన్న 64జిబిమైక్రోఎస్డీ కార్డును స్వాధీనం చేసుకున్నారు.

## నన్ను అరెస్టు చేస్తే రంగంలోకి ప్రత్యేక దళాలు: నెతన్యాహు




**జెరూసలేం, జులై 31:** ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు అమెరికాకు వస్తే అంతర్జాతీయ క్రిమినల్‌కోర్టు వారంట్‌పై ఆయనను అరెస్టు చేయాలని న్యూయార్క్ నగరమేయర్ జోహ్రాన్ మమ్దానీ ఇటీవల వ్యాఖ్యలు చేశారు. వీటిపై నెతన్యాహు స్తందిస్తూ తనను ఎవరైనా అరెస్టుచేస్తే ఇజ్రాయెల్ ప్రత్యేక దళాలు రంగంలోకి దిగుతాయని హెచ్చరించారు. న్యూయార్క్‌లో ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశానికి తప్పక హాజరవుతానని స్పష్టంచేశారు. యూదులలో విద్వేషాన్ని రెచ్చగొట్టడానికే మమ్దానీ తనపై అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఐసిసి అవినీతిమయమైన సంస్థఅని అదితనపై నకిలీవారంట్‌ను జారీ చేసిందని కొట్టిపడేశారు.

## భారత్, చైనా, రష్యా సంస్థలపై అమెరికా ఆంక్షలు



**వాషింగ్టన్, జులై 31:** ఇరాన్ సంస్థ 'మహాన్ ఎయిర్'కు సహకరిస్తున్నారన్న ఆరోపణలపై భారత్‌కు చెందిన స్కైజ్ ట్రావెల్స్‌పై అమెరికా ఆంక్షలు విధించింది. అలాగే రష్యా, చైనా దేశాల సంస్థలు, వ్యక్తులను కూడా ఆ ఆంక్షల జాబితాలో చేర్చింది. ఐఆర్‌జిసికి ఉన్న వ్యవస్థల్లో మహాన్ ఎయిర్ కీలకం. 'ఐఆర్‌జిసి లేక మహాన్ ఎయిర్‌కు ఆర్థిక సేవలు, లాజిస్టిక్స్, వాణిజ్య సహకారం అం దించేవారు ఉగ్రవాద సంస్థకు సహాయం చేస్తున్నట్లే అవుతుంది' అని యుఎస్ ఆర్థిక శాఖ మంత్రి స్కాట్ బెసెంట్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

## సెప్టెంబర్‌లో భారత్‌కు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ రాక




**న్యూఢిల్లీ,జులై 31:** ఈ ఏడాది సెప్టెంబర్‌లో న్యూఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భారత్‌కు రానున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలో ఈ సదస్సు జరగనుంది. జిన్‌పింగ్ భారత పర్యటనపై ఇప్పటివరకు చైనా లేదా భారత ప్రభుత్వాల నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. 2020 గాల్వాన్ లోయ ఘర్షణల తర్వాత షీ జిన్‌పింగ్ భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి కానుంది. ఈ సదస్సుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా హాజరుకానున్నట్లు సమాచారం. జిన్‌పింగ్ చివరిసారిగా 2019 అక్టోబర్‌లో భారత్‌ను సందర్శించారు.

## బిజెపి సీనియర్ నేత షెహజాద్ పూనావాలా రాజీనామా



**న్యూఢిల్లీ,జులై 31:** బిజెపి జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా బీజేపీకి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో ఆయన తన రాజీనామా సమర్పించినట్లు సమా చారం. ఈ మేరకు బీజేపీ అగ్రనాయకత్వానికి తన రాజీనామా లేఖ అందజేశారు. షెహజాద్ పూనా వాలా బీజేపీకి అధికార ప్రతినిధిగా ఉంటూ, టీవీ చర్చల్లో ఆ పార్టీ తరఫున గళం వినిపిస్తుంటారు. అనేక రాజకీయ అంశాల్లో బీజేపీని, మోడీని సమర్థిస్తూ పార్టీకి అండగా నిలిచారు. ఇటీవల తన సోషల్ మీడియా ఖాతాలో ఆయన రాజకీయ విషయాలు, భవిష్యత్ ప్రణాళికల గురించి వివరించారు.

## నిషేధిత జైషే ఉగ్రవాది హమీద్ మోండల్ అరెస్ట్



**కోల్‌కత్తా,జులై 31:** పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత ఉగ్రవాద సంస్థ జైషే మొహమ్మద్ తీవ్రవాద సం స్థకు చెందిన కీలక ఉగ్రవాది హమీద్‌మండల్ అరెస్టయ్యాడు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఎస్టీఎఫ్ పోలీసులు అతడిని బర్ధమాన్ ప్రాంతంలో శుక్రవారం అరెస్టుచేశారు. హమీద్ వద్ద లభించిన మొ బైల్ డేటా, కొన్ని డాక్యుమెంట్ల ఆధారంగా అతడు బెంగాల్ సీఎం సువేందు అధికారిపై దాడికి కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. హమీద్ జైషేమొహమ్మద్ సంస్థకు చెందిన మరో అగ్రనేత సజ్జద్ భట్‌కు అత్యంత సన్నిహితుడు. పుల్వామాలో జరిగిన ఉగ్రదాడికి ప్రధాన సూత్రదారుడు సజ్జద్ భట్ అని తెలిసిందే.

# అందుబాటులోకి ఫ్యామిలీ సర్టిఫికెట్ సేవ

## డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూలై31:** రాష్ట్రంలో ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ ప్రక్రియ ప్రారంభ మైందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. తహశీల్దార్ కార్యాలయాలు, మీ సేవా కేంద్రాల్లో ఫ్యామిలీ ధ్రువపత్రాలను పొందవచ్చని ఆయన తెలిపారు. కుటుంబ సమాచారం, సభ్యుల వివరాలతో సర్టిఫికెట్ జారీ చేస్తారని వెల్లడించారు. ఫ్యామిలీ సర్టిఫికెట్ అన్ని చోట్ల చెల్లుబాటు అవుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు తమ కుటుంబ సమాచారానికి సంబంధించి అవసరమైన సందర్భాలలో ఈ ధ్రువ పత్రాన్ని వినియోగించుకోవచ్చిని చెప్పారు. ప్రభుత్వ పథకాలు,వివిధ అధికారిక అవసరాలు,కుటుంబ వివరాలను సమర్పించాల్సి న సందర్భాలలో ఈ సర్టిఫికేట్ కీలకంగా మారునందని తెలిపారు. ఇప్పటి వరకు కుటుంబ వివరాల ధృవీకరణ కోసం ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించడంతో పాటు,ప్రజలకు సులభంగా సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రక్రియను ప్రారంభించినట్లు వెల్లడించారు.

తహశీల్దార్ కార్యాల యాలు, మీ సేవ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫి కెట్ కోసం రేషన్‌కార్డుల్లోని సమాచారాన్ని ప్రామాణికంగా తీసుకోనున్నారు. పౌర సరఫరాలశాఖ డేటాను రెవెన్యూశాఖ తీసుకోనుంది. ఫ్యామిలీ రిజిస్టర్ డిజిటల్ రూపంలో ఉంటుంది. ప్రతీ కుటుంబానికి గుర్తింపు కార్డును ఇస్తారు. రేషన్ కార్డు నంబరునే ఫ్యామిలీ రిజిస్టర్ ఐడెంటిఫికేషన్ నంబర్ (ఫిన్)గా ఇవ్వాలని యోచిస్తున్నారు.

రిజిస్టర్‌లో ప్రతి కుటుంబానికి రిజిస్టర్ ఐడెంటిఫికేషన్ నెంబరు, కుటుంబ యజమాని, కుటుంబ సభ్యులందరి పేర్లు, వయసు, కుటుంబ పెద్దతో బంధుత్వం, ఆధార్ నంబరు, చిరునామా తదితర వివరాలు ఉంటాయి. ప్రజలకు అవసరమైనప్పుడు

మీసేవ కేంద్రాల ద్వారా కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్‌ను ఇస్తారు. ఈ క్రమంలో మీ సేవలో రెవెన్యూ సర్వీసుల విభాగంలో ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ అనే కొత్త సర్వీసు రానుంది. మీ సేవ సెంటర్లు , యాప్, వాట్సప్ ద్వారా నిర్ణీత రుసుము చెల్లించి ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసిన రెండు రోజుల్లోనే సంబంధిత మండల తహసీల్దార్ రేషన్ కార్డు డేటా ఆధారంగా డిజిటల్ సైన్‌తో మీ సేవ ద్వారా ధ్రువపత్రాన్ని జారీ చేస్తారు. ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ కుటుంబ సభ్యుల వివరాల కోసమేనని ఆస్తులపై హక్కులు, లీగల్ హెయిర్ నిర్ధరణకు ఉపయోగపడదని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. కుటుంబ రిజిస్టర్‌లో నమోదైన వివరాలన్నీ ధృవపత్రంలో ఇవ్వనున్నారు.

పౌర సరఫరాల శాఖ డేటాను ఫ్యామిలీ రిజిస్టర్‌కు అనుసంధానం చేయడంతో పాటు మీ సేవ ద్వారా సర్టిఫికెట్‌ను జారీ చేసేందుకు అసరమైన సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేయాలని ఎలక్ట్రానిక్ సేవల డెలివరీ విభాగాన్ని ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. అవసరమైన వివరాలను ఈఎస్‌డీ విభాగానికి ఇవ్వాలని సివిల్ సప్లైస్ శాఖకు స్పష్టం చేసింది. ఫ్యామిలీ రిజిస్టర్ నిర్వహణ, ప్రజలకు సర్టిఫికెట్ ఇచ్చే బాధ్యతను ప్రభుత్వం రెవెన్యూ శాఖకు అప్పగించింది. ఫ్యామిలీ రిజిస్టర్, సర్టిఫికెట్ల విధి విధానాలపై రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు.

# కాళేశ్వరం బ్యారేజీల మరమ్మతులవైపు ఎన్‌డిఎస్‌ఎ మొగ్గు

### చర్చకు రాని అన్నారం, సుందిళ్ల ఎత్తిపోతల అంశం

### నెల రోజుల్లో మరమ్మతుల డిజైన్లపై తదుపరి సమావేశం

**హైదరాబాద్ జులై 31, ప్రభాతవార్త:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భవిష్యత్ కార్యాచరణపై జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ సాంకేతిక పర్యవేక్షణ కమిటీతో తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు శుక్రవారం న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. తెలంగాణ నుంచి నీటిపారుదలశాఖ కార్యదర్శి ఇ శ్రీధర్,కె.శ్రీనివాస్ టిఎస్ఆర్‌గుప్త, ఎంఎస్ఎన్‌రెడ్డిప్రమీల ఆర్ వెంకటరమణ టన్నెల్ రక్షణ సెక్రటరీ పరీక్షత్ మెహ్రాలు హాజరైనారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను వినియోగించి గోదావరిలోని ఎల్లంపల్లి రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోయాలని ఇటీవల వస్తున్న డిమాండ్‌పై ఈ సమావేశంలో చర్చకు తీసుకోవడానికి ఎన్‌డిఎస్‌ఎ సుముఖత చూపలేదు. కాళేశ్వరం ప్రాజెక్టులో దెబ్బతిన్న మూడు బ్యారేజీల మరమ్మతుల కోసం చేపట్టిన సాంకేతిక పరీక్షలు, వాటి ఫలితాలు, తదుపరి చేపట్టాల్సి న చర్యలపైనే సమావేశం ప్రధానంగా ఆలోచన చేసింది. బ్యారేజీల మరమ్మతులకు అవసరమైన సాంకేతిక డిజైన్ల తయారీకి అవసరమైన ప్రక్రియలపై కమిటీ అధికారులతో రాష్ట్ర బృందం సమీక్ష చేశారు. సమావేశంలో ఎన్‌డిఎస్‌ఎ అధికారులు మూడు బ్యారేజీల వద్ద నిర్వహించిన విస్తృత స్థాయి పరీక్షలపై పలు ప్రశ్నలు లేవనెత్తినట్లు సమాచారం. దీనికి రాష్ట్ర ప్రభుత్వ బృందం స్పందిస్తూ, ఈ పరీక్షలు ఎక్కువగా నిర్వహించినట్లు కనిపించినప్పటికీ, బ్యారేజీల నిర్మాణ స్థితి, భూగర్భ పరిస్థితులు, ఇతర సాంకేతిక ప్రమాణాలపై ప్రామాణిక సమాచారం సేకరించడానికి అవి అత్యవసరమని వివరించినట్లు తెలిసింది. భవిష్యత్‌లో మరమ్మతుల డిజైన్లు రూపొందించేందుకు, కంప్యూటర్ మోడలింగ్ అధ్యయనాలు నిర్వహించేందుకు ఈ సమాచారం కీలకమవుతుందని అధికారులు కమిటీకి వివరించారు. ఈ సమావేశానికి నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీధర్ నేతృత్వంలోని రాష్ట్ర బృందం హాజరైంది. ఇదిలా ఉండగా, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను వినియోగించి ఎల్లంపల్లి రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోసే అవకాశాన్ని పరిశీలించాలని ప్రతిపక్ష పార్టీలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నా ఇది సరైన నిర్ణయం కాకపోవడంతో దానిని పెద్దగా పరిగణలోకితీసుకోలేదు. ఎన్ఎడిఎస్ సాంకేతిక పర్యవేక్షణ కమిటీ, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల మధ్య మరో నెల రోజుల్లో మళ్లీ సమావేశం జరగనుంది. ఆ సమావేశంలో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులకు సంబంధించిన సవివర డిజైన్లు, సాంకేతిక ప్రతిపాదనలను పరిశీలించి తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

## గోదావరి నీటిని ఒడిసిపట్టడంలో విఫలం

### ఏడు పంపులు ఆన్‌చేస్తే మరో రెండు

### టిఎంసిలు మిడ్‌మానేరులో పడేవి

**హైదరాబాద్,జులై 31,ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో గత రెండు రోజులుగా కురిసిన వర్షాలతో గోదావరికి వరద వచ్చినా నీటిని ఒడిసిపట్టి మధ్యమానేరు రిజర్వాయర్‌కు గరిష్టస్థాయిలో తరలించడంలో ఆలస్యమైంది. నంది పంపుహౌజ్, గాయత్రి పంపుహౌజ్‌కు చెందిన ఏడు పంపులలో ఐదు పంపులు మాత్రమే వినియోగించడంతో మిడ్ మానేరుకు 48 గంటల్లో కేవలం 2.41 టిఎంసిలుమాత్రమే తరలించడం సాధ్యమైంది. మధ్యమానేరులో జులై 29 ఉదయం ఆరుగంటలకు 7.48 టిఎంసిల నీరు మాత్రమే ఉండేది. ఆరోజు మధ్యాహ్నం తొలుత మూడు పంపులు ఆన్ చేసి సాయంత్రం వరకు నాలుగు పంపులతో నీటిని ఎత్తిపోశారు. గురువారం, శుక్రవారం ఐదు పంపులు వినియోగించడంతో రోజుకు 1.74 టిఎంసిలు ఎత్తిపోయడం సాధ్యమైంది. గాయత్రి, నంది పంపుహౌజ్‌లోని ఏడు పంపులు ఆన్ చేయాలంటే మేడారం చెరువులో ఎఫ్ ఆర్ఎల్ 233అడుగుల ఎత్తులో నీటిని నిల్వచేయాల్సి ఉంటుంది. మేడారం చెరువులో నుంచి గాయత్రి పంపుహౌజ్ ద్వారా ఏడు నీటిని వరద కాలువలోకి ఎత్తిపోసి మిడ్ మానేరు రిజర్వాయర్‌కు నీరు తరలిస్తారు. ఐదు పంపులు ఆన్ చేయడంతో మరో .36 టిఎంసి నీటిని ఎత్తిపోసుకోలేకపోయాం. శ్రీపాద ఎల్లంపల్లి నుంచి ఒక దశలో నాలుగున్నర లక్షల క్యూసెక్కుల నీరును కూడా గరిష్టంగా వదిలిపెట్టారు.

## పాఠశాలల్లోని బోధన, బోధనేతర సిబ్బందికి బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం అమలు

### ఉత్తర్వులు జారీ చేసిన పాఠశాల విద్య డైరెక్టర్

**హైదరాబాద్, జులై 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయా పాఠశాలల్లోని బోధన, బోధనేతర సిబ్బందికి కూడా అమలు చేయాలని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ప్రొసిడింగ్స్‌ను పాఠశాల విద్య డైరక్టర్ నవీన్ నికోలస్ జారీ చేశారు. ఇకపై తెలంగాణలో ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలతోపాటు బ్రేక్‌ఫాస్ట్, మధ్యా హ్న భోజనం అమలు జరుగుతున్న అన్ని రకాల యాజమాన్యాల్లోని బోధన, బోధనేతర సిబ్బందికి కూడా ఈ పథకం అమలు జరపనున్నట్టు ప్రొసీ డింగ్స్‌లో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని ప్రకటించారు. ఉత్తర్వులను రాష్ట్రంలోని ఆర్‌జేడీలు, డీఈవోలు, ఎంఈవోలు, హెడ్మాస్టర్లు ఈ ఉత్తర్వు 0లను అమలు చేయాలని పేర్కొంటూ ప్రొసీడింగ్స్ జారీ చేశారు.

## మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతికి మహేష్‌కుమార్‌గౌడ్, చామల సంతాపం

**హైదరాబాద్, జులై 31,ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణం తనను తీవ్రంగా కలిచివేసిందని టిపిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ దిగ్భ్రాంతిని వ్యక్తంచేశారు. .ప్రజల కోసం తెలంగాణ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించిన నాయకుడి మరణం ఈ సమాజానికి తీరని లోటని ఆవేదన చెందరాఉ ఆయన కుటుంబసభ్యులకు ఈ విషాద సమయంలో మనోధైర్యం కల్పించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని సంతాప సందేశంలో పేర్కొన్నారు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి ఆకస్మిక మరణించడం బాధకరమనీ ఆయన ఎంతో భవిష్యత్ ఉన్న నేత అర్థాంతరంగా తనువు చాలించడం నమ్మలేకపోతున్నానని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# బడి మానేసిన, ఫెయిలైన వారిని ఓపెన్ స్కూళ్లలో చేర్పించాలి



### తద్వారా టెన్త్, ఇంటర్ పూర్తి చేయించేలా చూడాలి

### విద్యా శాఖ కార్యదర్శి యోగితారాణా

**హైదరాబాద్, జులై 31, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా మధ్యలోనే బడిమానేసిన వారిని, ఫెయిలైన వారిని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టాస్) అధ్వర్యంలో కొనసాగే స్కూల్స్‌లో చేర్పించి వారిని టెన్త్, ఇంటర్ పూర్తి చేయించేలా చూడాలని విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా సూచించారు. ఓపెన్ స్కూలింగ్, వయోజన అక్షరాస్యత కార్యక్రమాలను బలోపేతం చేసేందుకు విద్యా శాఖ రాష్ట్ర స్థాయి సమన్వయ సమావేశాన్ని శుక్రవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో నిర్వహించింది. ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా నాయకత్వంలో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్), ఉల్లాస్ అడల్ట్ ఎడ్యుకేషన్, సమగ్ర శిక్ష, సెర్ప్, మెప్మా, ఎడ్యుకేట్ గర్ల్స్, ప్రథమ్ సంస్థల భాగస్వామ్యంతో రాష్ట్ర స్థాయి సమన్వయ సమావేశం జరిగింది. పాఠశాల విద్యను మధ్యలో మానేసిన వారిని, ఫెయిల్ అయిన అభ్యర్థులను గుర్తించి, వారిని టాస్‌లో చేర్పించి, ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసేలా ప్రోత్స హించడానికి అన్ని విభాగాల మధ్య సమన్వయం అవసరమని యోగితా రాణా అన్నారు. నిరక్షరాస్యులను గుర్తించి, ఉల్లాస్ కార్యక్రమం కింద వారిని నమోదు చేయాలని సూచించారు. టాస్, ఉల్లాస్ రెండింటికీ అర్హులైన అభ్యాసకులను గుర్తించి, సమీకరించడంలో సహాయపడాలని సెర్ప్ డైరక్టర్ దివ్య దేవరాజన్ కోరారు. వృత్తి విద్యా సిలబస్‌పై విద్యార్థులకు మార్గనిర్దేశం చేసేందుకు పాఠశాలల్లోని పార్ట్‌టైమ్ బోధకులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పాఠశాల విద్య డైరక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. ఆన్‌లైన్ ప్రవేశ ప్రక్రియను సరళీకరించాల్సి న అవసరాన్ని నొక్కి చెప్పారు. ఉల్లాస్ కోసం నిరక్షరాస్యులను సమీకరించడంలో సెర్ప్ సహకారాన్ని ఎ. శ్రీనివాస్ రెడ్డి కోరారు. గత సంవత్సరం నమోదు వివరాలను, చేపట్టిన వివిధ కార్యక్రమాలను పాఠశాల విద్య అడిషనల్ డైరక్టర్ పి.వి. శ్రీహరి వివరించారు. టాస్ నమోదు ప్రక్రియను, ప్రస్తుత ప్రతిపాదిత అభ్యాస-పాల్గొనే కార్యక్రమాలను టాస్ డైరక్టర్ కె. లింగయ్య వివరించారు. విద్యా శాఖతో కలిసి పనిచేస్తున్న ఎడ్యుకేట్ గర్ల్స్, సెర్ప్‌తో కలిసి పనిచేస్తున్న ప్రథమ్ సంస్థలు, అభ్యాసకుల సమీకరణకు మద్దతు ఇవ్వడానికి, టాస్‌లో నమోదును బలోపేతం చేయడానికి తమ నిబద్ధతను వ్యక్తం చేశాయి. ఈ సమావేశంలో టాస్ జాయింట్ డైరక్టర్ పి. రాజీవ్, ఎడ్యుకేట్ గర్ల్స్ ప్రభుత్వ భాగస్వామ్యాల అధిపతి అల్కా సింగ్, ఎడ్యుకేట్ గర్ల్స్ నుండి గీతా వంగలూరి, ప్రథమ్ డైరక్టర్ సునీత పాల్గొన్నారు.


# సనత్‌నగర్ టిమ్స్‌కు డాక్టర్ మర్రి చెన్నారెడ్డి పేరు

### టిమ్స్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా డాక్టర్ నరేంద్రకుమార్

### డిఎంఇగా డాక్టర్ ఎన్.వాణి

### జిఒలు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్, జులై 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వైద్య విద్య, సూపర్ స్పెషా లిటీ వైద్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. సనత్‌నగర్‌లో ఏర్పాటు చేస్తున్న తెలంగాణ ఇన్‌స్టి ట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి పేరును ఖరారు చేసింది. ఈ సంస్థకు ఇన్‌చార్జి డైరెక్టర్‌గా నిన్నటి వరకు మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్(డీఎంఈ)గా ఉన్న డాక్టర్ నరేంద్ర కుమార్‌ను నియమించింది. నూతన డీఎంఈగా డాక్టర్ వాణిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మూడు నిర్ణయాలకు సంబంధించి ప్రభుత్వం వేర్వేరుగా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ప్రాంత అభివృద్ధికి విశేష కృషి చేసిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి సేవలకు గుర్తింపుగా సనత్‌నగర్ టిమ్స్‌కు ఆయన పేరు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇకపై ఈ హాస్పిటల్‌ను డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌గా వ్యవహరించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో ఎంఎస్ నం.63ను జారీ చేసింది. నిన్నటి వరకు డీఎంఈగా కొనసాగి నేడు పదవీ విరమణ చేయనున్న డాక్టర్ ఎ నరేంద్ర కుమార్‌ను, ఆయన సుదీర్ఘ పరిపాలనా అనుభవాన్ని సనత్‌నగర్ టిమ్స్‌కు వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆయనను డాక్టర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా నియమిస్తూ జీవో ఎంఎస్ నం.64 జారీ చేసింది. ఆగస్టు 1 నుంచి ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న అడిషనల్ డీఎంఈ డాక్టర్ ఎన్.వాణిని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ)గా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జీవో ఆర్‌టీ నం.318ని జారీ చేసింది. డాక్టర్ వాణికి గతంలోనూ డీఎంఈగా కొంతకాలం పనిచేసిన అనుభవం ఉంది. జాతీయ నాయకుడు తెలంగాణ అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా పేర్కొన్నారు. ఒక వైద్యునిగా, రాజకీయ నాయకునిగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా ఆయన జీవితాంతం ప్రజల కోసం పనిచేశారని మంత్రి కొనియాడారు. సనత్‌నగర్ ఎమ్మెల్యేగా ఆయన పనిచేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి పేరును సనత్‌నగర్ టిమ్స్‌కు పెట్టుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆయన స్ఫూర్తితో సనత్‌నగర్ టిమ్స్‌లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల అభివృద్ధికి, వైద్య విద్యలో నాణ్యత పెంచేందుకు డీఎంఈగా డాక్టర్ నరేంద్ర కుమార్ చేసిన సేవలను అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. ఆయనకున్న సుదీర్ఘ అనుభవాన్ని సనత్‌నగర్ టిమ్స్ నిర్మాణాత్మక దశలో ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో ఇన్‌చార్జి డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగించామని మంత్రి వెల్లడించారు.



బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పించిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీమంత్రి హరీశ్‌రావు తదితరులు

# ఉద్యమ నేత సుదర్శన్‌రెడ్డికి కన్నీటి వీడ్కోలు

### జన సముద్రమైన నల్లబెల్లి.. కంటతడిపెట్టిన హరీశ్‌రావు

### పార్టీలకు అతీతంగా అంతిమయాత్రకు నాయకుల హాజరు

**ఉమ్మడి వరంగల్‌బ్యూరో/నర్సంపేట, జులై 31, ప్రభాతవార్త :** మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రకు ఒరుగల్లు కదిలింది. ఆయన అభిమానులు, ఉద్యమ కారులు, ప్రజలు పెద్దఎత్తున కదిలివచ్చారు. పెద్ది కడసారి చూపు చూసి కన్నీటిపర్వతం అయ్యారు. రాజకీయ పార్టీల నేతలతోపాటు బీఆర్ఎస్ పార్టీ నేతలు పెద్దఎత్తున తరలివచ్చి అంతిమయాత్రలో పాల్గొన్నారు. నర్సం పేట నియోజకవర్గం గిర్నిబావి నుంచి ఉదయం 9 గంటలకు మొదలైన అం తిమయాత్ర సాయంత్రం 7 గంటల వరకు కొనసాగింది. అంతిమయాత్రలో బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావులతోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లు, మాజీమంత్రులు పాల్గొన్నారు. ఆయనతో కలిసి పనిచేసిన నేతలు కన్నీటి పర్వతం అయ్యారు. తెలంగాణ ఉద్య మనేత నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రలో వేలాది మంది పాల్గొన్నారు. అంతిమయాత్ర కొనసాగిన రోడ్డు వెంట గ్రామాల నుంచి భారీగా తరలివచ్చారు. మహిళలు, యువతతో పాటు ఉద్యమకారులు పెద్దఎత్తున తరలిరావడంతో పాటు కన్నీటి వీడ్కోలు ఇచ్చారు. తెలంగాణ ఉద్యమం మొదలైన నుంచి రాష్ట్రం ఏర్పడే వరకు ఆయన అలుపెరగని పోరాటం చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజల మధ్యనే ఉంటూ సమస్యలపై వారికి అండగా నిలిచారు. నర్సంపేట ఎమ్మెల్యేగా ఒకదఫా పనిచేసిన ఆయన నిత్యం నియోజకవర్గంతో పాటు ఉమ్మడిజిల్లా నుంచి వచ్చే నేతలకు అండగా ఉన్నారు. కలిసికట్టుగా వారితో పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పడిన 2001వ సంవత్సరంలో టీఆర్ఎస్‌లో చేరిన ఆయన కేసీఆర్‌కు నమ్మ కమైన అనుచరుడిగా పనిచేశారు. పూర్తిస్థాయిలో ఆయనకు అండగా నిలిచారు. అనారోగ్యం తో ఆయన గురువారం అర్ధరాత్రి యశోద ఆసుపత్రిలో మృతి చెందారు. ఈ మరణ వార్త తెలియగానే ఒరుగల్లు వాసులు కన్నీరు మున్నీరు అయ్యారు. హన్మకొం డలోని తెలం గాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన అనంతరంనర్సం పేట నియోజకవర్గానికి తీసుకువెళ్లారు. నర్సంపేట పరిధిలోని నల్లబెల్లి ఆయన స్వగ్రామం కావ డంతో అంత్యక్రియలను అక్కడే నిర్వహించారు. తెలం గాణ ఉద్యమం నుంచి కీలకంగా పనిచేసిన నేత కావడం తో ఆయన అంతిమయాత్రలో వేలాది మంది తరలివచ్చి పాల్గొన్నారు. ఎక్కడా ఎటుచూసిన జనమే కని పించారు. దుగ్గొండి మండలం గిర్నిబావి వద్ద మొదలైన అంతిమ యాత్ర నర్సంపేట మీదుగా నల్లబెల్లి వరకు కొనసాగింది. దారి వెంట వేలాదిమంది తరలివచ్చి ఆయనకు నివాళు లర్పించారు. ఆయనతో గడిపిన రోజులను నెమరు వేసుకు న్నారు. నియోజక వర్గంలో అందరికీ అండగా ఉండే నేత కావడంతో కన్నీరు పెట్టుకున్నారు. మహిళల నుంచి వృద్ధుల వరకు పెద్ది కడసారి చూపు కోసం తరలివచ్చా రు. ఉమ్మ డి జిల్లా నుం చే కాకుం డా ఇతర జిల్లాలకు చెందిన నేతలు భారీగా తరలివచ్చి అం తిమయాత్రలో పాల్గొన్నారు.

**జనసంద్రమైన నర్సంపేట**

పెద్ది సుదర్శన్‌రెడ్డి అంతిమయాత్ర సందర్భంగా నర్సంపేట జనసం ద్రంగా మారింది. నియోజకవర్గం లోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి భారీగా తరలిరావడంతో వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. గిర్నిబావి నుంచి ప్రధాన రహదారి వెంట ఎటుచూసినా జనమే ఉన్నారు. అంతిమయాత్రలో పాల్గొనడంతోపాటు ఉద్యమంలో పనిచేసిన సుదర్శన్‌రెడ్డితో ఉన్న అనుబంధాలను గుర్తు చేసుకున్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి అంతిమయాత్రకు పార్టీ నేతలంతా కదిలి వచ్చారు. హైదరాబాద్ కోర్టులో ఫార్ములా కేసులో అటెండ్ అయిన కెటిఆర్ వెంటనే నల్లబెల్లికి సాయంత్రం చేరుకొని అంతిమయాత్రలో పాల్గొన్నారు. పార్టీ కీలక నేత శాసనసభ ఉపనేత హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, గంగుల కమలాకర్, కౌశి క్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ప్రభా కర్‌రెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, టి.రాజయ్య, రెడ్యానాయక్, కొప్పుల ఈశ్వర్, మాజీఎమ్మెల్యేలు విన య్ భాస్కర్, ఆరూరి రమేష్, మాజీ ఎం పీ కవిత, మా జీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, శ్రవణ్, పోచంపెల్లి శ్రీనివాస్‌రెడ్డితోపాటు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## ఇహెచ్‌ఎస్‌లో ఉద్యోగులకు అత్యుత్తమ వైద్యసేవలు అందేలా నిరంతర మార్పులు

### ప్యాకేజీ రేట్లపై సమగ్ర సమీక్ష

### బోర్డు మీటింగ్‌లో సిఎస్ సంజయ్‌జాజు

**హైదరాబాద్, జూలై 31,ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా తెలంగాణ ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్ (ఇహెచ్‌టీ) కార్యకలాపాలను మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. హెల్త్ కేర్ ట్రస్ట్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకునేలా కమిటీ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జరిగిన ట్రస్ట్ సమావేశంలో ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలు, ఆసుపత్రుల్లో అందుతున్న సేవలు, చికిత్స ప్యాకేజీ రేట్లు, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ప్రస్తుతం అమలులో ఉన్న చికిత్స ప్యాకేజీ రేట్లను సమగ్రంగా పరిశీలించి, ఉద్యోగులకు అత్యుత్తమ వైద్య సేవలు అందేలా పథకాన్ని నిరంతరం సమీక్షిస్తూ అవసరమైన మార్పులు చేపట్టాలని సీఎస్ సూచించారు. ట్రస్ట్ కార్యకలాపాల నిర్వహణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎగ్జిక్యూటివ్ కమిటీతోపాటు అవసరమైన సబ్ కమిటీలను ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కమిటీలు ప్యాకేజీ రేట్లు, ఆసుపత్రుల ఎంపిక, సేవల నాణ్యత, ఆర్థిక నిర్వహణ వంటి అంశాలను క్రమం తప్పకుండా సమీక్షించి ట్రస్ట్‌కు సూచనలు అందజేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో చికిత్స అవసరమైన ఉద్యోగులు, పెన్షనర్లకు ఎలాంటి ఆలస్యం లేకుండా తక్షణ వైద్య సహాయం అందేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం 24 గంటల సహాయ వ్యవస్థ, వేగవంతమైన అనుమతి ప్రక్రియ, సంబంధిత ఆసుపత్రులతో సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. ఉద్యోగులు ఆరోగ్య పథకం ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన వైద్య సేవలు పొందేలా ట్రస్ట్ పారదర్శకంగా సమర్థవంతంగా పని చేయాలని ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ సిఎస్ మహేశ్ దత్ ఎక్కా, ముఖ్య కార్యదర్శులు సందీప్‌కుమార్ సుల్తానియా, యోగితారాణా, క్రిస్టినా చొంగ్తూ, శిఖాగోయల్,హెల్త్‌కేర్ ట్రస్ట్ సిఇఒ జెండగే హనుమంత్ కొండిబా, కార్యదర్శులు శ్రుతిఓజా, దివ్య, సిక్తా పట్నాయక్, టిఎన్‌జీవో సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, టీజీవో సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, తెలంగాణ సెక్రెటేరియేట్ అసోసియేషన్ అధ్యక్షులు జి.శ్రీనివాసరెడ్డి, తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు లచ్చిరెడ్డి, పీఆర్‌టీయూ టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పుల్గం దామోదర్ రెడ్డి, టిఎస్ యూటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి, ఎస్‌టియుటిఎస్ అధ్యక్షులు సదానందగౌడ్, తెలంగాణ రెవెన్యూ అసోసి యే షన్ అధ్యక్షులు వంగా రవీందర్‌రెడ్డి, తెలంగాణ రిటైర్డ్ అధికారుల సంఘం మహిళా అధ్యక్షురాలు ఉమాదేవి, ఎస్‌టిఎఫ్ అధ్యక్షుడు డి.సైదులు పాల్గొన్నారు.


## మంత్రి వాకిటి శ్రీహరి, సిఎస్ సంజయ్‌జాజులకు ఎల్‌నినో నిపుణుల కమిటీ నివేదిక

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై31:** రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంపై సమగ్రంగా విశ్లేషించి రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక రిపోర్ట్‌ను నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణ, హార్టికల్చర్ కమిషనర్ యాస్మిన్ బాషాలకు అందజేశారు. ఈ సందర్భంగా నిపుణుల కమిటీ నివేదికలోని అంశాలను చిన్నారెడ్డి వారికి వివరించారు. ఈ నివేదికలో చేసిన సిఫార్సులను ఆయా శాఖల వారీగా పగడ్బందీగా అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని వారిని చిన్నారెడ్డి కోరారు. నిపుణుల కమిటీ రూపొందించిన రిపోర్ట్‌ను గురువారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి చిన్నారెడ్డి అందజేసిన విషయం తెలిసిందే.

## చట్టసభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

### రాజ్యసభలో ఎంపి ఆర్.కృష్ణయ్య డిమాండ్

**హైదరాబాద్, జులై 31, ప్రభాతవార్త :** చట్టసభల్లో వెనుకబడిన తరగతులకు (ఓబీసీ) తగిన ప్రాతినిధ్యం కల్పించేందుకుగానూ చట్టసభలు, పార్లమెంట్‌లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తూ తక్షణమే బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రాజ్యసభలో ఆయన బీసీల రాజకీయ ప్రాతినిధ్యం, ఎదుర్కొంటున్న అసమానతలపై సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ... దేశంలో విద్యా, ఉద్యోగ రంగాల్లో 27 శాతం రిజర్వేషన్లు, పంచాయతీరాజ్ సంస్థల్లో రాజకీయ రిజర్వేషన్లు అమలులో ఉన్నప్పటికీ, శాసనసభలు మరియు పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు పురోగతించకపోవడం తీవ్ర వివక్షకు, అన్యాయానికి గురిచేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ రిజర్వేషన్లు ఉన్నాయని, చట్టసభల్లో మహిళలకు ప్రత్యేక బిల్లు తెచ్చిన కేంద్రం.. దేశంలో మెజారిటీ వర్గమైన బీసీలను మాత్రం విస్మరిస్తోందని పేర్కొన్నారు.




ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఎం.వి.రమణ, వెంకటేశ్వర్లు, వెంకట నర్సయ్య తదితరులు

## గీత కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలుచేయాలి

### రేపటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'గీతన్నల చైతన్యయాత్ర'

### కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.రమణ

**హైదరాబాద్, జులై 31,ప్రభాతవార్త:** కల్లుగీత కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల2 నుండి 18 వరకు అమరుల యాధిలో "గీతన్నల చైతన్య బస్సు యాత్ర "రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి. రమణ అన్నారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు వి.వెంకట నరసయ్య, యం. కృష్ణస్వామిగౌడ్, సురుగు రాజేష్ గౌడ్‌లతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఆగస్టు 2న మహబూబాబాద్‌లో యాత్ర ప్రారంభమై అన్ని జిల్లాలు తిరుగుతూ 18వ తేదీన హైదరాబాదులోని ట్యాంక్ బండ్ వద్ద ముగిస్తామన్నారు. పెన్షన్ 4 వేలకు పెంచుతామని, ఎక్స్‌గ్రేషియా 10 లక్షలు ఇస్తామని అవి కూడా నెల రోజుల లోపే ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో చెప్పారు. కానీ ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదని రమణ అన్నారు. వృత్తిలో ప్రమాదాలు జరిగిన వారికి ఇవ్వాల్సి న ఎక్స్‌గ్రేషియా 20 కోట్ల రూపాయలు అధికారంలోకి వచ్చి 30 నెలలు దాటినప్పటికీ ఇవ్వలేదని 50 సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్ ఇవ్వాలని జీవో ఉన్నప్పటికీ కొత్తగా ఎవరి దరఖాస్తులు స్వీకరించడం లేదన్నారు. ఏజెన్సీ ఏరియాలోని సొసైటీలను పునరుద్ధరించి వారికి సంక్షేమ పథకాలు వర్తింపచేయాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వృత్తిలో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం కాటమయ్య రక్షణ కవచం ఇస్తుందన్నారు.

## కళ్లల్లో కారంకొట్టి ఆర్ఎంపి దారుణహత్య

### భూతగాదాలే కారణమా?

**నాగర్‌కర్నూల్ (పెంట్లవెల్లి), జులై 31, ప్రభాతవార్త :** కళ్లల్లో కారం కొట్టి ఓ ఆర్ఎంపిని గొంతుకోసి దారుణంగా హత్య చేసిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. కర్నూలుకు చెందిన డాక్టర్ మల్లయ్య (54) వృత్తిరీత్యా ఆర్ఎంపి వైద్యం చేస్తూ, రెండు దశాబ్దాల కిందటే పెంట్లవెల్లిలో స్థిరపడ్డారు. ఇదిలా ఉండగా శుక్రవారం రాత్రి మల్లయ్య క్లినిక్ లో వైద్య సేవలు అందిస్తుండగా అనారోగ్యంతో నలుగురు క్లినిక్ లోకి చేరారు. అందులో ఒక ఇద్దరు మహిళలు ముందుగా తమతో తీసుకువచ్చిన కారంపొడిని ఆర్.ఎం.పి కళ్లల్లో కారంకొట్టి బయటికి లాగారు. అందరూ చూస్తుండగానే గొంతుపై మెడపై మరో ఇద్దరు వ్యక్తులు విచక్షణ రైతంగా పొడిచారు. దీంతో ఆర్ఎంపి వైద్యుడు అక్కడికక్కడే రక్తపు మడుగులో పడి ఉన్నాడు. వేట కొడవలతో దాడి చేయడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. భూ తగాదాల వల్లే హత్య జరిగినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను త్వరగా బదలీ చేయండి : హైకోర్టు

**హైదరాబాద్, జులై 31,ప్రభాతవార్త:** హైడ్రా– శాంతా శ్రీరాం కన్స్‌స్ట్రక్షన్ కం పెనీ కేసులో తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు వెలువడ్డాయి. లోతుకుంట భూముల వ్యవహారంలో ఇటీవల ఉన్నత న్యాయస్థానం విచారణ జరిపింది. కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తప్పించాలని సీఎస్‌ను హైకోర్టు కోరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దానికి సంబంధించిన ఉత్తర్వులు శుక్రవారం వెలువడ్డాయి. హైడ్రా కమిషనర్ కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారన్నది సుస్పష్టమని హైకోర్టు అందులో పేర్కొంది. వివాదాస్పద ఆస్తిలోకి యంత్రాలు, సిబ్బందితో వెళ్లడం చట్టవిరుద్ధమని తెలిపింది. రంగనాథ్‌ను వీలైనంత త్వరగా బదలీ చేయాలని.. ఆయన స్థానంలో మరొకరిని నియమించాలని సీఎస్‌కు సూచించింది. టాటా మోహన్‌రావు కేసులో సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఈ సందర్భంగా ఉదహరించింది. చట్టపాలన మాత్రమే కొనసాగాలని.. వ్యక్తుల ఆధిపత్యం పెరిగితే ప్రజాస్వామ్యానికి మరణ శాసనం అవుతుందని పేర్కొంది.

## విద్యుత్ ఖర్చు లేకుండా గ్రావిటీ ద్వారా ఎల్లంపల్లి నుంచి నీటి తరలింపు

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్,జులై31,ప్రభాతవార్త:** విద్యుత్ ఖర్చులేకుండా గ్రావిటిద్వారా ఎల్లంపల్లి నుంచి నీటిని తరలిస్తున్నామని కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి మోటార్లు ఆన్ చేయాలని బిఆర్ఎస్ నాయకులు అంతా హంగామా చేశారనీ రాష్ట్ర సం



క్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సిఎల్‌పిలో శుక్రవారం విలేఖరులో మాట్లా డుతూ భారీ వర్షాలకు శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్ నిండిడంతో మిడ్ మానేరు, లోయర్ మానేరు తో పాటు ఇతర రిజర్వాయర్లకు నీళ్ల విడుదల చేయబోతున్నామనీ తెలిపారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఎల్లంపల్లి ప్రాజెక్టును ప్రారంభించుకున్నామనీ గ్రావిటీ ద్వారా వరద నీటి తీసుకువచ్చేలా కాంగ్రెస్ ప్రభుత్వాలు డిజైన్ చేశాయనీ గుర్తుచేశారు. కెసిఆర్ మాత్రం రివర్స్ పంపింగ్ పేరుతో లిఫ్ట్ లు ఏర్పాటు చేశారునీ దీని కోసం భారీ విద్యుత్ ఖర్చు ఉంటుందనీ ఆరోపించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు ఇప్పుడు వరద జలాలతో నిండిందనీ దీనికి కెటిఆర్ సమాధానం చెప్పాలనీ కోరారు. ప్రధాన ప్రతిపక్షం రాష్ట్రంలో కరువును కోరుకుంటున్నారనీ బిఆర్ఎస్ నేతలు దురాలోచన లో ఉన్నారనీ విమర్శించారు. హరీష్ రావు ఇంజనీర్ అవతారం ఎత్తి పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నాడనీ ఆగ్రహం వ్యక్తంచేశారు. నెల రోజులు సమయం ఇస్తే నీళ్ల ఎత్తిపోస్తానని హరీష్ రావు పొంకనాలు కొట్టాడనీ ఇప్పుడు ఏ ఎత్తిపోతలు లేకుండానే ఎల్లంపల్లికి నీళ్ల వచ్చాయనీ హరీశ్‌రావు దీనికి సమాధానం చెప్పాలనీ చెప్పారు.

## పత్తి, మక్కలకు పెరిగిన ధరలు

### క్వింటాలు రూ.9,350 పలికిన రేటు

**హైదరాబాద్, జులై 31, ప్రభాతవార్త:** ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటల సాగు తగ్గడంతో అంతర్జాతీయంగా వివిధ ఉత్పత్తులకు మంచి రేట్లు పలుకుతున్నాయి. దేశీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ పెరగడం, ధరలు సాగు విస్తీర్ణం తగ్గడం, ఉత్పత్తిలో వ్యత్యాసాల కారణంగా మార్కెట్‌కు సరుకు తక్కువగా రావడంతో పత్తి, మొక్కజొన్నను వ్యాపారులు అధిక రేట్లకు కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వరంగల్ వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం పత్తికి క్వింటాకు రూ.9,350లు పలుకగా మక్కలకు క్వింటాకు రూ.2,550లు పలికింది. గత కొద్ది రోజులుగా పత్తికి ధరలు పెరుగుతూ వచ్చాయి. అయితే రైతులు ఇప్పటివరకు తమ వద్ద ఉన్న పత్తి, మక్కలను 99 శాతం అమ్ముకున్నారు.

## వ్యవసాయ కోర్సుల ప్రవేశగడువు పెంపు

### వ్యవసాయ్యూనివర్సిటీ వైస్-ఛాన్సలర్ జానయ్య

**హైదరాబాద్, జులై 31, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం బిఎస్సి (ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సుకు దరఖాస్తుల గడువును ఆగస్టు 13 వరకు పొడిగించింది. అంతేకాకుండా అదనంగా 360 సీట్లను అందిస్తోంది. ప్రస్తుత 2026–27 విద్యా సంవత్సరానికి గాను బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్, ఇతర డిగ్రీ కోర్సులలో ప్రవేశాల కోసం దరఖాస్తుల గడువును ఆగస్టు 13 వరకు పొడిగించినట్లు వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆల్దాస్ జానయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఈఏపీసీఈటీ–2026లో అర్హత సాధించిన అభ్యర్థులు అధికారిక విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని సూచిస్తూ, ఈ ఏడాది బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్‌లో 360 అదనపు సీట్లు అందుబాటులో ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి కోడంగల్, హుజూర్‌నగర్, డిచ్‌పల్లిలలో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రతి అనుబంధ కళాశాలలో 120 సీట్లను భర్తీ చేయనున్నట్లు ఆల్దాస్ జనయ్య వివరించారు.

## ఇంజనీరింగ్ విద్యార్థులను అవమానించిన సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్

**హైదరాబాద్, జులై 31, ప్రభాతవార్త:** ఇంజనీరింగ్ విద్యార్థులను అవమానించిన ముఖ్యమంనరతి రేవంత్ రెడ్డి వెంటనే తన మాటలు వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. జెన్ జీ కి గౌరవం అంటూనే ఇంజనీరింగ్ విద్యార్థులను కించపరచడం ఏంటి? సంఘం రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ప్రశ్నించారు. గురువారం జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఇంజనీరింగ్ విద్యార్థులపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దేశ, రాష్ట్ర నిర్మాణంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థులను కించపరిచేలా సీఎం మాట్లాడటం అత్యంత హేయమన్నారు. వేదికలపై మాట్లాడేటప్పుడు "జెన్ జీ" యువతకు గౌరవం ఇవ్వాలని, వారి శక్తిసామర్థ్యాలను ఉపయోగించుకోవాలని చెబుతూనే... మరోవైపు ఇంజనీరింగ్ విద్యార్థులను 'క్రిమినల్ వేస్ట్' అంటూ సంబోధించడం రేవంత్ రెడ్డి ద్వంద్వ నీతికి నిదర్శనమన్నారు. విద్యాశాఖ బాధ్యతలను కూడా చూస్తున్న ముఖ్యమంత్రి, విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా ఇవ్వాల్సింది పోయి.. ఈ విధంగా అవమానకరంగా మాట్లాడటం ఏ మాత్రం సమంజసం కాదన్నారు. రాష్ట్రంలో ఉన్న ఇంజనీరింగ్ కళాశాలల పరిస్థితి అలా ఉండడానికి ప్రభుత్వమే కారణమని, ఉన్నత విద్యాశాఖా అధికారుల పర్యవేక్షణ వైఫల్యం, సరైన తనిఖీలు, కట్టుదిట్టమైన చర్యలు తీసుకోకపోవడంతో ఇలాంటి పరిస్థితి వచ్చిందన్నారు.

# పాస్‌పోర్టు నుంచి ఉద్యోగం వరకు టామ్‌కామ్‌దే బాధ్యత

### స్కిల్ వర్సిటీల్లో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలి

### ఎటిసిల్లో ఇవి సర్వీసులుసహా అత్యాధునిక కోర్సులకు ప్రాధాన్యం

### డిమాండ్‌కు తగినట్లు నర్సింగ్ కళాశాలల ఏర్పాటు:

### శక్తి శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జులై 31:** విదేశాల్లో ఉద్యోగాలకు అవసరమైన శిక్షణ, ఉద్యోగ మేళాలతో పాటు ఉద్యోగార్థులకు అవసరమైన పాస్‌పోర్టు, ఆయా దేశాల్లో వారికి ఉపాధి అవకాశాలు కల్పించే బాధ్యతను టామ్‌కాం తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. శక్తి శాఖపై ఆ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఉత్తర తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు మధ్య ప్రాచ్య దేశాలకు వెళుతుంటారని, ఈ క్రమంలో వారు ఏజెంట్ల చేతిలో మోసపోయి ఇబ్బందిపడుతున్నారని సీఎం తెలిపారు. ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లే వారికి పాస్‌పోర్టులు ఇప్పించడంతో పాటు వారు వెళ్లే దేశాల్లోని మ్యాన్ పవర్ కంపెనీలతో ఒప్పందాలను టామ్‌కాం చేసుకోవాలని సీఎం సూచించారు. విదేశీ కంపెనీలతో టామ్‌కాం ఒప్పందం చేసుకోవడం ద్వారా అక్కడకు వెళ్లిన వారికి ఏవైనా ఇబ్బందులు ఎదురైతే చర్చలు జరపడానికి, వారికి న్యాయం చేయడానికి వీలుంటుందని సీఎం అభిప్రాయపడ్డారు. కార్మికులను విదేశాలకు తరలించే ఏజెంట్ల వివరాలు సేకరించి, వారు పంపించే ప్రతి వ్యక్తి వివరాలు నమోదు చేయాలని సీఎం సూచించారు. ఈ వ్యవహారాల పర్యవేక్షణకు టామ్‌కాంకు మాజీ ఐఎఫ్ఎస్ అధికారిని సీఈవోగా నియమిస్తామని సీఎం తెలిపారు. ఉద్యోగార్థులకు లైట్ మోటార్ వెహికల్, హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లోనూ శిక్షణ ఇప్పించాలని సీఎం సూచించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో నూతన ఆవిష్కరణలకు అవసరమైన రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. జర్మనీ, జపనీస్, కొరియన్, చైనీస్, రష్యన్ తదితర భాషలు నేర్చుకునేందుకు వీలుగా స్కిల్ యూనివర్సిటీలో ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పాలన్నారు. విదేశీ భాషలు నేర్పేందుకు స్థానికంగా ఆ భాషలో పట్టున్న వారితో పాటు ఆయా దేశాలకు చెందిన శిక్షకులను రప్పించాలని సీఎం అన్నారు. యూనివర్సిటీ ప్రాంగణంలో రీలొకేటెడ్ చెట్లను నాటాలని సీఎం సూచించారు. ఉన్నత విద్యకు వెళ్లే విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు ఇచ్చినట్లే, బ్లూ కాలర్ జాబ్‌లకు శిక్షణ పొందేవారందరికీ స్కాలర్‌షిప్‌లు ఇచ్చే అంశంపై అధ్యయనం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలు, ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు పెద్ద కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఓ వైపు చదువుకుంటూనే, మరో వైపు ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా వారికి స్టైఫండ్ లభిస్తుందని, భవిష్యత్‌లో చేయబోయే ఉద్యోగానికి సంబంధించిన నైపుణ్యాలు నేర్చుకుంటారన్నారు. ఏటీ సీల్లో ఈవీ సర్వీసులకు సంబంధించిన కోర్సులు, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు ప్రవేశపెట్టాలని సీఎం సూచించారు. ఈవీల వాడకం విపరీతంగా పెరిగిన నేపథ్యం లో వాటి సర్వీసింగ్ చేయ గలిగిన వారు అవసరమ న్నారు.

వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం భారీగా పెరుగుతున్నందున డ్రోన్ టెక్నాలజీ కోర్సు ఉండాలని సీఎం సూచించారు. దేశీయంగానూ, విదేశాల్లోనూ నర్సుల సేవలకు భారీ డిమాండ్ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పలు అభివృద్ధి చెందిన దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతుండడంతో ఇంటికో నర్సు డిమాండ్ ఉందన్నారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా నర్సింగ్ కళాశాలలకు అనుమతులు ఇస్తున్నట్లు సీఎం తెలిపారు. సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, శక్తి కార్యదర్శి హరిచందన, ఉపాధి, శిక్షణ డైరెక్టర్ నిర్మలా కాంతి వెస్లీ, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్‌లో విఫలమైతే కఠినచర్యలు



### 85 వేల ఎకరాల లక్ష్యంలో 17 వేలకే పరిమితం

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అసంతృప్తి

**హైదరాబాద్, జులై 31, ప్రభాతవార్త:** ఆయిల్ పామ్ సాగు విస్తరణ కార్యక్రమంలో నిర్లక్ష్యం, అలసత్వం వహించి లక్ష్యాలను చేరుకోకుంటే సంబంధిత కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆయిల్ పామ్ కంపెనీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఈ ఏడాది రాష్ట్రంలో 85 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా కాగా, ఇప్పటివరకు కేవలం 20 శాతం మాత్రమే 17,090 ఎకరాల్లో మాత్రమే సాగు నమోదుకావడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. కంపెనీలు ఆశించిన స్థాయిలో చిత్తశుద్ధి కనిపించడం లేదన్నారు. పామాయిల్ విస్తరణను ప్రాధాన్యంగా తీసుకోవాలని స్పష్టం చేసినప్పటికీ కంపెనీల పనితీరులో ఎలాంటి మార్పు కనిపించకపోవడం సరికాదని చెప్పారు. పనితీరు సరిగా లేని కంపెనీలకు ఇప్పటికే పలుమార్లు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

**డిఎపి కొరత లేకుండా తక్షణ సరఫరా చేయాలి**
**కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ**

రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌లో డీఏపీ ఎరువుల కొరత తలెత్తకుండా సరఫరాకు తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జెపి నడ్డాకు లేఖ రాశారు. ప్రస్తుతం వరి నాట్లు వేగంగా సాగుతున్నాయని, లక్ష్య విస్తీర్ణంలో దాదాపు 50 శాతం నాట్లు పూర్తయ్యాయన్నారు. మిగిలిన నాట్లు ఆగస్టు నెలలో పూర్తయ్యే అవకాశం ఉన్నందున డీఏపీ అవసరం గణనీయంగా పెరుగుతుందని వివరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆగస్టు నెలకు 50 వేల టన్నులు, సెప్టెంబర్‌లో మరో 50 వేల టన్నుల డీఏపీని కేటాయించాలని లేఖలో విజ్ఞప్తి చేశారు.

## అయోధ్య విరాళాల దొంగతనంపై చినజీయర్‌స్వామి మాట్లాడాలి

### ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు

**హైదరాబాద్, జులై 31, ప్రభాతవార్త:** అయోధ్య గుడిలో విరాళాల దొంగ తనంపై చినజీయర్‌స్వామితోపాటు అందరూ మాట్లాడాలనీ వి. హనుమంతరావు కోరారు. గాంధీభవన్‌లో శుక్రవారం ప్రభుత్వ సలహాదారు విహెచ్ మాట్లాడుతూ అయోధ్య లో కోట్ల రూపాయల దోపిడీ జరుగుతుంటే ఒక్క స్వామి మాట్లాడడం లేదనీ ఆవేదన చెందారు. అయోధ్య విషయంలో స్వాములు అందరూ స్పందించాలనీ డిమాండ్ చేశారు. అక్కడ దొంగతనం చేసిన ప్రతి ఒక్కరిపైన చర్యలు తీసుకోవాలన్నారు. హిందు జపం చేస్తూ రాజకీయాలు చేస్తున్న బిజెపి అయోధ్య గుడిలో విరాళాల దొంగతనంపై ఎందుకు మాట్లాడడం లేదనీ ప్రశ్నించారు. సిజెపి నాయకులు అభిషేక్ ను బిజెపి నాయకులు బేసిరింపులు ఎంతవరకు సమంజసమనీ ఆగ్రహం వ్యక్తంచేశారు.

## ఇంజనీరింగ్ విద్యార్థులకు సిఎం రేవంత్‌రెడ్డి తక్షణమే క్షమాపణ చెప్పాలి

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు డిమాండ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై31:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులను 'క్రిమినల్స్, వేస్ట్' అని సంబోధిస్తూ చేసిన వ్యాఖ్యలను భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ప్రకటిం చారు. బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి పదవిలో ఉన్న రేవంత్ రెడ్డి వారిని ఈ విధంగా సంబోధించడం విద్యార్థులను, వారి కష్టాన్ని తీవ్రంగా అవమానించడమే అవుతుందన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన రేవంత్ రెడ్డి తక్షణమే రాష్ట్ర విద్యార్థి లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో కూడా రేవంత్ రెడ్డి ఫీజుల రీయింబర్స్‌మెంట్ విషయమై మాట్లాడుతూ, 'మేమెందుకు ఫీజులు ఇవ్వాలి? బకాయిలు మీరే కట్టుకోండి' అంటూ ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలను బహిరంగంగా బెదరించే విధంగా మాట్లాడారని పేర్కొన్నారు.

## భారీ వర్షాలతో నిలిచిపోయిన సింగరేణి కోల్‌బెల్ట్ ఏరియాలో బొగ్గు ఉత్పత్తి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై31:** ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో జనజీవనం స్థంభించిపోయింది. ఉత్తర తెలంగాణలో కుంభవృష్టి వల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఆదిలాబాద్ ఏజెన్సీలో 16 గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి. మందమర్రిలో వరద ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పర్యటించి, పరిస్థితిని సమీక్షి ంచారు. భారీ వర్షాలతో సింగరేణి కోల్‌బెల్ట్ ఏరియాలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. వరుణుడి కరుణతో వ్యవసాయ పనులను రైతులు ప్రారంభించారు.

## నిండు కుండల్లా నీటి ప్రాజెక్టులు

**శ్రీపాద ఎల్లంపల్లిలో ఎత్తిన 15 గేట్లను దించేశారు**
**జూరాల వద్ద 28 గేట్లు ఎత్తివేత**
**శ్రీశైలంకు 67,173 క్యూసెక్కుల వరదనీరు**

**హైదరాబాద్, జులై 31, ప్రభాతవార్త:** బంగాళా ఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురవడంతో గోదావరి కృష్ణ నదుల పరివాహక ప్రాంతంలో చిన్న, మధ్యతరహా, భారీ ప్రాజెక్టులు నిండు కుండలను తలపిస్తున్నాయి. ఉప్పెనై గోదావరి ఎగిసిపడటంతో ధవళేశ్వరం వద్ద 175 గేట్లు ఎత్తి సముద్రంలోకి నీటిని వదులుతుంటే శ్రీశైలంవరకు కృష్ణవేణి పరుగులు పెట్టి నాగార్జునసాగర్ వరకు పలుసటిపాయతో చేరుకొంటున్నది..... గోదావరి నది శ్రీరామాసాగర్ రిజర్వాయర్‌వరకు మంద గమనంతో ప్రవహిస్తున్నా... కడెం నుంచి ఉప్పెనై ఎగిసి పడుతోంది.. కాళేశ్వరం నుంచి ఉగ్రరూపం చూపుతోంది. తుపాకుల గూడెం వద్ద 12లక్షల క్యూసెక్కుల కిందికి వరదగాపోతుండటంతో భద్రాచలం వద్ద రెండో ప్రమాదహెచ్చరిక జారీచేశారు. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరామ సాగర్ ప్రాజెక్టులోకి 23.112 టిఎంసిలనీరు వచ్చిచేరింది. ఎగువనుంచి 60120క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి వచ్చిచేరుతోంది. కాకతీయ కెనాల్ నుంచి300 మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు మొత్తంగా 822 క్యూసెక్కులు బయటికి వదిలి పెడుతున్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు చెందిన 15 గేట్లు ఎత్తి కిందికి లక్ష క్యూసెక్కులనీరును కిందికి వదులుతున్నారు. పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు గరిష్టంగా 20.175 టిఎంసిలు నీటిని నిలిపివుంచే సామర్థ్యం కలిగి ఉంది. అందులో ప్రస్తుతం 18.45టిఎంసిల నీరు నిలిచి ఉంది. ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఒకలక్షా 21వేల 354 క్యూసెక్కులు వరదనీరు వచ్చిచేరుతుండగా బయటకు ఒకలక్షా ఎనిమిదివేల 493క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఎల్లంపల్లి నుంచి మధ్యమానేరు ప్రాజెక్టుకు నీటి తరలింపు వేగంగా చేస్తున్నారు. రామడగు మండలంలోని గాయత్రి పంపుహౌజ్ కు చెందిన ఐదుభారీ పంపులతో 16 వేల క్యూసెక్కులు ఎత్తిపోస్తున్నారు. గోదావరి వరద ప్రవాహం పెరగడంతో భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీచేశారు. శుక్రవారం ఉదయం కల్యాణకట్ట, స్నానఘట్టటాల వద్ద ఉదయం పది గంటలకు 43 అడుగులకు నీటి మట్టం చేరడంతో మొదటి ప్రమాదహెచ్చరిక జారీ చేశారు. సాయంత్రం రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేసి ముంపు ప్రాతాల ప్రజలను అప్రమత్తం చేశారు. రాజమండ్రి వద్ద దవళేశ్వరం బ్యారేజికి 11 అడుగులకు నీటి మట్టం రావడంతో 175గేట్లు ఎత్తి రెండులక్షల 25వేల క్యూసెక్కులు కిందికి వదలుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 67173 క్యూ సెక్కులు నాగార్జున సాగర్‌కు 5693 క్యూ సెక్కుల వరదనీరు ఎగువ నుంచి ప్రవాహం వస్తోంది. గోదావరి ఎగువన మందగమనంతో ఉంటే దిగువన ఉగ్రరూపంలో ప్రవహిస్తోంది. కృష్ణనది ఎగువన భీకరంగా ప్రవహిస్తే కిందికి వచ్చేవరకు వందల క్యూసెక్కుల నీటి ప్రవాహంతో పలచబారుతోన్నది.

## పారిశ్రామికవేత్తలు, రైతులకు సాధికారత కల్పనే లక్ష్యం

### వ్యవసాయ యాంత్రీకరణకు గ్రామీణ బ్యాంక్ ఊతం


### తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి

**హైదరాబాద్, జులై 31, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల్లోని పారిశ్రామికవేత్తలు, రైతులకు సాధికారత కల్పించే లక్ష్యంతో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ (టీజీబీ) పలు చర్యలు చేపట్టిందని బ్యాంక్ ఛైర్మన్ కె ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఇందుకు వారికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు సంబంధించి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ నిర్వహించిన మెగా రుణ మేళాలో వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి కింద సిద్దిపేట, మెదక్ జిల్లాల లబ్ధిదారులకు వ్యవసాయ యంత్రాలు, రుణాలను ఆ బ్యాంక్ ఛైర్మన్ పంపిణీ చేశారు. సుమారు 20 ట్రాక్టర్లు, నాలుగు హార్వెస్టర్లు, రెండు జేసీబీ యంత్రాలు, దాదాపు 50 పశుసంపద యూనిట్లు, మహిళా స్వయం సహాయక బృందాలకు రుణాలను మంజూరు చేసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి (ఏఐఎఫ్) పథకం కింద ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, ఇతర రుణాలను అందించినట్లు తెలిపారు. ఏఐఎఫ్, పీఎంకుసుమ్ సోలార్ వంటి బ్యాంకు ద్వారా అందించే ప్రభుత్వ పథకాలను రైతులు సమర్థవంతంగా వినియోగించుకోవాలని కోరారు. వాహనాలు, వ్యవసాయ యంత్రాల పంపిణీ అనేది వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించడం, వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం, కార్మికుల కొరతను పరిష్కరించడం, రైతుల ఆదాయాన్ని మెరుగుపరచడం వంటి లక్ష్యాలలో మరో ముఖ్యమైన ముందడుగు అని ఆయన అన్నారు. జేసీబీ యంత్రాలు గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి దోహదపడటమే కాకుండా, అదనపు స్వయం ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తాయన్నారు.

## ఒకే టికెట్‌పై మెట్రో, ఆర్టీసీ ప్రయాణం

### మెట్రో ప్రయాణికులకు రోజువారీ, నెలవారీ పాస్‌లు

### హెచ్ఎంఆర్ఎల్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సంజయ్‌జాజు ఆదేశాలు



హెచ్ఎంఆర్ఎల్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సంజయ్ జాజు, చిత్రంలో ఉన్నతాధికారులు జయేష్‌రంజన్, వికాస్‌రాజ్ తదితరులు

**హైదరాబాద్, జులై 31, ప్రభాతవార్త:** మెట్రో రైల్ ప్రయాణీకులు సురక్షితంగా సులభతరంగా, సౌకర్యవంతంగా తమ గమ్యస్థానాలకు చేరడానికి తగు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) బోర్డు అఫ్ డైరెక్టర్ల చైర్మన్‌గా సంజయ్ జాజు తొలి సారిగా మెట్రో రైల్ నిర్వహణ, అభివృద్ధిపై సమీక్షిం చారు. బోర్డు అఫ్ డైరెక్టర్ల సమావేశం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో జరిగింది.

మెట్రో, ఆర్టీసీ వంటి ప్రజా రవాణా వ్యవస్థలు అన్నిటిలోను ఒకే టికెట్‌పై ప్రయాణించే విధానాన్ని అమలు చేసేలా తగు ప్రణాళికను రూపొందించాలని ఆయన సూచించారు. ఉమ్మడి యాప్‌ని అభివృద్ధి చేసేలా టీజీఎస్‌ఆర్టీసీతో చర్చించాలని తెలిపారు. అలాగే మెట్రో ప్రయాణీకులకు రోజు వారీ, నెలవారీ పాస్‌లను ప్రవేశపెట్టడానికి తగు మార్గాలను అన్వేషించాలని ఆయన ఆదేశించారు. మెట్రో మొదటి దశ స్వాధీనం, రెండవ దశ అనుమతుల తాజా ప్రగతిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశంలో చర్చించారు. అదనపు బోగీలను వీలైనంత త్వరగా సమీకరించడానికి తగు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో బోర్డు అఫ్ డైరెక్టర్లు మెట్రోపాలిటన్ ఏరియా, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, రోడ్లు,రహదారులు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, డీజీపీ (శాంతి భద్రతలు) మహేష్ భగవత్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, హైదరాబాద్ మెట్రో పాలిటన్ వాటర్ వర్క్స్, సీవరేజ్ బోర్డు ఎండి కే.అశోక్ రెడ్డి, హెచ్ఎంఆర్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి.అజిత్‌రెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివేంద్ర ప్రతాప్ పాల్గొన్నారు.



తుమ్మిడి హెట్టి వద్ద ప్రాణహిత నది వరద పరిస్థితిని పరిశీలిస్తున్న కలెక్టర్

## ప్రాణహిత నదిపరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### పంటల ఎంపికలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి: జిల్లా కలెక్టర్ హరిత

**కౌటాల, ప్రభాతవార్త, జులై 31:** జిల్లాలో కురుస్తున్న వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె. హరిత సూచించారు. శుక్రవారం కౌటాల మండలం తుమ్మిడి హెట్టి వద్ద ప్రాణహిత నది వరద పరిస్థితిని ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించిన కలెక్టర్ నదిలో నీటి మట్టం, వరద ప్రవాహం, భద్రతా చర్యలు, భవిష్యత్ పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాణహిత నదిలో నీటి మట్టం 146.65 మీటర్ల ఎత్తులో కొనసాగుతోందని, దిగువకు 7.75 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వెళ్తోందని తెలిపారు. ఎగువ ప్రాంతాల నుంచి సుమారు 12 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు తదితర శాఖల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. జిల్లాలో ప్రస్తుతం ఎలాంటి ఆందోళనకర పరిస్థితులు లేవని, వరద ప్రవాహం మరింత పెరిగినప్పటికీ గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం లేదని స్పష్టం చేశారు. అయినప్పటికీ అధికారులు ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నది ఒడ్లు, చెక్‌డ్యాంలు, వాగులు, వంతెనల వద్దకు సరదాగా వెళ్లడం, సెల్ఫీలు దిగడం, ఈత కొట్టేందుకు ప్రయత్నించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రైతులు అప్రమత్తంగా ఉండాలిపంట సాగులో నాట్ల పరిస్థితిని రైతులు, వ్యవసాయ కూలీలను తెలుసుకున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో రైతులు, వ్యవసాయ కూలీలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# దోషులను కఠినంగా శిక్షిస్తాం

## మహిళా ఎస్ఐపై దాడిని ఖండించిన మంత్రి లోకేశ్

**విజయవాడ, జులై 31 ప్రభాతవార్త ప్రతినిధి:** మహిళా ఎస్ఐపై దాడి ఘటనను రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా ఖండించారు. 'ఎక్స్' వేదికగా ఆయన తీవ్రస్థాయిలో స్పందించారు. శ్రీకాకుళంలో విధుల్లో ఉన్న మహిళా ఎస్ఐపై వైఎస్సార్సీపీ నాయకులు ప్రవర్తించిన తీరు ఆక్షేపణీయమని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో మహిళల భద్రత, గౌరవంతో చెలగాటమాడితే అస్సలు సహించేది లేదని స్పష్టం చేశారు. మహిళలను అవమానించి రాక్షస ఆనందం పొందడం వైఎస్సార్సీపీ డీఎన్ఏలోనే ఉందని లోకేశ్ దుయ్యబట్టారు. సొంత తల్లిని, చెల్లిని ఇంటి నుంచి గెంటేసిన చరిత్ర జగన్ రెడ్డిది విమర్శించారు. సమాజంలో కనిపించిన ప్రతి మహిళను అవమానించడం వైఎస్సార్సీపీ నాయకులు సంస్కృతిగా మారిందని ధ్వజమెత్తారు. విధుల్లో ఉన్న మహిళా అధికారిపై దురుసుగా ప్రవర్తించిన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామని లోకేశ్ తేల్చి చెప్పారు. మహిళా అధికారుల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిని కూటమి ప్రభుత్వం ఎంతమాత్రం సహించబోదన్నారు. వైఎస్సార్సీపీ నేతల వ్యవహారశైలి సభ్య సమాజం తలదించుకునేలా ఉందని విమర్శించారు. అధికారం కోల్పోయినా ఆ పార్టీ నాయకుల్లో అహంకారం, రౌడీయిజం ఏమాత్రం తగ్గలేదని ఈ ఘటనతో మరోసారి రుజువైందని మండిపడ్డారు. నేరం చేసిన వారిని పరామర్శించడం వదిలి, నేరాలను నియంత్రించే పోలీసులపై దాడులకు పాల్పడటం విడ్డూరంగా ఉందన్నారు.

# ఎంబిబిఎస్, బిడిఎస్ ప్రవేశాల్లో మార్పులు

## ప్రతి దశలో వెబ్ ఆప్షన్లకు అవకాశం

**విజయవాడ, జులై 31 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సుల ప్రవేశ కౌన్సెలింగ్ విధానంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. ఇప్పటివరకు అమల్లో ఉన్న అన్ని సీట్లకూ కలిపి 'ఒకేసారి వెబ్ ఆప్షన్' ఇచ్చుకునే విధానాన్ని రద్దు చేసింది. ప్రతి దశకు ముందు కొత్త ఆప్షన్లు ఇచ్చుకునేలా నిబంధనలను సవరించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై అభ్యర్థులు ప్రతి కౌన్సెలింగ్ దశ ప్రారంభానికి ముందు తమకు నచ్చిన కళాశాలలను ఎంబిబిఎస్, బిడిఎస్ సీట్లకు కొత్తగా ఆప్షన్లు ఎంచుకోవచ్చు. స్లైడింగ్ విధానం ఎన్ఎంసి నిబంధనల ప్రకారం ఉంటుంది. ఒకవేళ అభ్యర్థికి కేటాయించిన కళాశాలలో సీటు పొంది చేరకపోతే.. వారు తర్వాత దశ కౌన్సెలింగ్లో అదే కళాశాలను మరోసారి ఎంచుకునేందుకు వీలుండదు. సవరించిన నిబంధనల ఆధారంగా కౌన్సెలింగ్కు సంబంధించిన సమగ్ర విధివిధానాల షెడ్యూలును త్వరలో ప్రకటిస్తామని పేర్కొంది.

# జాతీయ వాదానికి సంస్కృతమే ఊతం

- ఆగస్టు 25 నుండి సంస్కృత సప్తాహం వారోత్సవాలు
- తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ విల్సన్శరత్ చంద్ర

**విజయవాడ, జులై 31 ప్రభాతవార్త ప్రతినిధి:** సంస్కృతం పండితుల భాషగా ప్రజల్లో నానుడి ఉందని దాన్ని చెరిపి వేసి సామాన్యులకు సంస్కృత భాష చేర్చే కార్యాచరణ అకాడమీ చేపడుతుందని తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి. విల్సన్ శరత్ చంద్ర అన్నారు. పడ్డెర్లంలోని తెలుగు, సంస్కృత అకాడమీ కార్యాలయంలో శుక్రవారం అకాడమీ సిబ్బంది, సంస్కృత పండితులతో కలిసి పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో సంస్కృత అకాడమీ ఏర్పాటు తర్వాత ఏ ప్రభుత్వం కూడా నిధులు కేటాయించలేదని, సంస్కృత భాష వ్యాప్తికి నిధులు అవసరం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తగిన నిధులు కేటాయిస్తే తప్పా సంస్కృత భాషాభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. హైదరాబాద్లో ఉన్నట్లు ఆంధ్రప్రదేశ్లో వున్న సంస్కృత అకాడమీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ ఆగస్టు 3, 4, 5 తేదీల్లో ఢిల్లీలోని కేంద్ర సంస్కృత యూనివర్సిటీ వైస్ చాన్స్లర్ ప్రొఫెసర్ శ్రీనివాస్ వరకేదిని, భారతీయ భాష సమితి చైర్మన్ కృష్ణస్వామిని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర జోషిని సంప్రదిస్తున్నట్లు తెలియచేశారు. ఆంధ్రప్రదేశ్లో జరిగే సంస్కృత సప్తాహం కార్యక్రమ వివరాలను తెలియచేశారు.

# తిరుమల సమాచారం



## తిరుమలలో భారీగా పెరిగిన భక్తులు

- స్వామివారి దర్శనానికి 24గంటలు

**తిరుమల, జులై 31 ప్రభాతవార్త ప్రతినిధి:** సాధారణ రోజుల్లోనూ తిరుమలలో భక్తుల రద్దీ భారీగా కొనసాగుతోంది. గత వారం రోజుల నుండి తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ కనిపిస్తోంది. సామాన్య భక్తులు తిరుమలలో స్వామివారి దర్శనానికి 24గంటలపాటు నిరీక్షించాల్సిన అవసరం ఏర్పడింది. తిరుమలకు చేరుకున్న భక్తులకు నిజంగా క్యూలైన్లోనే దేవుడు కనిపిస్తున్నాడని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టోకెన్లలేని భక్తులను కృష్ణతేజ కాటేజీల వద్ద నుండి క్యూలైన్లలోనికి అనుమతిస్తున్నారు. కంపార్టుమెంట్లలోనికి చేరుకున్న భక్తులకు 16గంటలకు సమయం పడుతుండటంతో ఇబ్బందులను గురవుతున్నారు. స్వామివారిని దర్శించుకుంటే అంతా మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం. సర్వదర్శనం కోసం భక్తులు బారులు తీరారు. వైకుంఠం-2లో 32 కంపార్టుమెంట్లలో నిండిపోయి సర్వదర్శనానికి భక్తులు బాటగంగమ్మ ఆలయం వరకు రోడ్డుపై బారులు తీరారు. సర్వదర్శనానికి 24గంటలు సమయం పడుతోంది. తిరుమలలో వున్న భక్తులకు క్యూలైన్లలో అన్నపానీయాలు, టీ, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. సాయంత్రం వరకు 43వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నారు.

## సెప్టెంబర్ 15 నుండి శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు

**తిరుమల, జులై 31 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో పరవశింప చేయనున్నాయి. సెప్టెంబర్ 15 నుండి 23వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 12 నుండి 20 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 14వ తేదీ సాయంత్రం అంకురార్పణతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజూ ఉదయం 8 నుండి 10 గంటల వరకు ,సాయంత్రం 7 గంటల నుండి 9 గంటల వాహన సేవలు ఉంటాయి.

## తిరుమలలో భక్తురాలు మెడలో చైన్ స్నాచింగ్

**తిరుమల, జులై 31 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలకు కాలినడకన వచ్చే చంద్రగిరి శ్రీనివాస మంగాపురం శ్రీవారి మెట్లమార్గంలో ఓ యాత్రికురాలి మెడలో బంగారు గొలుసు దొంగతనం జరిగింది. సంఘటన జరిగిన వెంటనే బాధితురాలి ఫిర్యాదుతో తిరుమల పోలీసులు అప్రమత్తమయ్యారు. గంటల వ్యవధిలోనే నిందితున్ని అరెస్టు చేశారు. తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలైకు చెందిన సురేష్ కుమార్ ఈ చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. శ్రీవారి మెట్ల మార్గంలో నిందితుని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు.

## తిరుపతిలో అక్రమాలను అడ్డుకునే మేయర్ కావాలి

**తిరుపతి, జులై 31 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో భూకబ్జాలు, అక్రమ నిర్మాణాలు, రౌడీయిజం, డ్రగ్స్ మాఫియాను కఠినంగా అరికట్టేందుకు ధైర్యవంతమైన మేయర్ అవసరమని చైతన్య వేదిక కన్వీనర్ డాక్టర్ ఎన్.బి. సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి వంటి పవిత్ర నగరానికి అవినీతి ఆరోపణలు ఎంపికలోనే విషయంలో అన్ని రాజకీయ పార్టీలు ప్రజా సేవకు అంకితభావం, నిజాయితీ, నేరచరిత్ర లేని వ్యక్తిత్వం, పరిపాలనా సామర్థ్యం కలిగిన ప్రజా నాయకులకు టికెట్లు ఇవ్వాలని కోరారు.

# 750 విద్యుత్ బస్సులు వస్తున్నాయ్!

- ఆగస్ట్ 17 నుంచి దశల వారీగా ప్రవేశ పెడతాం
- 'స్త్రీ శక్తి' పథకం రద్దీ తట్టుకునేందుకు అదనంగా 500 సిఎన్జి బస్సులు కొనుగోలు
- ఆర్టిసి ఎండి బాలసుబ్రహ్మణ్యం
- విజయవాడలో జెఎసి నాయకులతో సమాశం



**విజయవాడ, జులై 31 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆర్టీసీలో విద్యుత్ బస్సులు ప్రవేశ పెట్టడం వల్ల వచ్చే సమస్యలు, ఇబ్బందులు అధిగమించేందుకు అన్ని విధాల ప్రయత్నిస్తామని ఆ సంస్థ ఎండి బాలసుబ్రహ్మణ్యం ప్రకటించారు. ఉద్యోగ సంఘాల జెఎసి ప్రతినిధులు లేవనెత్తిన అంశాలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని స్పష్టం చేశారు. ప్రస్తుతం మూసివేసిన డిపోల్లో నుంచి ఇతర డిపోల్లోకి సర్దుబాటు చేసిన సిబ్బందిని అవి తెరిచిన తర్వాత తిరిగి తీసుకొస్తామని ఎండి తెలిపారు. ఆర్టీసీ సిబ్బంది సహనం, ఓపికతో సేవలు అందిస్తుంటారని అలాంటి వారిపై దాడులు చేయడం ఏ మాత్రం సరికాదని దాడులు చేసే వారిపై కేసులు పెట్టాలని, ఛార్జిషీట్ దాఖలు చేయాలని డిజిపి, జిల్లా ఎస్పీల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అలాగే ఖాళీల భర్తీ అంశంపైనా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి రెండు వారాల్లో ప్రకటిస్తామని ఎండి చెప్పారు. విద్యుత్ బస్సుల కొనుగోలు, నిర్వహణ సహా వివిధ సమస్యలు పరిష్కరించాలంటూ ఆర్టీసీ ఉద్యోగులు రెండు నెలలుగా నిరసన కార్యక్రమాలు చేపట్టిన క్రమంలో ఆర్టీసీ యాజమాన్యం స్పందించింది. సంస్థ ఎండి బాలసుబ్రహ్మణ్యం విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో జెఎసి నాయకులతో సమావేశమయ్యారు. చర్చలు మూడున్నర గంటలసేపు సుదీర్ఘంగా సాగాయి.

సమావేశం తర్వాత ఎండి, జెఎసి ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. 90శాతం అంశాలపై సానుకూల స్పష్టత వచ్చిందని, విద్యుత్ బస్సుల కొనుగోలు, నిర్వహణకు సంబంధించిన ఇబ్బందులు, సమస్యలపై ముఖ్యమంత్రి, ఐటి, రవాణా మంత్రుల దృష్టికి తీసుకెళ్తామని ఎండి చెప్పారని జెఎసి ప్రతినిధులు తెలిపారు. విద్యాధరపురం, గుంటూరు-2, నెల్లూరు-2, మంగళం డిపోలలో వివిధ మరమ్మత్తు పనులు జరుగుతున్నాయని, పూర్తయిన తర్వాత విద్యుత్ బస్సులతోపాటు సాధారణ బస్సులు కూడా నడుపుతామని హామీ ఇచ్చారన్నారు. 750 విద్యుత్ బస్సులు ఆగస్ట్ 17 నుంచి ఈ ఏడాది చివరి నాటికి దశల వారీగా సంస్థలో ప్రవేశ పెడతామని, అలాగే స్త్రీ శక్తి పథకం రద్దీ తట్టుకునేందుకు అదనంగా 500 సిఎన్జి బస్సులు కూడా కొనుగోలు చేసే ప్రతిపాదన ఉందని సంస్థ ఎండి తెలిపారు.

ఆర్టీసీని ప్రైవేటీకరించవద్దని, అది ప్రభుత్వ పరిధిలోనే కొనసాగాలని, ఏ ఒక్క డ్రైవర్ని కానీ, కండక్టర్ని కానీ, ఇతర ఉద్యోగిని కానీ విధుల నుంచి తొలగించవద్దని, ఇతర డిపోలకు బదిలీ చేయవద్దని జెఎసి నాయకులు డిమాండ్ చేశారని ఎండి తెలిపారు. అన్ని అంశాలపై జరిపిన చర్చలు సఫలం అయ్యాయని జెఎసి నాయకులు అన్నారు.

# ఆగస్టు, సెప్టెంబరులో రైతులకు గడ్డుకాలమే

## భారత వాతావరణ శాఖ అంచనా

**విజయవాడ, జులై 31 ప్రభాతవార్త ప్రతినిధి:** రైతులు పంటలు వేసే వేళ భారత వాతావరణ శాఖ (ఐఎండి) శుక్రవారం తన నెలవారీ అంచనాలు వెల్లడించింది. వీటిని అనుసరించి ఆగస్టు, సెప్టెంబరులో ఎపిలో రైతులకు గడ్డుకాలమే కానున్నది. ఇక మలిదశ రుతుపవన వర్షాలు సాధారణంగా కంటే తక్కువగా కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అంటే ఆగస్టు, సెప్టెంబర్ వరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదువుతుందని అంచనా వేసింది. ఆగస్టు- సెప్టెంబర్ కాలంలో దేశవ్యాప్త వర్షపాతం దీర్ఘకాలిక సగటు (ఎల్పీఏ)లో 94 శాతం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉంది. ఒక నిర్దిష్ట ప్రాంతంలో ఒక నెల లేదా సీజన్లో నమోదైన వర్షపాతాన్ని, సాధారణంగా 30 నుంచి 50 సంవత్సరాల సుదీర్ఘ కాలానికి సగటుగా లెక్కించడాన్ని ఎల్పిఎ అంటారు. 1971 నుంచి 2020 వరకు చారిత్రక డేటా ప్రకారం, ఆగస్టు- సెప్టెంబరు కాలానికి దేశవ్యాప్త సగటు వర్షపాతం (ఎల్పిఎ) 422.8 మి.మీ.గా ఉంది.

**ప్రాంతాలవారీగా ప్రభావం ఎలా ఉంటుందంటే?:** వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ్ మహాపాత్ర మాట్లాడుతూ, 'ఆగస్టు- సెప్టెంబర్ కాలంలో దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు అవుతుంది. అయితే దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు, మధ్య, వాయువ్య భారతదేశంలోని ఉత్తర ప్రాంతాలు, తూర్పు, ఈశాన్య భారతదేశాల్లో మాత్రం సాధారణం నుంచి సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉంద్ని అని తెలిపారు.

**ఎపిలో విపత్తు నిర్వహణ వ్యవస్థలపై కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల సమీక్ష:** ఎపిఎస్డిఎంఎ కార్యాలయాన్ని ఎన్డిఎంఎ, ఎన్డిఆర్ఎఫ్ బృందం శుక్రవారం సందర్శించింది. విపత్తుల ముందస్తు సన్నద్ధత బలోపేతంపై కేంద్ర ప్రభుత్వ అధికారులు సమీక్షించారు. వడగాలులు, పిడుగుపాట్ల నివారణ కార్యాచరణపై అధికారులతో చర్చించారు.

ఎస్డిఆర్ఎఫ్ బెటాలియన్ల సామర్థ్య పెంపుపై కేంద్ర బృందం దృష్టి సారించినట్లు అధికారులు తెలిపారు. ఆధునిక పరికరాల సమీకరణ, అగ్నిమాపక సేవల విస్తరణపై సమీక్షించారు.

విపత్తు నిర్వహణ ప్రణాళికల నవీకరణపై ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ అధికారులు మాట్లాడారు. అలాగే, ఎన్డిఎంఐఎస్ పోర్టల్లో సమాచార నమోదు తీరును పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో ఐడిఆర్ఎన్ పోర్టల్ వినియోగంపై కీలకంగా చర్చించారు. జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విపత్తు నిర్వహణ బలోపేతమే లక్ష్యమని కేంద్ర ప్రభుత్వ అధికారులు తెపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో విపత్తు నిర్వహణ వ్యవస్థలను అభివృద్ధి చేయాలని నిర్ణయించామని అన్నారు. ప్రజలకు వేగవంతమైన విపత్తు సేవలందించేందుకు చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. కేంద్ర హోంశాఖ ఆదేశాలతో ఎపిలో పర్యటించామని వెల్లడించారు. విపత్తుల నిర్వహణలో సాంకేతికత వినియోగం పెంపుపై కార్యాచరణ చేపడుతున్నట్లు కేంద్ర ప్రభుత్వ అధికారులు పేర్కొన్నారు.

# వ్యాసాశ్రమంలో రాజకీయ జోక్యం వద్దు



**తిరుపతి(హెల్త్), జులై 31 ప్రభాతవార్త:** ఎంతో ఆధ్యాత్మిక చరిత్ర కలిగిన వ్యాసాశ్రమం విద్యార్థులకు విద్యను, జ్ఞాన దానం చేసిన ఆశ్రమం వేదాశ్రమం అని శ్రీనివాసనంద సరస్వతి స్వామి అన్నారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వేదాశ్రమంలో చిన్నచిన్న తప్పులు జరిగి ఉంటాయని, వేదాశ్రమ పరిరక్షణ సమితి, పూర్వ విద్యార్థులతో కలిపి దక్షిణ భారతదేశ సాధు సంతులతో, విశ్వహిందూ పరిషత్, హిందూ ధార్మిక సంస్థలతో కలిపి త్వరలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసుకొని, చర్చించుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని, ఆశ్రమంలో రాజకీయ జోక్యం వద్దు అని కోరారు. ఏర్పేడు ఆశ్రమం హిందూ సనాతన ధర్మానికి కేంద్ర బిందువుగా ఉన్నదని పేర్కొన్నారు. స్వామి సమస్యలు స్వాములే పరిష్కరించుకుంటామని చెప్పారు. ఎపి సాధు పరిషత్ గౌరవ అధ్యక్షులు అట్లూరి నారాయణరావు మాట్లాడుతూ అవినీతి ఆరోపణలతో మన ఆశ్రమాన్ని మనమే కించపరచుకోవడం, ఒకరి మీద ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలతో సనాతన ధర్మం సన్నగిల్లితుందన్నారు. తొందరలో జరిగే రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రతిదీ చర్చించుకొని సమస్య పరిష్కరించు కుందామని హితవు పలికారు. శివానంద సరస్వతి స్వామి మాట్లాడుతూ వ్యాసాశ్రమం 100సంవత్సరాల చరిత్ర కలిగి శతాబ్ది ఉత్సవాలు జరుపుకుం టున్నదని అన్నారు. అందరం కలిసి ఆశ్రమాన్ని కాపాడుకోవాలని, సమస్యల ను చర్చల ద్వారా పరిష్కరించుకుందామని పరిరక్షణ సమితి సభ్యులకు, పూర్వ విద్యార్థులు, స్వామీజీలను కోరారు. ఈ సమావేశంలో సాంబశివానందస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాన్ని మేల్కొలిపేందుకు 'మిషన్ చలో గావ్ కీ ఔర్' రథయాత్ర

## అఖిల భారత పంచాయితీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు అశోక్సింగ్


**జగ్గయ్యపేట, జులై 31 ప్రభాతవార్త:** ప్రభుత్వాన్ని మేల్కొలిపేందుకు దేశవ్యాప్త 'మిషన్ చలో గావ్ కీ ఔర్' రథయాత్ర చేపట్టినట్లు అఖిల భారత పంచాయితీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు అశోక్సింగ్ జాదోన్ అన్నారు. రెండు రోజుల ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా శుక్రవారం ఎన్టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బండిపాలెం గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, పంచాయితీలకు రాజ్యాంగబద్ధంగా కల్పించిన హక్కుల అమలు, గ్రామీణ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలను మేల్కొలిపేందుకు కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు దేశవ్యాప్త 'మిషన్ చలో గావ్ కీ ఔర్' రథయాత్ర చేపట్టినట్లు తెలిపారు. కాగా ఈకార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, పరిషత్ ఎపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ముల్లంగి రామకృష్ణారెడ్డి, టిడిపి నేతలు కట్టా వెంకటనరసింహారావు, అడుసుమల్లి ప్రభాకరరరావు, సర్పంచ్ నెమలి ఏసమ్మ, బండి శ్రీకాంత్, తాటి రామారావు, ఫీల్డ్ సహాయకులు నెమలి లత రమేష్, సీనియర్ మేట్ శారద తదితరులు పాల్గొన్నారు.



మిషన్ చలో గావ్ కీ ఔర్ రథయాత్రలో బండిపాలెం సందర్శించిన అఖిల భారత పంచాయితీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు అశోక్సింగ్ జాదోన్

# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వం లక్ష్యం

- కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



**కళ్యాణదుర్గం, జులై 31 ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ సిసి రహదారులు, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ఐదో రోజు బ్రహ్మసముద్రం మండలం భైరసముద్రంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గ్రామస్థుల సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎన్టిఆర్ విగ్రహ కట్టకు మెరుగులు దిద్దేందుకు తన స్వంత నిధుల నుంచి రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. వైసిపి పాలనలో నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ రహదారులు, మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తామని, గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# పదవీ విరమణ రోజే ఆంధ్ర వర్సిటీ మాజీ విసి ప్రసాదరెడ్డి సస్పెన్షన్

**విజయవాడ, జులై 31 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ) మాజీ వైస్ఛాన్సలర్ ప్రొఫెసర్ పివిజిడి ప్రసాదరెడ్డి పదవీ విరమణ రోజే సస్పెన్షన్కు గురయ్యారు. ఆయన శుక్రవారం పదవీ విరమణ చేయాల్సి ఉండగా ఈ అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఆయనపై వచ్చిన తీవ్రమైన అవినీతి, అధికార దుర్వినియోగ ఆరోపణలపై విజిలెన్స్, విచారణ కమిటీలు సమర్పించిన నివేదికల ఆధారంగా ఎయు పాలకమండలి సమావేశంలో ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఎయు విసిగా నియమితులైన ప్రసాదరెడ్డిపై మొదటి నుంచి అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. నిధుల దుర్వినియోగం, అధికార దుర్వినియోగం, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం వంటి పలు అంశాలపై ఫిర్యాదులు అందాయి. దీనిపై విచారణ జరిపిన విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విభాగం, ఆయన అక్రమాలకు పాల్పడినట్లు తేల్చింది. నిధుల దుర్వినియోగం, అక్రమాస్తుల ఆరోపణలపై ఎసిబితో విచారణ జరిపించాలని, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని తన నివేదికలో ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. విసిగా తన పదవీకాలంలో ప్రసాదరెడ్డి ఒక విద్యావేత్తగా కాకుండా వైసిపి కార్యకర్తలా వ్యవహరించారని తీవ్ర విమర్శలు ఉన్నాయి. విశ్వవిద్యాలయాన్ని పూర్తిగా రాజకీయ కార్యకలాపాలకు కేంద్రంగా మార్చారని, విసి కార్యాలయాన్ని పార్టీ ఆఫీసుగా నడిపారని ఆరోపణలు వచ్చాయి. ముఖ్యంగా, జివిఎంసి ఎన్నికల సమయంలో వైసిపి కార్పొరేటర్ అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాల రూపకల్పన వంటివి విసి ఛాంబర్ నుంచే జరిగాయని పలువురు ఆరోపించారు. విద్యార్థులతో రాజకీయ సర్వేలు చేయించారని కూడా విమర్శలు ఎదుర్కొన్నారు. ఈ ఆరోపణలు, విజిలెన్స్ నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించిన ఏయూ పాలకమండలి, ప్రసాదరెడ్డిని సస్పెండ్ చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. పదవీ విరమణ చేసే రోజునే సస్పెన్షన్ వేటు పడటం ఎయు చరిత్రలో చర్చనీయాంశంగా మారింది.

# అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆరోగ్య పరిశోధన రంగం అభివృద్ధి

- విజయవాడ ఎంపి కేశినేని చిన్ని ప్రశ్నకు సమాధానమిచ్చిన కేంద్రమంత్రి ప్రతాప్రావు జాదవ్

**విజయవాడ, జులై 31 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలో ఆరోగ్య పరిశోధన రంగాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తుంది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. వైద్య కళాశాలలు, పరిశోధనా సంస్థల్లో అత్యాధునిక పరిశోధన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తుందని స్పష్టం చేసింది. ప్రజారోగ్య సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలను అందించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య పరిశోధన ప్రోత్సాహం కోసం మౌలిక సదుపాయాల అభివృద్ధి కేంద్ర రంగ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపింది. ఈ మేరకు విజయవాడ లోక్సభ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్రావు జాదవ్ లోక్సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కేంద్ర రంగ పథకం కింద మల్టీ యూనిట్లలో ఏర్పాటైన స్థానిక పరిశోధన సలహా కమిటీలు పరిశోధన ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం పరిశీలించి ఆమోదిస్తున్నాయని తెలిపారు ఇప్పటివరకు దేశవ్యాప్తంగా మొత్తం 4,925పరిశోధన ప్రాజెక్టులు ఆమోదించబడ్డాయి. వీటిలో 1,796 ప్రాజెక్టులు విజయవంతంగా పూర్తికాగా, 1,801 ప్రాజెక్టులు అమలులో ఉన్నాయి. మరో 1,282 ప్రాజెక్టులు ప్రారంభ దశలో ఉండగా, 46 ప్రాజెక్టులు వివిధ కారణాలతో విరమించబడ్డాయి అని అన్నారు.

# పద్మావతి వర్సిటీ నూతన కార్యనిర్వాహక మండలి



**తిరుపతి, జులై 31 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి నూతన కార్యనిర్వాహక మండలి శుక్రవారం ప్రభుత్వం నియమించింది. మూడు సంవత్సరాల కాలానికి విద్యావిభాగంలో నిపుణులైన ఆరుగురు మహిళలను నూతన కార్యనిర్వాహక మండలిగా ఏర్పాటు చేసింది. నూతనంగా ఏర్పాటు చేసిన కార్యనిర్వాహక మండలిలో విశ్వవిద్యాలయంకు చెందిన సీనియర్ ప్రొఫెసర్ ప్రతినిధిగా కమ్యూనికేషన్, జర్నలిజం విభాగం ప్రొఫెసర్ ఆచార్య సి.వాణి, విశ్వవిద్యాలయం తరపున ప్రిన్సిపాల్/ డీన్ ప్రతినిధిగా సామాజిక శాస్త్రాలు, హ్యూమానిటీస్ మేనేజ్మెంట్ పాఠశాల డీన్ ప్రొఫెసర్ పి. విజయలక్ష్మిని ప్రభుత్వం నామినేట్ చేసింది. వివిధ వృత్తి పరమైన విద్యారంగాలకు చెందిన నలుగురు ప్రముఖులను కార్యనిర్వాహక మండలి సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సహ వ్యవస్థాపకురాలు, ఎండి డాక్టర్ సుచిత్ర కె. ఎల్లా, స్విమ్స్ విశ్వవిద్యాలయంకు చెందిన కార్డియాలజీ విభాగం డాక్టర్ వి.వనజాక్షమ్మ, చీఫ్ డేటా సైన్స్ ఇంజినీరింగ్ ఆఫీసర్ సాస్కెన్ టెక్నాలజీస్ లిమిటెడ్ నిర్మల దాట్ల, మాజీ ఉపకులపతి, కర్ణాటక రాష్ట్ర మహిళా విశ్వవిద్యాలయం చైర్మన్ డాక్టర్ మీనా రాజీవ్ చంద్రవార్కర్ ఉన్నారు.

# కొత్తూరు కెజిబివిలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

**కొత్తూరు (శ్రీకాకుళం జిల్లా), జులై 31 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండల కేంద్రంలోని టైప్-4 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కెజిబివి) వసతి గృహంలో విషాద ఘటన చోటుచేసుకుంది. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం లక్కయ్యగూడ గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం (బైపిసి) చదువుతోంది. శుక్రవారం ఉదయం ఆమె తన గది నుంచి బయటకు రాకపోవడంతో సహచర విద్యార్థులు, సిబ్బంది వెళ్లి చూడగా ఫ్యాన్కు ఉరి వేసుకుని విగతజీవిగా వేలాడుతూ కనిపించింది. విషయాన్ని మృతురాలి కుటుంబ సభ్యులు, పోలీసులకు తెలియజేశారు. సమాచారం అందుకున్న కొత్తూరు సిఐ చింతాడ ప్రసాద్, ఎస్ఐ వెంకటేశ్వర్లు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి నిశితంగా ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తును ముమ్మరం చేశారు. గ్రామస్థులు, గిరిజన సంఘాల నాయకులు కెజిబివి వసతి గృహం వద్దకు భారీగా చేరుకుని ఆందోళనకు దిగారు. తమ బిడ్డ ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, ఈ మరణం వెనుక ఖచ్చితంగా కుట్ర దాగి ఉందంటూ బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. మృతికి దారి తీసిన అసలు కారణాలను తక్షణమే బయటపెట్టాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఒంగోలులో యువకుడి దారుణ హత్య

**ఒంగోలు (క్రైమ్), జులై 31 ప్రభాతవార్త:** ఒంగోలు నగరంలోని రాజాపానగల్ రోడ్ ఎనిమిదో లైన్లో శుక్రవారం సాయంత్రం జరిగిన కత్తిపోట్ల ఘటన తీవ్ర విషాదానికి దారితీసింది. అదే ప్రాంతానికి చెందిన విష్ణుమూర్తిపై ఎదురింట్లో నివాసం ఉండే సిద్దు కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు వెంటనే రిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ ఆయన ప్రాణాలు నిలవలేదు. ఘటనపై సమాచారం అందుకున్న వన్టౌన్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. అనంతరం రిమ్స్ ఆసుపత్రికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. డిఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, టూ టౌన్ సిఐ వీరనాయక్ ఆసుపత్రిలో మృతదేహాన్ని పరిశీలించి దర్యాప్తు పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఘటన జరిగిన సమయంలో అక్కడ ఉన్న వారి వాంగ్మూలాలను నమోదు చేస్తూ సిసిటివి కెమెరాల దృశ్యాలను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తూ హత్యకు గల అసలు కారణాలను వెలికితీసే పనిలో నిమగ్నమయ్యారు. పూర్తి దర్యాప్తు అనంతరం మరిన్ని వివరాలను వెల్లడిస్తామని డిఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు తెలిపారు.

# మరణించిన న్యాయవాదుల కుటుంబాలకు రూ.16.92 కోట్ల మ్యాచింగ్ గ్రాంట్

**విజయవాడ, జులై 31 ప్రభాతవార్త:** మరణించిన న్యాయవాదుల కుటుంబాలకు మ్యాచింగ్ గ్రాంట్ రూ.16.92 కోట్లు న్యాయవాదుల కుటుంబాలకు పంపిణీ చేయాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ అడ్వకేట్స్ వెల్ఫేర్ ఫండ్ (తాత్కాలిక కమిటీ) సమావేశం నిర్ణయించింది. శుక్రవారం అమరావతిలోని బార్ కౌన్సిల్ కార్యాలయంలో బార్ కౌన్సిల్ చైర్మన్ నల్లూరి ద్వారకానాథ్ రెడ్డి అధ్యక్షతన సమావేశంలో ఇప్పటికే ఆమోదించిన 423మంది మృతి చెందిన న్యాయవాదుల కుటుంబాలకు పంపిణీ చేయాలని తీర్మానించింది. ఈ తాత్కాలిక కమిటీలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు ఆలూరి రామిరెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యులు బి.వెంకటరమణమూర్తి, ఉప్పలపాటి శ్రీనివాసరాజులు సభ్యులుగా ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం, హైకోర్టు ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మ్యాచింగ్ గ్రాంట్ను విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి అడ్వకేట్ వెల్ఫేర్ ఫండ్ (తాత్కాలిక) కమిటీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. ఈ ఆర్థిక సహాయం అడ్వకేట్ల కుటుంబాలకు క్లిష్ట పరిస్థితుల్లో గణనీయమైన భరోసాను కల్పిస్తుందని కమిటీ పేర్కొంది. అదే విధంగా మిగిలిన 727మంది మృతిచెందిన న్యాయవాదుల కుటుంబాలకు సంబంధించిన రూ.29.8 కోట్ల మ్యాచింగ్ గ్రాంట్ను కూడా వీలైనంత త్వరగా విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కమిటీ కోరింది. ఈ నిధుల విడుదల ద్వారా ఆ కుటుంబాలకు మరింత ఆర్థిక భరోసా లభించి, వారు ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితులను అధిగమించేందుకు తోడ్పడుతుందని కమిటీ అభిప్రాయపడింది.

# అవినీతిపై సమగ్ర దర్యాప్తు జరిపించండి

**జగ్గయ్యపేట, జులై 31 ప్రభాతవార్త:** జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికార కూటమి, ప్రతిపక్ష వైఎస్ఆర్సిపి కౌన్సిలర్లు అవినీతి పనులు జరిగాయని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షతన జరిగిన కౌన్సిల్లో టిడిపి, జనసేన కౌన్సిలర్ల మధ్య పలు అవినీతి పనలపై వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. ప్రతిపక్ష వైఎస్ఆర్సిపి వైస్చైర్పర్సన్ పఠాన్ హాఫీజున్నీసా ఫిరోజ్, కౌన్సిలర్ వట్టెం మనోహర్ కూడా అవినీతి పనులు జరిగాయంటూ బాధ్యులైన అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని చైర్మన్ను కోరగా, చర్యలు తప్పవని పేర్కొన్నారు.

## గోరింట పూచేవేళ !



ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం అనేది తెలుగు సంప్రదాయంలో ముఖ్యమైన ఆచారం. దీనికి సాంప్రదాయ, ఆరోగ్య పరమైన కారణాలు రెండూ ఉన్నాయి. ఆషాఢంలో గోరిం టాకు పెట్టుకోవడం వల్ల సౌభాగ్యం, ఆనందం, శుభం కలుగుతుంది. ముఖ్యంగా వివాహిత మహిళలు మంగళకరంగా భావించి గోరింటాకు పెట్టుకుంటారు. గోరింటాకు చేతికండని ఆషాఢాన్ని ఏ ఆడపిల్ల ఊహిం చదు. ఆషాఢం వర్షాకాలం ప్రారంభమయ్యే సమయం. ఈ కాలంలో గోరిం టాకు శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది, చేతులు-కాళ్లలో వేడిని తగ్గిస్తుంది. అలాగే కొన్ని చర్మ సమస్యలు, సూక్ష్మ జీవుల పెరుగుదలను తగ్గించడంలో కూడా ఇది సహాయ పడుతుంది. ఆషాఢంలో మహిళలు, యువతులు కలిసి గోరింటాకు పెట్టుకుని పాటలు పాడుతూ, పండుగ వాతావరణాన్ని ఆస్వాదించడం అనేది కుటుంబ, సామాజిక బంధాలను బలపరిచే సంప్ర దాయంగా భవిస్తారు. ఆషాఢంలో గోరింటాకు తప్పనిసరిగా పెట్టుకోవాలని శాస్త్రీయ నియమ మేదీ లేకున్నా సంప్రదాయం, విశ్వాసం ఆరోగ్యా నికి ఉపయోగపడే అలవాటుగా మారింది. అదొక సహజ సౌందర్య సాధన.

## మ్యాచింగ్ రెయిన్‌కోట్స్











'వానావానా వల్లప్పా. వాకిలి తిరుగు చెల్లప్పా' అంటూ చినుకుల్లో తడుస్తూ.. చిన్నారుల తెగ సంబరపడిపోయే వర్షాకాలం. ఈ సందడితోపాటు పిల్లల్లో ఉత్సాహం నింపడం కోసం రకరకాలుగా వస్తున్న రెయిన్‌కోట్స్ ఇవి. అవేంటో తెలుసుకుందాం. ఒంటినంతా కప్పే మోడల్ మాత్రమే కాకుండా రెయిన్‌కోట్ ఇప్పుడు డైనోసార్, ఫైర్‌ఫైటర్ డిజైన్లలో సూట్, గౌను, బ్లేజర్, కాలర్ షర్ట్, పోంఛో, హుడెడ్ జాకెట్ అంటూ, సరికొత్త డిజైన్లలో చిన్నారులను ఆకర్షిస్తున్నాయి. సాధారణ దుస్తుల్లాగే అనిపిస్తూ, పిల్లలను వర్షను చినుకుల్లో తడవకుండా రక్షిస్తాయి. లోపలి దుస్తులను పొడిగానూ ఎంచుతాయి. జత కడుతున్నాయి... చెక్స్ పూల డిజైన్లు పరచుకున్న రెయిన్‌కోట్‌కు మ్యాచింగ్‌గా గొడుగు, బూట్లు కూడా వస్తున్నాయిప్పుడు. చిన్నారుల మనసుకు నచ్చే కార్టూన్లు, జంతువుల బొమ్మల ప్రింట్స్‌తో రెయిన్‌కోట్, గొడుగు మరింత ఆకర్షణీయంగా ఉంటున్నాయి. అలాగే సాధారణ వర్షాకాలం బూట్లులాంటివి మాత్రమే కాకుండా, నచ్చిన బూట్లకు కవర్స్‌లా తొడుక్కునేలా సౌకర్యంగా జిప్‌తో ఉండే కవర్లూ.. వస్తున్నాయి. దీంతో ఖరీదైన బూట్లు పాడవకుండా ఉంటాయి. అంతేకాదు మెకాళ్లపై వరకు వచ్చే ప్లాస్టిక్ సాక్సు లాంటివి మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. పలు డిజైన్ల పింట్‌తో వస్తున్న ఇవి ప్యాంటును తడవనివ్వ కుండా ఉంచగలవు. ఈ సౌకర్యాలన్నీపిల్లలను వర్షాకాలంలోనూ సరదాగా గడిపేలా చేస్తాయి.

## తల్లి పాలు అమృత తుల్యం



**తల్లిపాల వల్ల ప్రయోజనాలపై అవగాహన కల్గించాలని ఏటా 120 దేశాల్లో అంతర్జాతీయ వారోత్సవాలు జరుపు కుంటారు. అవగా హన రాహిత్యం వల్ల చాలామంది తల్లులు తల్లి పాల ప్రాముఖ్యతను గుర్తించలేకపోతున్నారు. దీనికి కుటుంబ సభ్యుల సహకారం, డాక్టర్ల సలహాలు, నర్సింగ్ కేర్ అవసరం. గర్భధారణ, ప్రసవ సమయంలో ఎదురయ్యే సమస్యలు రాకుండా ముందే ఆరోగ్య సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల, బ్రెస్ట్ ఫీడింగ్‌పైన ఉన్న అపోహల్ని దూరం చేయడమే.**



సగానికి పైగా తల్లులు పిల్లలకి సరిగా పాలివ్వ లేక పోతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 37% శిశువులే ఆరు నెలల వరకు పాలు త్రాగుతున్నారని అంచనా. డబ్ల్యుహెచ్‌ఓ ప్రకారం ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలి. అమెరికాలోని పిడియాట్రిక్స్ అకాడమీ, అమెరికన్ కాలేజ్ ఆఫ్ అబ్స్‌టెన్‌ట్రిషియన్స్ అండ్ గైనకాల జిస్ట్స్ సంవత్సరం వరకు వీలైతే 2 సంవత్సరాల వరకు పాలు ఇవ్వడం వల్ల ఆనంద కరమైన అనుభూతి తల్లి బిడ్డల మధ్య పెరిగి సెక్యూ రిటీ ఫీలింగ్ కల్గుతుందని తెల్పారు. తల్లిపాలను సరిగా ఇవ్వగలిగితే ప్రతి సంవత్సరం 8-10 లక్షల మంది పిల్లల్ని 5 సంవ త్సరాల లోపు స్త్రీలలో రొబ్బు కేన్సర్‌తో బాధపడే 20 వేల మందిని మరణించ కుండా కాపాడవచ్చు. తల్లి పాలలో బిడ్డ ఎదుగుద లకు అవసరమైన, తేలికగా జీర్ణమయ్యే పోషకాలుండి వారి శారీరక, మానసిక అవసరాలకు తగినట్లుగా మారుతూ ఉంటుంది. బిడ్డకు అవసర మైన తొలి పోషణ, రక్షణ ఇవ్వాల్సిన తల్లి బాధ్యతని గుర్తు చేయడమే అంత ర్జాతీయ తల్లిపాల వారోత్స వాల ముఖ్య ఉద్దేశం. ఇది సహజంగా జరిగే ప్రక్రియ కాని కొందరిలో కొన్ని సమస్యలు ఎదుర వుతాయి. తల్లి బిడ్డకు పాలిచ్చే ప్రక్రియ 1-7 రోజులు పట్ట వచ్చు. కంగారు పడనక్కరలేదు. తల్లిలోని ఆక్సిటోసిన్ హార్మోన్స్ వల్ల క్షీర గ్రంథుల్లోని డక్ట్స్ తెరుచుకోవడం వల్ల ప్రొలాక్టిన్ హార్మోన్ వల్ల ప్రతి ఒక్కలిలో పాలు పడతాయి. అందుకే ప్రసవానికి 3 నెలల ముందే పుట్టబోయే శిశువుకు ఏ విధంగా, ఎన్నిసార్లు, ఎలా పాలు పట్టాలి? ఎన్ని సార్లు మల, మూత్ర విసర్జన చేస్తారు? ఎక్కువ సేపు నిద్రపోవ డం, ఎలా త్రాగాలో శిశువుకు తెలియక పోవడం, ఎంతసేపు వీలైతే అంతసేపు స్టిములేషన్ ఇవ్వడం వంటి అనేక సమస్యల్ని ఎలా ఎదుర్కోవాలి అని కౌన్సిలింగ్ సెషన్ తీసుకోవడం అన్ని విధాలా మంచిది. బ్రెస్ట్ ఫీడింగ్ టెక్నిక్స్‌ని ఓర్పు, నేర్పుతో తెలుసుకోవడం చాలా అవసరం. దీని వల్ల తల్లి బిడ్డ అనుబంధం బాగుంటుంది. నార్మల్ డెలివరీ అయిన అరగంట గంటలోపు, సిజెరియన్ అయిన 4 గంటలులోపు వీలైనంత త్వరగా బిడ్డకు తల్లిపాలని ఇవ్వడం ప్రారంభించాలి. చాలా మందిలో పుట్టిన వెంటనే కొన్ని చుక్కల నుండి 10మి.లీ పసుపు పచ్చని ముర్రుపాలు పడతాయి. వీటిలో శిశువుకు కావలసిన ఇమ్యూనిటీని పెంపొందించే ఆంటిబాడీస్ ఉంటాయి. కాన్పు అయిన 2 నుంచి 4 రోజులకి 300-400 మి.లీ. 5వ రోజు నుంచి 500- 800 మి.లీ పాలు ఉత్పత్తి అయి వేగంగా పెరిగే బిడ్డ శరీర అవసరాలకు తగినట్లుగా ఉండి శక్తిని అందిస్తాయి. వీటిలో లాక్టోజ్, క్రొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. 5-14వ రోజు వరకు వచ్చే పాల్ని ట్రాన్సిషనల్ మిల్క్ అంటారు. కాన్పు అయిన 4 వారాల తర్వాత వచ్చే పాలలో 90% నీరు, పిండి పదార్థాలు, విటమిన్స్, మినరల్స్ 2% ప్రోటీన్స్, 8% క్రొవ్వులు, షుగర్స్, ఎంజైమ్స్, హార్మోన్స్, గ్రోత్ ఫ్యాక్టర్స్ ఉండి బిడ్డ సంపూర్ణ ఎదుగుదలకు సాయం చేస్తాయి. చాలా మంది తల్లులు తమ పిల్లలకు సరిపోయేన్ని పాలు ఇవ్వలేక పోతున్నాయని మధన పడిపోతుంటారు. కారణం అనారోగ్య సమస్యలు, ఒత్తిడి, బాడీ డీ హైడ్రేషన్, ప్రసవం తర్వాత ఎక్కువగా నిద్రపోవడం సరైన ఆహారం తీసుకోక పోవడం, పథ్యం ఉండడం కారణం. తల్లిపాలు పడడానికి మాత్రలు, మందులు మ్రింగడం కంటే ఆరోగ్యకరమైన సమతుల్య ఆహారం తీసుకుంటే చాలు. తల్లిపాలు సమృద్ధిగా పడతాయి. ఒక రొటీన్‌లో పడేంత వరకు ప్రయత్న లోపం లేకుండా నర్సింగ్ డిమాండ్‌ని బట్టి రోజుకి 8-10 సార్లు తల్లిపాలు ఇవ్వవచ్చు. తల్లి పాలు తాజాయైన సమ తుల్య ఆహారం తల్లిపాలు శిశువుకి సురక్షితం. తల్లిపాల ఉత్పత్తి సరఫరా ప్రక్రియను ఇంగ్లీష్‌లో టైలర్ మేడ్ అంటారు. ప్రకృతి సిద్ధమైన పాలని నవజాత శిశువులకు ఎప్పుడు ఏది అవసరమో అది తల్లుల ద్వారా అందించడం చాలా అవసరం.

"కొంతమంది మహిళలు తల్లిపాలు ఇస్తే తమ అందం తగ్గిపోతుందని సాధారణ అపోహ.. గర్భధారణ, హార్మోన్ల మార్పులు, వయస్సు, బరువు మార్పులు వంటి కారణాల వల్ల శరీరంలో మార్పులు రావచ్చు. తల్లిపాలు ఇవ్వడం వల్లే అందం తగ్గిపోతుందని చెప్పడం సరైంది కాదు." కానీ దీనికి బలమైన శాస్త్రీయ ఆధారాలు లేవు. అపోహ ఉన్న వాటి నుండి బయటికి రావాలి.



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

## మోక్ష మార్గానికి దారి !

అరుణాచలంలో గిరిప్రదక్షణ మార్గంలో ఒక విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రదేశం మోక్షమార్గం.. గిరిప్రదక్షిణ మార్గంలో కుబేర లింగం దాటిన తర్వాత ఈ గుహ వస్తుంది. దీనినే భక్తులు 'మోక్ష మార్గం' అని పిలుస్తారు. ఇడుక్కు పిళ్లైయార్ గుహ (ఇడుక్కు పిళ్లైయార్ గుడి/సందు) అనేది తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరువణ్ణామలై (అరుణాచలం) గిరిప్రదక్షిణ మార్గంలో ఉన్న ఒక విశిష్టమైన ప్రాంతం.



తమిళంలో 'ఇడుక్కు' అంటే ఇరుకైన సందు అని అర్థం. 'పిళ్లైయార్' వినాయకుడు. ఇది ఒక సాధారణ ఆలయంలా కాకుండా, పెద్ద పెద్ద బండరాళ్ల (రాయి) మధ్య ఉన్న అతి ఇరుకైన మార్గం. గుహ రూపంలో ఉంటుంది. భక్తులు వెనుక ద్వారం నుండి పడుకుని పాకుతూ, ముందుకు సాగి ఎదురు ద్వారం గుండా బయటకు వస్తారు. ఇలా ఈ ఇరుకైన గుహ గుండా విజయవంతంగా బయటకు వస్తే పూర్వ జన్మ పాపాలు, కష్టాలు అహంకారం తొలగిపోతాయని నమ్ముతారు. శారీరక రుగ్మతలు, కీళ్ల నొప్పులు ఉపశమిస్తాయని భక్తుల విశ్వాసం. జీవితంలో ఇబ్బందులను ఎదుర్కొని బయటపడటాన్ని ఈ ఇరుకైన మార్గమే సుగమనం చేస్తుంది. పురాణ ఐతిహ్యం, స్థానిక కథనాల ప్రకారం, పూర్వం ధనపాలుడనే ధనవంతుడైన వర్తకుడు తన వద్ద ఉన్న సంపదతో అరుణాచలేశ్వ రుడిని దర్శించుకోవడానికి వచ్చాడు. అయితే అతని మనస్సులో సంపద పట్ల మోహం, అహంకారం నిండిపోయాయి. ఈ క్రమంలో వినాయకుడు రాళ్ల మధ్య ఇరుకైన సందుగా అవతరించి, అతని అహంకారాన్ని పరీక్షించాడు. ధనపాలుడు ఆ ఇరుకైన రాళ్ల మధ్య నుండి దాటి బయటకు వచ్చినప్పుడు అతని అహంకారం తొలగి, ఆధ్యాత్మిక జ్ఞానం పొందాడని అంటారు ఈ గుహ మార్గం అత్యంత ఇరుకైనది. లావుగా ఉన్నవారు లేదా ఊపిరితిత్తుల/గుండె సంబంధిత సమస్యలు (ఆస్తమా, క్లాస్ట్రోఫోబియా) ఉన్నవారు ఈ గుహ ద్వారా వెళ్లడం శ్రేయస్కరం కాదు. .ఈ స్థలానికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన వినూత్న మైన నిర్మాణంఈ గుడి లేదా గుహ చాలా ఇరుకైన రాతి సందు రూపంలో ఉంటుంది. చిన్న రాతి గదిలోకి లేదా సందులోకి ప్రవేశించి, అటువైపు ఉన్న వినాయకుడిని (పిళ్లైయార్) దర్శించుకుని మరోవైపు నుండి బయటకు రావాలి. ఈ మార్గం ఎంత ఇరుకుగా ఉంటుందంటే, మనుషులు కింద పడుకుని పాకుతూ లేదా ఒకపక్కగా ఒరిగి మాత్రమే దాటగలరు. ఈ ఇరుకైన సందు గుండా పాకుతూ వెళ్లడం వల్ల వెన్నునొప్పి, నడుము నొప్పి మరియు ఇతర శారీరక రుగ్మతలు తగ్గుతాయని భక్తుల బలమైన నమ్మకం. తల్లి గర్భం నుండి బయటకు వచ్చిన అనుభూతిని ఈ సందు ద్వారా వెళ్లడం కలిగిస్తుం దని, ఇది ఒక రకమైన శారీరక, మానసిక ప్రక్షాళన అని చెబుతారు. దీనివల్ల పాపాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. భౌతిక ఆరోగ్య ప్రయోజనం కూడా ఉంటుం దని భావిస్తుంటారు. ఒక రకమైన ఆక్యుప్రెజర్ లేదా వ్యాయామ ప్రక్రియ దాగి ఉందంటారు. ఆ ఇరుకైన రాతి సందులో శరీరాన్ని వంచి, సాగదీసి పాకడం వల్లవెన్నెముకలోని నరాలు, కండరాలు సాగి వెన్నెముక సరిచేయబడుతుంది. అందువల్లనే నడుము నొప్పులు తగ్గుతాయని గిరిప్రదక్షిణలో భాగం అరుణాచల గిరిప్రదక్షిణ చేసే వేలాది మంది భక్తులు ఈ 'ఇడుక్కు పిళ్లైయార్' స్థలాన్ని దర్శించి, ఆ సందు గుండా వెళ్లడాన్ని ఒక ముఖ్యమైన విశేషంగా భావిస్తారు. లావుగా ఉన్నవారు సైతం ఈ సందు గుండా సులభంగా దాటి రాగలరని చెప్పుకుంటున్నా ఇటీవల జరిగిన రెండు సంఘటనలు భక్తులకు చేదు అనుభవాన్ని మిగిల్చాయి. చేదు అనుభవాన్ని మిగిల్చాయి. దాంతో అక్కడ భక్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ బోర్డులు వెలిసాయి. భౌతికంగా లోపలికి వెళ్లడం కష్టమనిపిస్తే, బయటి నుంచి వినాయకుడిని దర్శించుకుని నమస్కరించుకోవడం మంచిది.

## తెర

## అల్లు అర్జున్ 'స్పైడర్‌మ్యాన్' బ్రాండ్ న్యూ డే ప్రీమియర్



ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూసిన స్పైడర్‌మ్యాన్: బ్రాండ్ న్యూ డ్లే విడుదల సందర్భంగా హైదరాబాద్‌లోని అల్లు సినిమాస్ (భారతదేశంలోనే అతిపెద్ద, అత్యాధునిక డాల్బీ సినిమా స్క్రీన్)లో గ్రాండ్ ప్రీమియర్ నిర్వహించారు. ఈ ప్రత్యేక ప్రీమియర్‌కు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన భార్య స్నేహారెడ్డి, పిల్లలతో కలిసి హాజరై సందడి చేశారు. అభిమానులు ఈ అరుదైన ఫ్యామిలీ మూమెంట్‌ను ఆసక్తిగా స్వాగతించగా, సోషల్ మీడియాలో ఈ ఫోటోలు వైరల్‌గా మారాయి. ఈ వేడుకకు అల్లు అరవింద్, అల్లు శిరీష్, బన్నీ వాస్, దర్శకులు చందూ మొండేటి, సాయి రాజేష్, హరీష్ శంకర్, బోయపాటి శ్రీను, నటి రష్యా గోరక్, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాత రవి, హారిక హాసిని క్రియేషన్స్‌కు చెందిన నిర్మాత చిన్నబాబు, ఆస్కార్ విజేత నిర్మాత గునీత్ మోంగా తదితరులు హాజరయ్యారు. సినీ ప్రముఖుల సందడితో ప్రీమియర్ మరింత ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది .అల్లుఅర్జున్ 'స్పైడర్‌మ్యాన్' బ్రాండ్ న్యూ డే ప్రీమియర్ ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూసిన'స్పైడర్‌మ్యాన్: బ్రాండ్ న్యూ డ్లే విడుదల సందర్భంగా హైదరాబాద్‌లోని అల్లు సినిమాస్ (భారతదేశంలోనే అతిపెద్ద, అత్యాధునిక డాల్బీ సినిమా స్క్రీన్)లో గ్రాండ్ ప్రీమియర్ నిర్వహించారు. ఈ ప్రత్యేక ప్రీమియర్‌కు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన భార్య స్నేహారెడ్డి, పిల్లలతో కలిసి హాజరై సందడి చేశారు. అభిమానులు ఈ అరుదైన ఫ్యామిలీ మూమెంట్‌ను ఆసక్తిగా స్వాగతించగా, సోషల్ మీడియాలో ఈ ఫోటోలు వైరల్‌గా మారాయి. ఈ వేడుకకు అల్లు అరవింద్, అల్లు శిరీష్, బన్నీ వాస్, దర్శకులు చందూ మొండేటి, సాయి రాజేష్, హరీష్ శంకర్, బోయపాటి శ్రీను, నటి రష్యా గోరక్, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాత రవి, హారిక హాసిని క్రియేషన్స్‌కు చెందిన నిర్మాత చిన్నబాబు, ఆస్కార్ విజేత నిర్మాత గునీత్ మోంగా తదితరులు హాజరయ్యారు.

## కియారా బర్త్‌డే స్పెషల్ పోస్టర్ రిలీజ్



రాకింగ్ స్టార్ యశ్ హీరోగా తెరకెక్కుతున్న 'టాక్సిక్' నుంచి కియారా అద్వానీ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆమె పాత్రను పరిచయం చేస్తూ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే జోరుగా ప్రమోషన్స్ నిర్వహిస్తున్న మేకర్స్, కియారా బర్త్‌డే సందర్భంగా విడుదల చేసిన ఈ పోస్టర్‌తో మరోసారి అందరి దృష్టిని ఆకర్షించారు. అద్భుతమైన డిజైన్‌తో రూపొందించిన ఎరుపు రంగు దుస్తుల్లో కియారా అద్వానీ ఎంతో స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. ఆమె చూపులు, బోల్డ్ రూబీ లిప్స్, రాయల్ లుక్ పోస్టర్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్లామర్‌కే పరిమితం కాకుండా, 'నాదియా' పాత్రలో కాన్ఫిడెన్స్, మిస్టరీ దాగి ఉన్న పోస్టర్ ఆసక్తికరంగా ఉంది. 'టాక్సిక్' చిత్రంలో నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భారీ అంచనాలుఉన్నాయి చిత్రం ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## 'నిరమ్' ట్రైలర్, ఆడియో లాంచ్



త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతున్న మూవీ..ముగెన్ రావ్, ప్రీతి అస్రాని, తాన్యా హోప్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా "నిరమ్". ఈ చిత్రాన్ని కె. స్క్వేర్ సినిమాస్ సమర్పణ లో యూనిట్ ఆఫ్ కె స్క్వేర్ వెంచర్స్ బ్యానర్ పై కె. బిందుమాధవి నిర్మిస్తున్నారు. పి.రాజేష్ కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. సరికొత్త ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్ మూవీ దర్శకుడు బలరామ్ కృష్ణ రూపొందిస్తున్న ఈ సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు "నిరమ్" సినిమా తెలుగు ట్రైలర్, ఆడియో లాంఛ్ ఈవెంట్ ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. లిరిసిస్ట్ భారతీబాబు మాట్లాడుతూ ఈ చిత్రంలో నేను రెండు సాంగ్స్ రాశాను. వనమాలి గారు రెండు సాంగ్స్ రాశారు. డైరెక్టర్ బలరామ్ కృష్ణ గారికి తెలుగు బాగా తెలుసు. ఆయన మాతో మంచి సాంగ్స్ రాయించుకు న్నారు. డీవోపీ సంటానియో టెర్జియో మాట్లాడుతూ బలరామ్ కృష్ణ అద్భుతమైన దర్శకుడు. దర్శకుడిగా ఆయనకు తొలి చిత్రమైనా స్క్రీన్ ప్లే, విజువల్ లాంగ్వేజ్ తో ఆకట్టుకుం టారు. ఇదొక మంచి సినిమా. ఈ చిత్రానికి పనిచేయడం సంతోషంగా ఉంది. సింగర్ ప్రవస్తి మాట్లాడుతూ ఇమ్మాన్ సార్ నా ఫేవరేట్ మ్యూజిక్ డైరెక్టర్. ఆయన కంపోజిషన్ లో పాట పాడాలనేది నా డ్రీమ్. ఈ చిత్రంతో ఆ అవకాశం రావడం సంతోషంగా ఉంది. మ్యూజిక్ డైరెక్టర్ డి. ఇమ్మాన్ మాట్లాడుతూ క్రైమ్ ఇన్విస్టిగేటివ్ థ్రిల్లర్స్, క్రైమ్ థ్రిల్లర్స్, హారర్..ఇవి నా ఫేవరేట్ జానర్స్. నేను కెరీర్ లో ఇప్పటిదాకా 120కి పైగా చిత్రాలకు మ్యూజిక్ చేశాను. అయితే నేను కంపోజ్ చేసిన రెండో క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ మూవీ ఇది. కో ప్రొడ్యూసర్ పి. రాజేష్ మాట్లాడుతూ నేను, డైరెక్టర్ బలరామ్ కృష్ణ స్కూల్ ఫ్రెండ్స్. మా కె స్క్వేర్ వెంచర్స్ సంస్థకు ఇది తొలి చిత్రం. మేము ఈ సినిమా నుంచి సినిమా పరిశ్రమలో మా ప్రయాణం కొనసాగిం చాలని అనుకుంటున్నాం. నటుడు నితిన్ సత్యా మాట్లాడుతూ నా కెరీర్ లో ఎన్నో వైవిధ్యమైన పాత్రల్లో నటించాను. ఈ సినిమాలో ప్రతి నాయక పాత్రలో నటిస్తున్నాను. మా చిత్రానికి మంచి పేరొస్తే ఆ క్రెడిట్ డైరెక్టర్‌కు, మ్యూజిక్ డైరెక్టర్ కే ఇవ్వాలి. మా టీమ్ అంతా కలిసి ఒక మంచి సినిమా చేశాం.

## 'సుధీర్స్ జోకర్'లో గాయత్రీ దేవిగా అభిరామి



సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'సుధీర్స్ జోకర్'. బిగ్ బాస్ ఫేమ్ అయేషా ఈ చిత్రంతో హీరోయిన్ గా పరిచయం కాబోతోంది. ఈ చిత్రంలో అభిరామి, మురళీ శర్మ, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, విష్ణు ఓయ్, మురళీధర్ గౌడ్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అందరి ప్రశంసలు అందుకున్న పరదా లాంటి విభిన్నమైన చిత్రం తర్వాత ఆనంద మీడియా బ్యానర్ పై ప్రొడ్యూసర్స్ శ్రీనివాసులు పి.వి., విజయ్ డొంకాడ, శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్నారు. పీఎస్ సునీల్ పుప్పాల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ రోజు 'సుధీర్స్ జోకర్' మేకర్స్ ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఇచ్చారు. ఈ చిత్రంలోని ఓ కీలక పాత్రలో ప్రముఖ నటి అభిరామి నటిస్తున్నట్లు ప్రకటించారు. 'సుధీర్స్ జోకర్' సినిమాలో అభిరామి గాయత్రీ దేవి పాత్రలో ప్రేక్షకుల్ని అలరించ బోతోంది. ఈ అనౌన్స్ మెంట్ సందర్భంగా అభిరామి పోషిస్తున్న గాయత్రీ దేవి క్యారెక్టర్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. 'అమ్మకు ఇచ్చిన మాట చిరకాలం మిగిలి పోతుంది..' అంటూ ఈ పోస్టర్ పై రాసిన క్యాప్షన్ హార్ట్‌టచింగ్‌గా ఉంది. అభిరామి చేస్తున్న గాయత్రీ దేవి పాత్ర మంచి ఎమోషన్స్ తో ఆకట్టుకోనుంది. ఆమెకు ఈ పాత్ర టైలర్ మేడ్ అనే ఇంప్రెషన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌తో కలుగుతోంది. అభిరామి స్ట్రాంగ్ పర్ ఫార్మెన్స్ ఈ కథకు మరింత బలాన్ని చేకూర్చనుంది.

## 'కాళాంకి భైరవుడు'నుంచి 'ఏంటో ఏమో' పాట రిలీజ్



విభిన్నమైన గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన మిస్టికల్ థ్రిల్లర్ 'కాళాంకి భైరవుడు' ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. చేత బడులు, క్షుద్ర పూజలు, నిజ జీవితంలో చోటుచేసుకున్న కొన్ని ఆశ్చర్యకర సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త సినీ అనుభూతిని అందించ నుంది. దర్శకుడు హరిహరన్.వి తన ప్రత్యేక కథన శైలితో ఈ చిత్రాన్ని రూపొందించారు. గాయత్రీ ప్రొడక్షన్స్, రాచమల్ల బ్రదర్స్ బ్యానర్లపై కె.ఎన్. రావు, డా. రాచమల్ల శ్రీనివాసరావు ఈ చిత్రాన్ని నిర్మించగా, పీ.ఆర్. సంగీతం సమకూర్చారు. ఇందులో రాజశేఖర్‌వర్మ ప్రధాన పాత్రలో నటించగా, రితికా చక్రవర్తి, పూజ కిరణ్, భవ్యశ్రీ ఇతర కీలక పాత్రలను పోషించారు. ఇటీవల జరిగిన టీజర్ లాంచ్ కార్యక్రమానికి ప్రముఖ దర్శకుడు సాయి రాజేష్ ముఖ్య అతిథిగా హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు అని తెలిసిందే. తాజాగా ఈ చిత్రం నుంచి "ఏంటో ఏమో" అనే మెలోడీ పాటను విజయడలో ఘనంగా విడుదల చేశారు. విజయవాడ ఎంజీ రోడ్డులోని లైలా మాల్‌లో ఉన్న INOX థియేటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి చిత్ర బృందం హాజరై అభిమానులు, ప్రేక్షకుల సమక్షంలో పాటను ఆవిష్కరించింది. ఈ వేడుకకు మంచి స్పందన లభించగా, చిత్రబృందం సినిమా విశేషాలను పంచుకుంటూ ప్రేక్షకుల అభిమానానికి కృతజ్ఞతలు తెలిపింది. ప్రొడ్యూసర్ రాచమల్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ.... 'మా సినిమా కాన్సెప్ట్ బ్లాక్ మేజిక్, ఈ సినిమా మీ అందరకి నచ్చుతుంది.

## 'ఐ యామ్ గేమ్' ట్రైలర్ విడుదల



దుల్కర్ సల్మాన్ ప్రతిష్టాత్మక చిత్రం 'ఐ యామ్ గేమ్' ట్రైలర్ విడుదలైంది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ ట్రైలర్ ని లాంచ్ చేశారు. ఈ సందర్భగా సోషల్ మీడియాలో స్పెషల్ పోస్ట్ పెట్టారు. ఐయామ్‌గేమ్ ట్రైలర్‌లోని ఆ ఫైరీ వైబ్ నాకు బాగా నచ్చింది. మొదటి నుంచి చివరి వరకు ఎంతో గ్రిప్పింగ్‌గా, ఎంగేజింగ్‌గా సాగింది. నా సోదరుడు దుల్కర్ మరో స్పెషల్ మూవీతో వస్తు న్నారని నమ్మకం కలిగింది. తనకి మంచి ఫలితాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాను. అతనితో పాటు మొత్తం చిత్ర బృందానికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు!" అని ట్వీట్ చేశారు. ప్రేక్షకులు, అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం 2026 ఆగస్టు 20న ఓణం కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. దుల్కర్ సల్మాన్ వేఫేరర్ ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ భారీ బడ్జెట్ ఫాంటసీ థ్రిల్లర్, ఆయన కెరీర్‌లోనే అత్యంత భారీ చిత్రంగా రూపొందుతోంది. ఈ చిత్రానికి నహాస్ హిదాయత్ దర్శకత్వం వహిస్తున్నారు. దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ వేఫేరర్ ఫిల్మ్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి సాజిర్ బాబా, ఇస్మాయిల్ అబూబక్కర్, బిలాల్ మొయిదు స్క్రీన్‌ప్లే అందించగా, సాజిర్ బాబా, ఆదర్శ్ సుకుమారన్, షబాస్ రషీద్ సంభాషణలు రాశారు. విడుదలైన ట్రైలర్ ఆద్యంతం ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేసే ఎడ్జ్‌ఆఫ్‌దిసీట్ ఎంటర్‌టైనర్‌ను వాగ్దానం చేస్తోంది. అద్భుతమైన విజువల్స్, దక్షిణ భారతదేశంలోని 100కు పైగా లొకేషన్లలో చిత్రీకరించిన 'ఐ యామ్ గేమ్, ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. పరిశ్రమలోనే అత్యంత భారీ విడుదలల్లో ఒకటిగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, సెకండ్ లుక్ పోస్టర్లు సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందనను అందుకున్నాయి. ఈ చిత్ర సంగీత హక్కులను జీ మ్యూజిక్ సొంతం చేసుకోగా, జేక్స్ బిజోయ్ సంగీతం అందించారు.



### కామన్వెల్త్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్

## భారత్ పురుషుల, మహిళల జట్లకు

# రెండు స్వర్ణాలు

**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లలో భారత్‌కు రెండు స్వర్ణ పతకాలులభించాయి. పురుషుల, మహిళలజట్లు రెండూ తమఫైనల్స్‌లో మలేషియాను చిత్తు చేసి ఈ పతకాలను కైవసం చేసుకున్నాయి. 22వ కామన్వెల్త్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో, మనుష్ షా ఆడిన రెండు మ్యాచ్‌లలోనూ విజయం సాధించడంతో, మలేషియాను 3-2 తేడాతో ఓడించిన భారత పురుషుల జట్టు, మహిళల జట్టుతో పాటు టీమ్ టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఈ విజయం, టోర్నమెంట్ ప్రారంభ రోజున మలేషియా చేతిలో లీగ్ దశలో ఎదురైన అనూహ్య ఓటమికి ప్రతీకారం తీర్చుకున్నట్లయింది. వాంగ్ క్వి షెన్‌తో మనుష్‌కు జరిగిన ఉత్కంఠ భరితమైన పోరు ఫైనల్‌ను భారత్ వైపు మలుపు తిప్పింది. అయితే, వాంగ్‌పై మనుష్ అద్భుతమైన పునరాగమనం చేసే వరకు పురుషుల ఫైనల్ ఉత్కంఠభరితంగా సాగింది. నిర్ణయాత్మక గేమ్‌లో 4-6తో వెనుకబడి ఉన్నప్పుడు, మనుష్ కొట్టిన టాప్‌స్పిన్ బంతి నెట్‌లోకి వెళ్లడంతో వరుసగా ఏడు పాయింట్లు సాధించి అద్భుత విజయంతో భారత్‌కు టైటిల్‌ను ఖాయం చేశాడు. అంతకుముందు, శ్రీజ అకులా నేతృత్వంలోని భారత్, అనూహ్యంగా ఫైనలిస్ట్‌గా నిలిచిన మలేషియాను 3-0 తేడాతో ఓడించింది. స్కోరు అలా ఉన్నప్పటికీ, ఈ పోటీ ఏమాత్రం సులభంగా సాగలేదు. స్వస్తిక ఘోష్ భారత్‌కు ఆధిక్యం అందించిన తర్వాత, ఉత్కంఠభరితమైన తొలి బాల్‌లో ఎడమచేతి వాటం బౌలర్ కరెన్ అనక్, శ్రీజను తీవ్రంగా శ్రమకు గురిచేసింది. ఆ తర్వాత, చోపర్ ఆలిస్ చాంగ్ యొక్క గట్టి రక్షణను ఛేదించి యశస్విని ఘోర్పడే టైటిల్‌ను కైవసం చేసుకుంది.





### తైపే ఓపెన్.. సెమీఫైనల్‌కు

# ఉన్నతి, తన్వీ

**న్యూఢిల్లీ:** తైపీ ఓపెన్ 2026లో ఉన్నతి హుడా, తన్వీ శర్మ సెమీఫైనల్‌కు అర్హత సాధించారు. ఈ టోర్నమెంట్‌లో ఉన్నతి హుడా తన తోటి క్రీడాకారిణి దేవికా సిహాగ్‌ను 23-21, 21-16 తేడాతో ఓడించి, తైపీ ఓపెన్ 2026 సెమీఫైనల్స్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. ఉన్నతి ఎనిమిది పాయింట్ల ఆధిక్యంతో స్కోరును 11-3కి చేర్చింది. ఆ తర్వాత దేవిక పుంజుకుని ఆటలోకి వచ్చి స్కోరును 21-21తో సమంచేసింది. కానీ ఉన్నతి తన సంయమనాన్ని కోల్పోకుండా తర్వాతి రెండు పాయింట్లు గెలుచుకుని ఆటను తనవశం చేసుకుంది. రెండవ గేమ్‌లో హుడా విరామ సమయానికి 11-9 స్వల్ప ఆధిక్యాన్ని సాధించింది. ఆ తర్వాత ఆమె ఆటను తన నియంత్రణలోకి తీసుకుని, కోల్పోయిన ప్రతి పాయింట్‌తో శక్తిని కోల్పోతున్నట్లు కనిపించిన తన ప్రత్యర్థిని అధిగమించింది. అలాగే థాయ్‌లాండ్‌కు చెందిన సుపనిదా కటేథాంగ్‌పై తన్వి శర్మ విజయం సాధించడంతో మరో సెమీఫైనల్‌కు భారత క్రీడాకారిణి చేరనుంది. 17 యేళ్ల తన్వి శర్మ తొలి గేమ్‌ను 21-15 తేడాతో గెలుచుకోగా, హోరాహోరీగా సాగిన రెండో గేమ్‌ను థాయ్ క్రీడాకారిణి 18-21 తేడాతో కైవసం చేసుకుంది. అయితే తన్వి సంయమనం కోల్పోకుండా నిర్ణయాత్మక గేమ్‌ను 21-14 తేడాతో గెలిచి, సెమీఫైనల్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది.

### కామన్వెల్త్ గేమ్స్..

## మహిళల డిస్కస్ త్రోలో

# సీమాకు కాంస్యం




**న్యూఢిల్లీ:** 2026 కామన్వెల్త్ గేమ్స్‌లో పురుషుల, మహిళ అథ్లెట్లు అద్భుత ప్రదర్శన చేస్తున్నారు. మహిళల డిస్కస్ త్రోలో భారత క్రీడాకారిణి సీమా కళిరామ్మ కాంస్య పతకం సాధించి, ఈ సీజన్‌లో దేశానికి ఏకైక అథ్లెటిక్స్ పతకాన్ని అందించింది. గ్లాస్గోలో జరిగిన ఈ క్రీడల్లో ఆమె సహచరులైన తజిందర్‌పాల్ సింగ్ తూర్ మరియు పరుల్ చౌదరి తృటిలో పతకాలను కోల్పోయారు. నాలుగు ఫౌల్ ప్రయత్నాలతో కూడిన అస్థిరమైన ప్రదర్శన చేసినప్పటికీ, సీమ 58.65 మీటర్ల అత్యుత్తమ త్రోతో మూడవ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఫౌల్‌తో ప్రారంభించిన తర్వాత, ఆమె 57.32 మీ మరియు 58.65 మీ చెల్లుబాటు అయ్యే త్రోలను నమోదు చేసి, చివరకు వరుసగా మూడు ఫౌల్స్‌తో ముగించింది. భారత్‌కే చెందిన నిధి రాణి 57.10 మీటర్ల ఉత్తమ త్రో తో నాలుగో స్థానంలో నిలిచి, పతకాన్ని తృటిలో కోల్పోయింది. ఇక పురుషుల+110 కేజీల వెయిట్ లిఫ్టింగ్ ఈవెంట్‌లో భారత్‌కు చెందిన లవ్‌ప్రీత్ సింగ్ అద్భుతమైన ప్రదర్శన కనబరిచి రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అతను స్వర్ణ పతక విజేత న్యూజిలాండ్‌కు చెందిన డేవిడ్ లిటి కంటే కేవలం ఒక కిలోగ్రాము వెనుక నిలిచాడు. లవ్‌ప్రీత్ మొత్తం 388 కిలోల బరువును ఎత్తి, అగ్రస్థానాన్ని తృటిలో కోల్పోగా, లిటి 389 కిలోల సంయుక్త ప్రదర్శనతో కామన్వెల్త్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఇంగ్లాండ్‌కు చెందిన ఆండ్రూ గ్రిఫిత్స్ మొత్తం 356 కిలోలతో మూడవ స్థానంలో నిలిచాడు.



### వరల్డ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్..

# నికితాకు రజతం

## కామ్నా, గరిమకు కాంస్యం





**న్యూఢిల్లీ:** అండర్17 ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్-2026లో భారత మహిళా రెజ్లర్లు అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, ఒక రజత, రెండు కాంస్య పతకాలను సాధించి దేశ పతకాల పట్టికను బలోపేతం చేశారు. అజర్‌బైజాన్ లోని బాకులో శుక్రవారం జరిగిన 57 కేజీల విభాగంలో రజత పతకం సాధించడంద్వారా నికితా సెహ్రావత్ భారత్ తరపున అగ్రశ్రేణి ప్రదర్శకురాలిగా నిలిచింది. అక్కడ యునైటెడ్ స్టేట్స్‌కు చెందిన ప్రస్తుత అండర్17 ప్రపంచ రజత పతక విజేత ఎపెనెసా ఎలిసన్‌తో తలపడింది. టైటిల్ బౌట్‌లో నికితా 0-6 తేడాతో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది. ఇక కామ్నా బాబల్, 49 కేజీల విభాగంలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. జపాన్‌కు చెందిన సైకా ఉచిడా చేతిలో సెమీఫైనల్‌లో ఓటమి పాలైన కామ్నా, కాంస్య పతకం కోసం జరిగిన పోరులో రష్యాకు చెందిన ఇరినా సిడీవాపై 3-2 తేడాతో స్వల్ప విజయం సాధించి, పోడియంపై స్థానం దక్కించుకుంది. 73 కేజీల విభాగంలో గరిమ ద్వారా భారతదేశానికి మూడవ పతకం లభించింది. సెమీ ఫైనల్స్‌లో అమెరికన్ రెజ్లర్ కైలీ మాన్యుయల్ చేతిలో 5 -7 తేడాతో ఓటమి పాలైన తర్వాత, మాజీ అండర్15 ఆసియా ఛాంపియన్ అయిన ఆమె అద్భుతంగా పుంజుకుంది. కాంస్య పతకం కోసం జరిగిన పోరులో ఆమె స్పెయిన్‌కు చెందిన పౌలా బెనైక్సా పెరెజ్‌ను టెక్నికల్ సుపీరియారిటీ ద్వారా 10-0 తేడాతో చిత్తుగా ఓడించిం

### స్పెయిన్‌లో తెలంగాణ గ్రాండ్ మాస్టర్

# రాజా రిత్విక్‌కు కాంస్యం

## పోంటెవేద్రా ఇంటర్నేషనల్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో అజేయ ప్రదర్శన

## 9 రౌండ్లలో 7 పాయింట్లతో మూడో స్థానం




**హైదరాబాద్,జులై 31:** తెలంగాణకు చెందిన గ్రాండ్ మాస్టర్ రాజా రిత్విక్ స్పెయిన్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక పోంటెవేద్రా ఇంటర్నేషనల్ చెస్ ఛాంపియన్‌షిప్2026లో కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నారు. ఈనెల 24 నుంచి 30 వరకు స్పెయిన్‌లోని పోంటె వేద్రా నగరంలో నిర్వహించిన ఈ టోర్నీలో రిత్విక్ అద్భుతమైన అజేయ ప్రదర్శనతో మొత్తం 9 రౌండ్లలో 7 పాయింట్లు సాధించి మొత్తం మూడో స్థానంలో నిలిచారు. దీంతో రెండో రన్నరప్ ట్రోఫీ బ్రాంజ్ మెడల్‌ను అందుకున్నారు.ఈ టోర్నీలో ఫ్రాన్స్, గ్రీస్, భారత్, స్పెయిన్, హంగేరీ, ఇటలీ, స్విట్జర్లాండ్, క్యూబా, ఉక్రెయిన్, మెక్సికో, పోర్చుగల్, బ్రెజిల్, బల్గేరియా, ఇరాన్ తదితర దేశాలకు చెందిన 92 మంది అగ్రశ్రేణి క్రీడాకారులుపాల్గొన్నారు. కఠినమైనపోటీలో రాజారిత్విక్ ఒక్క పరాజయం కూడా చవిచూడ కుండా 5విజయాలు, 4డ్రాలతో 7పాయింట్లు సాధించి తన ప్రతిభను చాటారు. టోర్నీ ముగిసే సమయా నికి భారత ఇంటర్నేషనల్ మాస్టర్ ముత్తయ్య అల్, క్యూబాకు చెందిన ఇంటర్నేషనల్ మాస్టర్ రోడ్రిగ్జ్ హెర్నాండెజ్ లూయిస్ డేనియల్, గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్ ముగ్గురూ చెరో 7 పాయింట్లతో సమంగా నిలిచారు. టైబ్రేక్ ఆధారంగా ముత్తయ్య అల్ 46.67 పాయింట్లతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోగా, రోడ్రిగ్జ్ హెర్నాండెజ్ 46 పాయింట్లతో రజతపతకాన్ని, రాజా రిత్విక్ 44.11 టైబ్రేక్ పాయింట్లతో కాంస్య పతకాన్ని అందు కున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని కెల్ యూనివర్సిటీలో ఇంజి నీరింగ్ చదువుతున్న రాజారిత్విక్, ప్రముఖ కోచ్ ఎన్ రామరాజు ఆధ్వర్యంలోని రేస్ చెస్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. ఉక్రెయిన్ సూపర్ గ్రాండ్‌మాస్టర్ అలెగ్జాండర్ గోలోష్చపోవ్ ఆన్‌లైన్ ద్వారా ఆయనకు మార్గదర్శకత్వం అందిస్తున్నారు.


# వారాంతంలో సెన్సెక్స్, నిఫ్టీలకు లాభాలు

**వాణిజ్యం**



**ముంబై,జులై 31:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు వారాంతంలో ట్రేడింగ్‌ను లాభాలతో ముగించాయి. బజాజ్ ఫైనాన్స్ షేరు భారీగా పెరగడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల కొనుగోళ్లు పెంచడం, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడం మార్కెట్లకు ఊతమిచ్చాయి. అయితే ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ కారణంగా ప్రారంభ లాభాలు కొంత పరిమితమయ్యాయి. ట్రేడింగ్‌లో బిఎస్ఇ సెన్సెక్స్166.49 పాయింట్లు పెరిగి 78,094.64 వద్ద, ఎన్ఎస్ఇ నిఫ్టీ 66.45 పాయింట్లు లాభపడి 24,383.60 వద్ద ట్రేడయ్యాయి. ముఖ్యంగా బజాజ్ ఫైనాన్స్ షేరు 6 శాతానికి పైగా ఎగిసింది. తొలి త్రైమాసికంలో కంపెనీ సమీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 28 శాతం పెరిగి రూ.6,081 కోట్లకు చేరినట్లు వెల్లడించింది. కోర్ ఆదాయం పెరగడం, ఆస్తుల నాణ్యత మెరుగుపడటం ఇందుకు ప్రధాన కారణాలుగా కంపెనీ తెలిపింది. సెన్సెక్స్‌లో బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారత్ ఎలక్ట్రానిక్స్, మారుతి సుజుకి, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, అదానీ పోర్ట్స్, సన్ ఫార్మా షేర్లు కూడా లాభాల్లో ట్రేడయ్యాయి. మరోవైపు ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. స్టాక్ ఎక్స్ఛేంజీల గణాంకాల ప్రకారం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు రూ.3,623.51 కోట్ల విలువైన ఈక్విటీలను కొనుగోలు చేశారు. విదేశీ పెట్టుబడుల ప్రవాహం మార్కెట్ సెంటిమెంట్‌కు బలాన్నిచ్చింది. బ్రెంట్ క్రూడ్ ధర 0.38 శాతం తగ్గి బ్యారెల్‌కు 89.37 అమెరికన్ డాలర్ల వద్ద కొనసాగింది. డాలరుతో రూపాయి మారకం విలువలు 95.3650వద్ద నిలిచింది. అంతకుముందురోజు 95.5050వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్ ధరలు రూ.1.41,934గా కొనసాగాయి.

# నిరాశ పరిచిన ఐటిసి




## నికరలాభాల్లో 27.1% క్షీణత

**ముంబయి,జులై 31:** దేశీయ ఎఫ్ఎంసీజీ దిగ్గజం ఐటీసీ తొలి త్రైమాసికంలో నికర లాభం వార్షిక ప్రాతిపదికన 27.1 శాతం తగ్గి రూ.3,579 కోట్లకు పరిమితమైంది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ రూ.4,911 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. మార్కెట్ అంచనాలు రూ.4,368 కోట్లుగా ఉంటే కంపెనీ ఫలితాలు ఆ అంచనాలకు తక్కువగా నమోదయ్యాయి.కంపెనీ కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం కూడా 14.5 శాతం తగ్గి రూ.16,907 కోట్లకు చేరింది. గత యేడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ.19,761 కోట్లుగా ఉండగా, విశ్లేషకుల అంచనా రూ.18,630 కోట్లుగా ఉంది. వడ్డీ, పన్నులు, తరుగుదల, అమోర్టైజేషన్‌కు ముందు లాభం ఎబిడిటా 27.9 శాతం క్షీణించి రూ.4,514 కోట్లకు పడిపోయింది. గత యేడాది ఇదే కాలంలో ఇది రూ.6,261 కోట్లుగా నమోదైంది. మార్కెట్ అంచనా రూ.5,356 కోట్లుగా ఉండగా, ఆ స్థాయికి కూడా చేరుకోలేకపోయింది. దీంతో కంపెనీ ఎబిట్డా మార్జిన్ 31.7 శాతం నుంచి 26.7 శాతానికి పడిపోయి 500 బేసిస్ పాయింట్లు క్షీణించింది. కంపెనీ సిగరెట్ వ్యాపారం ఆదాయం మాత్రం బలమైన వృద్ధిని నమోదు చేసింది.

సిగరెట్ విభాగం ఆదాయం 81 శాతం పెరిగి రూ.15,383 కోట్లకు చేరింది. మరోవైపు అగ్రి వ్యాపార రాబడి 17 శాతం తగ్గి రూ.8,082 కోట్లకు పడిపోయింది. ఎఫ్ఎంసిజి విభాగం ఆదాయం 53 శాతం పెరిగి రూ.21,866 కోట్లకు చేరింది. నిర్వహణ పరంగా చూస్తే సిగరెట్ వ్యాపారంలో లాభ దాయకతపై ఒత్తిడి కనిపించింది. ఈ విభాగం ఎబిడిటా 35 శాతం తగ్గి రూ.3,341 కోట్లకు చేరగా, అగ్రి వ్యాపారఎబిడిటా 18 శాతం క్షీణించి రూ.354 కోట్లకు పరిమితమైంది. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో ఐటిసి షేరు జూలై చివరి ట్రేడింగ్ రోజున ఎన్ఎస్ఇలో 1.42 శాతం క్షీణించి రూ.281 వద్ద ముగిసింది. అదే రోజు నిఫ్టీ సూచీ 0.27 శాతం లాభపడింది. ఐటీసీ షేరు ధర ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు 30.27 శాతం, గత 12 నెలల్లో 31.79 శాతం పడిపోయింది.

## మారుతిసుజుకి ఆదాయం

# రూ.52,456 కోట్లు



**ముంబయి,జులై 31:** దేశంలో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి ఇండియా తొలి త్రైమాసికంలో అమ్మకాలు గణనీయంగా పెరగడంతో రాబడులు రికార్డు స్థాయికి చేరుకున్నప్పటికీ, ముడి పదార్థాల వ్యయం భారీగా పెరగడంతో కంపెనీ లాభదాయకతపై ప్రభావం పడింది.ఈ త్రైమాసికంలో కంపెనీ రూ.3,352 కోట్ల నికర లాభం నమోదు చేసింది. గత యేడాది ఇదే కాలంలో నమోదైన రూ.3,758 కోట్లతో పోలిస్తే 10.8 శాతం తగ్గుదల నమోదైంది.అమ్మకాలతో వచ్చిన ఆదాయం 35.9 శాతం పెరిగి రూ.52,456 కోట్లకు చేరుకుంది. గత యేడాది ఇదే త్రైమాసికంలో ఈ ఆదాయం రూ.38,593 కోట్లుగా ఉంది. దేశీయ విక్రయాలు, ఎగుమతులు బలంగా పెరగడం వల్ల ఆదాయంలో ఈ వృద్ధి నమోదైంది.అయితే నిర్వహణ లాభదాయకత ఎబిడిటాపై ఒత్తిడి కనిపించింది. కంపెనీ ఎబిడిటా రూ.4,312 కోట్లకు పడిపోయింది. గత యేడాది ఇదే కాలంలో ఇది రూ.5,043 కోట్లుగా ఉండగా, ఈసారి 14.5 శాతం తగ్గుదల నమోదైంది. అలాగే ఎబిడిటా మార్జిన్ 13.1 శాతం నుంచి 8.2 శాతానికి క్షీణించింది. కంపెనీ లాభాలు తగ్గడానికి ప్రధాన కారణం ముడి పదార్థాల వ్యయం భారీగా పెరగడమే. మెటీరియల్ ఖర్చు 46 శాతం పెరిగి రూ.32వేల కోట్లకు చేరుకోవడంతో అధిక అమ్మకాల వల్ల వచ్చిన ప్రయోజనం తగ్గిపోయి, నిర్వహణ మార్జిన్లు ఒత్తిడికి గురయ్యాయి. కంపెనీ రికార్డు స్థాయిలో 6,82,724 వాహనాల విక్రయాలు నమోదు చేసింది. ఇది గత యేడాదితో పోలిస్తే 29.3 శాతం అధికం. ఎగుమతులు 28.6 శాతం, ఎస్‌యూవీ విక్రయాలు 44.6 శాతం పెరగడం కంపెనీ యుటిలిటీ వాహనాలపై వినియోగదారుల నుంచి కొనసాగుతున్న బలమైన డిమాండ్‌ను ప్రతిబింబిస్తోంది.




## ఒక్కరోజులో మైక్రోసాఫ్ట్ రాబడులు

# రూ.42 లక్షల కోట్లు

**శాన్‌ఫ్రాన్సిస్కో,జులై 31:** టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ స్టాక్ మార్కెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది.ఒక్కరోజు ట్రేడింగ్‌లో కంపెనీ షేర్లు 15 శాతానికి పైగా దూసుకెళ్లడంతో దాని మార్కెట్ విలువకు ఒక్కరోజే రికార్డు స్థాయిలో 450 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ. 42లక్షల కోట్లు జతయ్యాయి. స్టాక్ మార్కెట్ చరిత్రలో లిస్టయిన ఏ కంపెనీకైనా ఒకే ట్రేడింగ్ సెషన్‌లో ఇంత భారీ స్థాయిలో లాభం రావడం ఇదే తొలిసారి. ఈ అనూహ్య పెరుగుదలతో మైక్రోసాఫ్ట్ మొత్తం మార్కెట్ విలువ 3.35 ట్రిలియన్ డాలర్లకు చేరింది. గతంలో 2025 ఏప్రిల్‌లో ఎన్విడియా నెలకొల్పిన 441 బిలియన్ డాలర్ల సింగిల్ డే గెయిన్ రికార్డును మైక్రోసాఫ్ట్ బద్దలుకొట్టింది. మైక్రోసాఫ్ట్ ఆర్థిక సంవత్సరం నాల్గవ త్రైమాసిక ఫలితాలు, భవిష్యత్ అంచనాలు ప్రకటించిన తర్వాత ఈ అద్భుతం చోటుచేసుకుంది. ముఖ్యంగా కంపెనీ క్లౌడ్ కంప్యూటింగ్ ప్లాట్‌ఫామ్ అయిన అజూర్ పనితీరు పెట్టుబడిదారుల్లో బలమైన విశ్వాసాన్ని నింపింది. ఈ త్రైమాసికంలో అజూర్ ఆదాయవృద్ధి 43 శాతంగా నమోదై అంచనాలను అధిగమించింది. రాబోయే త్రైమాసికంలో ఇది 45 శాతానికి పెరుగుతుందని కంపెనీ అంచనా వేయడం మార్కెట్‌ను మరింత ఉత్సాహపరిచింది. ఈ ఫలితాలతో అజూర్ వార్షిక ఆదాయం తొలిసారిగా 100 బిలియన్ డాలర్ల మైలురాయిని దాటింది. దీంతో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై మైక్రోసాఫ్ట్ పెడుతున్న భారీ ఖర్చుల గురించి ఆందోళన పక్కకు వెళ్లి, వాణిజ్యపరమైన రాబడిపై ఇన్వెస్టర్ల దృష్టి మళ్లింది. కంపెనీ తన ఖర్చుల ప్రణాళికలో పెద్దగా మార్పులు చేయలేదు. రాబోయే త్రైమాసికంలో సుమారు 50 బిలియన్ డాలర్లు, 2026 క్యాలెండర్ సంవత్సరానికి గాను దాదాపు 175 బిలియన్ డాలర్ల మూలధన వ్యయాన్ని అంచనా వేస్తున్నట్లు తెలిపింది. ఈ ఏడాది ఆరంభంలో ఇతర టెక్ కంపెనీలతో పోలిస్తే మైక్రోసాఫ్ట్ షేరు వెనుకబడింది.




## ఐఒసికి తొలి త్రైమాసికంలో

# రూ.2,661 కోట్ల నష్టం

**న్యూఢిల్లీ,జులై 31:** ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తొలి త్రైమాసికంలో రూ.2,661 కోట్ల నికర నష్టాన్ని చవిచూసింది. అయితే మార్కెట్ అంచనా లతో పోలిస్తే కంపెనీ ఫలితాలు మెరుగ్గా ఉన్నాయి. ఐఒసికి రూ.20,295 కోట్ల నష్టం వస్తుందని విశ్లేషకులు అంచనా వేశారు. ఈ త్రైమాసికంలో ఐఒసి కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం త్రైమాసిక ప్రాతిపదికన 26.2 శాతం పెరిగి రూ.2.62 లక్షల కోట్లకు చేరుకుంది.

మార్చి త్రైమాసికంలో కంపెనీ ఆదాయం రూ.2.08 లక్షల కోట్లుగా నమోదైంది. ఎబిట్డా రూ.1,947 కోట్లుగా ఉంది. జూన్ త్రైమాసికంలో ఐఒసి ఎబిట్డా రూ.1,947 కోట్లుగా నమోదైంది. గత త్రైమాసికంలో నమోదైన రూ.20,716 కోట్ల నిర్వహణ లాభంతో పోలిస్తే ఎబిట్డా భారీగా తగ్గింది. గత త్రైమాసికంతో పోలిస్తే ఐఒసి ఆదాయాలు గణనీయంగా తగ్గినప్పటికీ, మార్కెట్ అంచనాలతో పోలిస్తే ఫలితాలు మెరుగ్గా ఉన్నాయి. ముఖ్యంగా నిర్వహణ స్థాయిలో కంపెనీ అంచనా లకు మించి రాణించింది.

### జీతంతోపాటు ఇతర రాబడులపైనా

# జెన్‌జడ్ ఫోకస్




**న్యూఢిల్లీ,జులై 31:** దేశంలో ఐటి రిటర్నుల దాఖలులో భారీ మార్పులు చోటుచేసు కుంటు న్నాయి. కేవలం జీతంపైనే ఆధార పడకుండా పెట్టుబడులు, ఫ్రీలాన్సింగ్, వ్యాపారం, కన్సల్టింగ్ వంటి పలు ఆదాయ వనరుల నుంచి ఆదాయం పొందుతున్న పన్ను చెల్లింపుదారుల సంఖ్య వేగంగా పెరుగుతోందని ట్యాక్స్ ఫైలింగ్ ప్లాట్‌ఫామ్ క్లియర్‌ట్యాక్స్ వెల్లడించింది. యువతలో ఈ ధోరణి మరింత స్పష్టంగా కనిపిస్తోంది. ఈనెల 20 వరకు దాఖలైన ఐటి రిటర్నులను చూస్తే, 25 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన పన్ను చెల్లింపుదారుల్లో 76 శాతం మంది ఒకటి కంటే ఎక్కువ ఆదాయ వనరులను ప్రకటించారు. 2022-23 అసెస్‌మెంట్ ఇయర్‌లో ఈ శాతం కేవలం 14 మాత్రమే ఉండగా, ప్రస్తుతం భారీగా పెరగడం గమనార్హం.

జీతంతో పాటు స్టాక్ మార్కెట్ పెట్టుబడులు, క్యాపిటల్ గెయిన్స్, ఫ్రీలాన్స్ పనులు, స్టార్టప్‌లు, చిన్న వ్యాపారాల ద్వారా ఆదాయం సంపాదిస్తున్నట్లు ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. క్లియర్‌ట్యాక్స్ చరిత్రలో తొలిసారిగా కేవలం జీతం ద్వారానే ఆదాయం పొందుతున్న పన్ను చెల్లింపుదారుల వాటా మొత్తం రిటర్నుల్లో 50 శాతం కంటే దిగువకు పడిపోయింది. ప్రస్తుతం కేవలం 42 శాతం మంది మాత్రమే జీతాన్ని ఏకైక ఆదాయ వనరుగా ప్రకటించగా, 2022-23లో ఈ సంఖ్య 82 శాతం నమోదుకావడం గమనార్హం. ఉద్యోగంతో పాటు పెట్టుబడులు, డిజిటల్ కంటెంట్ సృష్టి, కన్సల్టింగ్, సైడ్ బిజినెస్‌లు వంటి అదనపు ఆదాయ మార్గాలను ఎక్కువ మంది ఎంచుకుంటున్నారు. క్యాపిటల్ గెయిన్స్‌ను ప్రకటిస్తున్న వారిశాతం 39కుచేరుకుంది. వ్యాపార ఆదాయాన్ని ప్రకటిస్తున్న పన్ను చెల్లింపు దారుల వాటా కూడా గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం 26శాతం మంది వ్యాపార ఆదాయాన్ని ప్రకటించగా, 2022-23లో ఈ సంఖ్య 4 శాతం మాత్రమే. గిగ్ ఎకానమీ, ఫ్రీలాన్స్ సేవలు, కన్సల్టింగ్, స్వయం ఉపాధి అవకాశాలు విస్తరించడం దీనికి కారణంగా క్లియర్‌ట్యాక్స్ విశ్లేషించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.